

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




## గ్లోబల్ గ్రీన్ ఎనర్జీ హబ్‌గా ఏపీ

- మంత్రి నారా లోకేష్

3

# జయహో శకపురుష...!


ఎన్టీఆర్... ఈ మూడక్షరాలు భౌతికంగా దూరం అయి మూడు దశాబ్దాలు దాటినా ఇప్పటికి కూడా ఈ పదం వింటే తెలుగువారిలో తెలియని భావోద్వేగం... నేటి తరం తెలుగువారికి కూడా ఎన్టీఆర్ అంటే దైవత్వం, సౌజన్యం, రాజసం, పరాక్రమం... ఇవన్నీ ఒకే తేజోమయ రూపంలో కనిపిస్తాయి. గతంలో తిరుపతి వెళ్లిన యాత్రికులు మద్రాస్ వెళ్లి ఎన్టీఆర్‌ను దర్శించుకోవడం ఒక సంప్రదాయంగా ఉండేది, ఎందుకంటే ఆయన కేవలం నటుడు కాదు, ప్రజల హృదయాల్లో దేవుడిగా నిలిచిన మహానుభావుడు.

ఎన్టీఆర్ పిలుపు ఒక నవ్యోపదేశం, పలుకు ఒక సంచలనం, ప్రతి మాట ఒక తూటా, సందేశమే ప్రజలకు స్ఫూర్తి. ముప్పై మూడేళ్ల తెర జీవితంలో, పదమూడేళ్ల రాజకీయ జీవితంలో నాయకుడిగా వెలిగిన చిరస్మరణీయుడు, సిసలైన ప్రజానాయకుడు నందమూరి తారకరామారావు. తెలుగుజాతికి, తెలుగుభాషకు దేశవ్యాప్త గుర్తింపు తెచ్చిన మహానుభావుడు. "నాయకుడంటే ఇలా ఉంటాడు" అని పాలించి చూపించారు. రాజకీయ డిక్షనరీలో తొలిపేజీలో ఎప్పుడూ ఎన్టీఆర్ పేరే మొదటి స్థానంలో ఉంటుంది.

చైతన్య రథం ఎక్కి ఊరూరా తిరిగి, పార్టీ స్థాపించిన 9 నెలల్లోనే అధికారాన్ని చేపట్టి, దశాబ్దాల చరిత్ర ఉన్న కాంగ్రెస్‌ను మట్టికరిపించారు. "రైట్ పర్సన్ ఇన్ రైట్ టైమ్ అనే మాటను అక్షరాలా నిజం చేశారు. ఢిల్లీ నాయకులను బెంబేలెత్తించి, తెలుగోడి సత్తా రుచి చూపించారు. పట్టుదల, క్రమశిక్షణకు మారుపేరైన ఎన్టీఆర్ స్థిరమైన ప్రభుత్వం, ప్రభావవంతమైన ప్రతిపక్షాన్ని ప్రజలకు అందించారు.

### సంక్షేమ పథకాలకు తారకమంత్రం

తప్పుడు వాగ్దానాలు, తప్పించుకునే ధోరణి ఆయన పాలనలో ఎన్నడూ దరిచేరలేదు. లక్ష్య సాధనలో వివేకానందుడి మాటల్ని ఒంటిపట్టించుకున్న ఎన్టీఆర్ ఎన్నడూ వెనకడుగు వేయలేదు. సంక్షేమ పథకాలకు తారకమంత్రం అంటే నందమూరి తారకరామారావు. స్త్రీలకు ఆస్తిలో సమాన వాటా హక్కు కల్పించే చట్టం తెచ్చిన ఘనత ఎన్టీఆర్‌దే, ఇది నేటికీ దేశ చరిత్రలో మహిళల సాధికారతకు కీలక మైలురాయిగా నిలిచింది. బలహీన వర్గాలకు లక్షలాది



ఇళ్లు కట్టించారు. రెండు రూపాయలకు కిలో బియ్యం వాగ్దానం చేసి, ఆర్థిక ఇబ్బందులను తట్టుకుని నిలబెట్టుకున్నారు, ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా సంచలనంగా నిలిచింది. తెలుగుగంగ ప్రాజెక్టులో రాయలసీమ సాగునీటి అంశాన్ని చేర్చి, రైతుల ఆకలిని తీర్చారు. వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు, పురోహితులుగా ఎవరైనా ఉండవచ్చనే సంస్కరణలు ఎన్టీఆర్ తీసుకువచ్చిన సామాజిక న్యాయానికి నిదర్శనాలు. తెలుగుదేశం పార్టీలో బడుగు బలహీన వర్గాలకు ఉన్నత పదవుల కోసం అయన చేసిన కృషి ఫలితంగా ఈ నాటికీ ఆ వర్గాలు తెలుగుదేశం పార్టీకి అండగా ఉన్నాయి. తెలంగాణలో పటేల్-పట్వారి వ్యవస్థ రద్దు చేసి బలహీన వర్గాలకు ఆశాకిరణంగా నిలిచారు. దేశంలో ప్రధాన ప్రతిపక్షాలను ఒక తాటిపైకి తెచ్చిన నేతగా చరిత్రలో నిలిచిపోయారు.

తెలుగు సినిమా చరిత్రలో ప్రభంజనం సృష్టించి, రాజకీయాల్లో అడుగుపెట్టి ప్రజాహిత పాలనకు నిలువెత్తు రూపంగా నిలిచారు. ప్రతి తెలుగువాడి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన నటసార్వభౌముడు, ప్రజానాయకుడు.

అన్న ఎన్టీఆర్ పాలన స్ఫూర్తితో నేడు తెలుగుదేశం పార్టీ దేశ, రాష్ట్ర రాజకీయాల్లో కీలకమైన శక్తిగా నిలిచింది. ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ ఆయన ఆశయాలు, సంక్షేమ దృక్పథం, తెలుగు ఆత్మగౌరవం, ప్రజాహిత పాలనతో ఇప్పటికీ ప్రేరణ పొందుతూ, ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉండటమే కాకుండా జాతీయ స్థాయిలో కూడా నిర్ణయాత్మక పాత్ర పోషిస్తోంది. తెలుగువాడి చరిత్ర ఉన్నంత కాలం తెలుగుదేశం పార్టీ నిలిచి ఉంటుంది.

యుగపురుషుడు, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, జాతీయ రాజకీయాలకు కొత్త దిశానిర్దేశం చేసిన మహానేత నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నాం. ఆయన ఆశయాలు, సంక్షేమ దృక్పథం ఇప్పటికీ కోట్లాది తెలుగువారిని ప్రేరేపిస్తున్నాయి. ఎన్టీఆర్ జీవితం ఒక యుగం - అది ఎప్పటికీ అంతరించదు!

నూటికో కోటికో ఒక్కరు.. ఎప్పుడో ఎక్కడో పుడతారు.. వారిలో ఎన్టీఆర్ ఒక్కరు. ఆ తేజస్సు ఇప్పటికీ మసకబారలేదు... ఆ ఆకర్షణ ఇప్పటికీ తగ్గలేదు... ఆ ప్రభావం ఇప్పటికీ కోట్లాది తెలుగువారి ఆత్మల్లో జీవిస్తూనే ఉంది... మా హృదయాలలో చిరస్మరణీయంగా నిలిచే ఉంది.

**జయహొ శకపురుష... జయహొ అన్న ఎన్టీఆర్!**
**జై ఎన్టీఆర్! జై తెలుగుదేశం!**
**(నేడు స్వర్గీయ ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా)**




# గ్రీన్ ఎనర్జీకి గ్లోబల్ క్యాపిటల్‌గా ఏపీ

ప్రపంచ స్వచ్ఛ ఇంధన రంగంలో ఆంధ్రప్రదేశ్ మైలురాయి విజయం సాధించింది. 2024 అక్టోబర్‌లో ఆంధ్రప్రదేశ్ సమగ్ర స్వచ్ఛ ఇంధన విధానాన్ని ప్రారంభించినప్పుడు.. ఏపీని దేశ గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తీర్చిదిద్దాలనే స్పష్టమైన సంకల్పాన్ని వెల్లడించాం. ఇప్పుడు కాకినాడలో ఏఎం గ్రీన్ సంస్థ చేపడుతున్న 1.5 ఎంటీపీఏ గ్రీన్ అమోనియా ప్రాజెక్టు ఏర్పాటు పనులు ప్రారంభించనుండటం మైలురాయిగా నిలుస్తోంది. దీని ద్వారా ఆంధ్రప్రదేశ్ విశ్వసనీయ గ్రీన్ ఎనర్జీ ఎగుమతిదారుగా మారే దిశగా మరో కీలక అడుగు వేసింది. 10 బిలియన్ డాలర్ల విలువైన ఈ సమగ్ర పెట్టుబడి ప్రాజెక్ట్‌లో 7.5 గిగావాట్ల సౌర, పవన విద్యుత్ సామర్థ్యం, 1 గిగావాట్ పంప్డ్ స్టోరేజ్ హైడ్రో విద్యుత్ కేంద్రం ఉన్నాయి. అన్నీ ఆంధ్రప్రదేశ్‌లోనే ఏర్పాటు కావడం మన ఎండ్-టు-ఎండ్ స్వచ్ఛ ఇంధన ఎకోసిస్టమ్ బలాన్ని స్పష్టంగా చూపిస్తోంది. కాకినాడలో ఉత్పత్తి అయ్యే గ్రీన్ అమోనియా జర్మనీతో పాటు ఇతర అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి అవుతుంది. ఇది ప్రపంచంలోనే ఈ తరహాలో తొలి ప్రాజెక్ట్. ఈ చారిత్రక ప్రాజెక్టు సంబంధించిన పరికరాల ఏర్పాటు కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి పాల్గొనటం చారిత్రాత్మక సందర్భం.

2

భవిష్యత్తు ఇంధన అవసరాల కోసం ప్రపంచం స్వచ్ఛ, మరింత స్థిరమైన ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తున్న సమయంలో గ్రీన్ అమోనియా మెరుగైన ప్రత్యామ్నాయాలలో ఒకటి. ఈ దిశగా ఆంధ్రప్రదేశ్ కీలక ముందడుగు వేయడం గర్వంగా ఉంది. కాకినాడ ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుకు కేంద్రంగా మారనుంది. ఇది క్లీన్ ఎనర్జీ రంగంలో దేశం నిర్దేశించుకున్న లక్ష్యసాధనకు, కర్బన ఉద్గారాల తగ్గింపునకు ప్రపంచ దేశాల ప్రయత్నాలకు ఎంతగానో దోహదపడుతుంది. కాకినాడలో ఏఎం గ్రీన్ సంస్థ పెడుతున్న ఈ భారీ పెట్టుబడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విధానాలు, క్లీన్ ఎనర్జీ పర్యావరణ వ్యవస్థపై పెట్టుబడిదారుల బలమైన విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. క్లీన్ ఎనర్జీ దిశగా సాగే ఈ ప్రస్థానంలో మాతో కలిసి నడవాలని ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నాను.

**- సీఎం చంద్రబాబు నాయుడు**

- గ్రీన్ హైడ్రోజన్, అమోనియా ఉత్పత్తికి కేంద్రంగా కాకినాడ
- ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టు సాకారం
- అనుమతిచ్చిన ఏడాదిలో ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చడం సంతోషం
- చరిత్ర తిరగరాయటం తెలుగువాళ్లకే సాధ్యం
- దేశంలోనే అత్యుత్తమంగా ఏపీ క్లీన్-గ్రీన్ ఎనర్జీ పాలసీ
- గ్లోబల్ సంస్థలు ఏపీ నుంచి కార్యకలాపాలు నిర్వహించాలి
- విద్యుత్ కొనుగోలు ధరను యూనిట్‌కు రూ.1.19 మేర తగ్గించేలా కృషి
- కాకినాడలో ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్రాజెక్టు శంకుస్థాపనలో ముఖ్యమంత్రి చంద్రబాబు




# పెట్టుబడులే లక్ష్యం!

## నేడు దావోస్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు

- ప్రపంచ ఆర్థిక సదస్సులో దిగ్గజ పారిశ్రామికవేత్తలతో భేటీలు
- ఐబీఎం, గూగుల్ క్లౌడ్, ఏపీ మోలర్ మేర్స్క్ సంస్థల సీఈఓలతో చర్చలు
- స్విట్జర్లాండ్, యూఏఈ సహా వివిధ దేశాల ప్రతినిధులతో సమావేశాలు
- తొలిరోజు 20 దేశాలకు చెందిన ఎన్నారైలతో తెలుగు డయాస్పోరా కార్యక్రమం
- 4 రోజుల పర్యటనలో 36 కార్యక్రమాల్లో పాల్గొననున్న సీఎం
- 23వ తేదీన హైదరాబాద్‌కు తిరిగిరానున్న ముఖ్యమంత్రి

3

# ప్రాధాన్యతల వారీగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం

- ఈ ఏడాదిలోనే వెలిగొండ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పూర్తి
- త్వరలో వెలిగొండ ప్రాజెక్టు సందర్శిస్తా
- పూర్వోదయ స్కీం అమలుపై మరింత శ్రద్ధ
- పీపీపీలో చేపట్టాల్సిన ప్రాజెక్టుల సమగ్ర జాబితా సిద్ధం చేయండి
- వివిధ పథకాల అమలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- దావోస్ పర్యటన నుంచి తిరిగి రాగానే నివేదికలను సమర్పించాలని సీఎం ఆదేశం

4



చైతన్యరథం




# గ్రీన్ ఎనర్జీకి ప్రపంచ కేంద్రంగా ఏపీ



- గ్రీన్ హైడ్రోజన్, అమోనియా ఉత్పత్తికి కేంద్రంగా కాకినాడ
- ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టు సాకారం
- అనుమతిచ్చిన ఏడాదిలో ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చడం సంతోషం
- చరిత్ర తిరగరాయటం తెలుగువాళ్లకే సాధ్యం
- దేశంలోనే అత్యుత్తమంగా ఏపీ క్లీన్-గ్రీన్ ఎనర్జీ పాలసీ
- గ్లోబల్ సంస్థలు ఏపీ నుంచి కార్యకలాపాలు నిర్వహించాలి
- విద్యుత్ కొనుగోలు ధరను యూనిట్‌కు రూ.1.19 మేర తగ్గించేలా కృషి
- కాకినాడలో ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్రాజెక్టు శంకుస్థాపనలో ముఖ్యమంత్రి చంద్రబాబు

కాకినాడ (చైతన్యరథం): గ్రీన్ హైడ్రోజన్-గ్రీన్ అమోనియా ఉత్పత్తికి దేశంలోనే ఆంధ్రప్రదేశ్ కీలకమైన రాష్ట్రంగా అవతరిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా ప్రాజెక్టును కాకినాడలో ఏర్పాటు చేయటం సంతోషకరమన్నారు. ఈ ప్రాజెక్టుతో ప్రపంచం మొత్తం కాకినాడ వైపు చూస్తుందన్నారు. 2029-30 నాటికి ఏఎమ్ గ్రీన్ ప్రాజెక్టు ప్రపంచంలోనే అత్యుత్తమంగా మారాలని ఆకాంక్షించారు. శనివారం కాకినాడలో గ్రీన్ కో అనుబంధ సంస్థ ఏమ్ గ్రీన్ ఏర్పాటు చేస్తోన్న గ్రీన్ అమోనియా ప్లాంటుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో కలిసి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన ప్లాంట్ నమూనాను పరిశీలించారు. 495 ఎకరాల్లో, 2 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తోన్న ఈ ప్లాంట్ పూర్తైతే ఏడాదికి 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల అమోనియా ఉత్పత్తి కానుందని సంస్థ ప్రతినిధులు వివరించారు.

## 2027 జూన్‌కు 1.5వీమీ గ్రీన్ అమోనియా ఉత్పత్తి ప్రారంభం

ఈ ఏడాది సంక్రాంతి పండుగను ప్రజలు అద్భుతంగా జరుపుకున్నారని, ఇదే సమయంలో ప్రపంచం మొత్తం చూసే ఈ ప్లాంట్ శంకుస్థాపన జరగడం సంతోషంగా ఉందని సీఎం చంద్రబాబు చెప్పారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లోని తమ స్వస్థలాలకు వివిధ ప్రాంతాల నుంచి 30 లక్షల మందికిపైగా ప్రజలు వచ్చారన్నారు. హైదరాబాద్ నుంచి 3 లక్షల వాహనాల్లో పండగ కోసం ఏపీకి వచ్చారు. సంక్రాంతి వేడుకల్లో భాగంగా జగ్గన్నతోట ప్రభల తీర్థం ఉత్సవాలు అత్యద్భుతంగా నిర్వహించారు. ఇదే సమయంలో ఏఎం గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభించిన ప్రమోటర్లకు అభినందనలు. గత ఏడాది గ్రీన్ అమోనియా ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతి ఇచ్చాం. సరిగ్గా ఏడాదిలో కార్యరూపం దాల్చింది. 2027 జూన్ కల్లా గ్రీన్ అమోనియా ఉత్పత్తి ప్రారంభం అవుతుంది. చరిత్ర తిరగ రాయటం తెలుగువాళ్ల వల్లే సాధ్యం అవుతుంది. కాకినాడ నుంచి జర్మనీకి గ్రీన్ అమోనియాసరఫరా అవుతుంది. గతంలో గ్రే అమోనియా తయారీని నాగార్జునా ఫెర్టిలైజర్స్ చేపట్టింది. ఇప్పుడు అదే ప్రాంతంలో గ్రీన్ అమోనియా ఉత్పత్తితో పర్యావరణహిత ఉత్పత్తులు తయారవుతాయి. పర్యావరణ సమతుల్యత సాధించటమే ప్రస్తుతం ఉన్న లక్ష్యం. అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని సీఎం అన్నారు.

## ప్రధాని మోదీ లక్ష్యాలకు అనుగుణంగా...

ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. ఆయన నిర్దేశించిన లక్ష్యాన్ని అందిపుచ్చుకుని ఏపీలో 160 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని తయారు చేయాలని నిర్ణయించుకున్నాం. సోలార్ ప్యానెళ్లు ఇళ్లపై ఏర్పాటు చేసుకుని విద్యుత్ ఉత్పత్తి చేస్తూ వినియోగదారులు ప్రోజ్యూమర్లుగా మారారు. ఏపీ తీర ప్రాంతంలో 20 పోర్టులు రాబోతున్నాయి. సౌర, పవన, జల విద్యుత్, పంప్డ్ స్టోరేజీ లాంటి విద్యుత్‌ఉత్పత్తికి,గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా ఉత్పత్తికి ఏపీ అనుకూలమైన రాష్ట్రం. కాకినాడలో నిర్మిస్తున్న ఈ ప్లాంట్ ద్వారా గ్రీన్ హైడ్రోజన్, అమోనియా, ఇథనాల్,గ్రీన్ మాలిక్యూల్స్ లాంటి ఉత్పత్తులు వస్తాయి. ఇకపై ప్రపంచంలో ఎక్కడైనా సరే గ్రీన్ ఎనర్జీ గురించి చర్చ వస్తే కాకినాడ పేరే వినిపిస్తుంది. గ్రీన్ హైడ్రోజన్, అమోనియా ద్వారా ప్రపంచ పటంలో కాకినాడ నిలుస్తుందని ముఖ్యమంత్రి అన్నారు.




## ఏపీ క్లీన్-గ్రీన్ ఎనర్జీ పాలసీ దేశంలోనే భేష్

కాకినాడలోనే 2 గిగావాట్ల సామర్థ్యం ఉన్న ఎలక్ట్రోలైజర్స్ తయారీకి ఏఎమ్ గ్రీన్ నిర్ణయించటం అభినందనీయం. ఏపీ క్లీన్, గ్రీన్ ఇంటిగ్రేటెడ్ ఎనర్జీ పాలసీ-2024 దేశంలోనే అత్యుత్తమంగా ఉంది. పారిశ్రామికరంగానికి అనుకూలమైనవిధానాల ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావటమే మా ప్రభుత్వ లక్ష్యం. ఒక్క నిమిషం కూడా ఆలస్యం చేయకుండా పరిశ్రమలకు అనుమతులు ఇస్తున్నాం. గ్రీన్ అమోనియా ద్వారా ప్రకృతి సేద్యానికి కూడా ఎంతో ఉపయోగం ఉంటుంది. తద్వారా పర్యావర ణానికి మేలు, ప్రజల ఆరోగ్యానికి రక్షణ. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా అభివృద్ధి జరిగి సంపద రావాలి. తద్వారా సంక్షేమం జరగాలని సీఎం అన్నారు.

## ట్రాన్స్ మిషన్ నష్టాలు తగ్గించే యత్నం

దేశానికి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం మన రాష్ట్రానికే వచ్చాయి...దీనికి కారణం ఆంధ్రప్రదేశ్‌పై ఉన్న నమ్మకం. రాష్ట్రంలో విద్యుత్ కొనుగోలు భారాన్ని యూనిట్‌కు రూ.1.19 మేర తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే యూనిట్‌కు 29 పైసల మేర కొనుగోలు భారాన్ని తగ్గించాం. ట్రాన్స్‌మిషన్ నష్టాలు కూడా తగ్గిస్తాం. విశాఖలో 1 గిగావాట్ సామర్థ్యంతో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు గూగుల్ సంస్థ ముందుకు వచ్చింది. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, క్వాంటం వంటి రంగాలపై దృష్టి సారించి భవిష్యత్‌కు నాంది పలికాం. ఈ ఏడాదిలోనే అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు ప్రారంభం అవుతాయి. రాష్ట్రంలో స్పేస్ టెక్నాలజీ లాంటి సాంకేతికతపై కూడా పెద్ద ఎత్తున పురోగతి సాధిస్తాం. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ నాలెడ్జ్ ఎకానమీకి కేంద్రంగా మారుతుంది. గ్లోబల్ సంస్థలు ఏపీ నుంచి కార్యకలాపాలు నిర్వహించాలని పిలుపునిస్తున్నాను. రాష్ట్రంలోకి వచ్చే పెట్టుబడులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పెట్టుబడిదారులకు ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.





# పెట్టుబడులే లక్ష్యం!

## నేడు దావోస్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు

- ప్రపంచ ఆర్థిక సదస్సులో దిగ్గజ పారిశ్రామికవేత్తలతో భేటీలు
- ఐబీఎం, గూగుల్ క్లౌడ్, ఏపీ మోలర్ మేర్స్క్ సంస్థల సీఈఓలతో చర్చలు
- స్విట్జర్లాండ్, యూఏఈ సహా వివిధ దేశాల ప్రతినిధులతో సమావేశాలు
- తొలిరోజు 20 దేశాలకు చెందిన ఎన్నారైలతో తెలుగు డయాస్పోరా కార్యక్రమం
- 4 రోజుల పర్యటనలో 36 కార్యక్రమాల్లో పాల్గొననున్న సీఎం
- 23వ తేదీన హైదరాబాద్‌కు తిరిగి రానున్న ముఖ్యమంత్రి




అమరావతి (చైతన్యరథం): వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, అధికారుల బృందం ఆదివారం దావోస్ బయల్దేరి వెళ్లనుంది. 4 రోజుల పాటు దావోస్‌లో ముఖ్యమంత్రి పర్యటించనున్నారు. 19వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సులో వివిధ పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి ముఖాముఖి భేటీలు, కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. సీఎం చంద్రబాబు ఆదివారం రాత్రి 8.35 గంటలకు విజయవాడ విమానాశ్రయం నుంచి బయల్దేరి ఢిల్లీ చేరుకుంటారు. అక్కడి నుంచి బయలుదేరి 19 తేదీ ఉదయం జ్యూరిచ్ విమానాశ్రయానికి చేరుకుంటారు. జ్యూరిచ్‌లోని హిల్టన్ హోటల్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబుతో స్విట్జర్లాండ్‌లో భారతీయ రాయబారి మృదుల్ కుమార్ మర్యాదపూర్వకంగా భేటీ అవుతారు. అనంతరం ఎరోస్ ఇన్నోవేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ కిషోర్ లుల్లా, సహ అధ్యక్షులు రిధిమా లుల్లా, స్వనీత్ సింగ్‌లు కూడా ముఖ్యమంత్రితో సమావేశం అవుతారు. అనంతరం భారత ఎంబసీ ఆధ్వర్యంలో జ్యూరిచ్‌లోని హిల్టన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన తెలుగు డయాస్పోరా కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకానున్నారు. మొత్తం 20 దేశాల నుంచి వచ్చే ఎన్ఆర్ఐలతో నిర్వహించే తెలుగు డయాస్పోరా కార్యక్రమంలో పాల్గొని తెలుగు ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించనున్నారు. అనంతరం సీఎం చంద్రబాబు జ్యూరిచ్ నుంచి రోడ్డు మార్గాన దావోస్ వెళ్తారు. దావోస్‌లో తొలిరోజు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆర్థిక పర్యాటక విభాగాల మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రితో వివిధ దేశాల మధ్య జరిగే సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. అనంతరం టాటాసన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్.. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి ముఖ్యమంత్రితో భేటీ కానున్నారు. సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ కూడా దావోస్ వేదికగా సీఎంతో సమావేశం అవుతారు. విదేశీ మీడియా సంస్థ పొలిటికోకు ముఖ్యమంత్రి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇవ్వనున్నారు.

### దిగ్గజ పారిశ్రామిక ప్రతినిధులతో సీఎం ముఖాముఖి


దావోస్ రెండో రోజు పర్యటనలో భాగంగా హోటల్ మోరోసాని ప్రోమెనేడ్‌లో ఇండియా ఎట్ సెంటర్ జియోగ్రఫీ గ్రోత్ – ఏపీ అడ్వాంటేజ్ పేరిట సీఐఐ నిర్వహిస్తున్న బ్రేక్‌ఫాస్ట్ సెషన్‌లో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. అనంతరం భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇండియా లాంజ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవుతారు. అనంతరం దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎం ఛైర్మన్ సీఈఓ అరవింద్ కృష్ణతో ముఖ్యమంత్రి భేటీ అవుతారు. ఈ భేటీకి ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కూడా హాజరుకానున్నారు. గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్‌తోనూ సీఎం సమావేశం కానున్నారు. ముఖాముఖి భేటీల అనంతరం ఏపీ లాంజ్‌లో నిర్వహించనున్న వన్ ఫ్యామిలీ– వన్ ఎంటర్ ప్రెన్యూర్ ప్యానెల్ డిస్కషన్‌కు సీఎం హాజరుకానున్నారు. అనంతరం ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ సీఎన్‌బీసీ ఇంటర్నేషనల్‌కు కూడా ముఖ్యమంత్రి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇవ్వనున్నారు. దావోస్ కాంగ్రెస్ సెంటర్‌లో వరల్డ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ జనరల్ డారెన్ టాంక్, అనిల్ మూర్తిలతో సీఎం కొద్దిసేపు సమావేశం అవుతారు. ప్రపంచ ఆర్థిక సదస్సు సెషన్‌లో ఎనర్జీ ట్రాన్సిషన్ లీడర్స్ సమావేశంలోనూ ముఖ్యమంత్రి పాల్గొంటారు. స్విట్జర్లాండ్ ఆర్థిక వ్యవహారాల డిప్యూటీ మినిస్టర్ హెలెన్ బడ్లిగర్ అర్టిడా, రాయబారి ఆండ్రియా రౌబర్‌తో సీఎం చర్చలు జరుపుతారు. అలాగే స్విట్జర్లాండ్ పార్లమెంటు సభ్యుడు, భారత– స్విస్ ఫ్రెండ్ షిప్ గ్రూప్ అధ్యక్షుడు నిక్ గుగ్గర్ సహా ఇతరులతో సీఎం సమావేశం కానున్నారు. అనంతరం ఎన్విడియా ఉపాధ్యక్షుడు కాలిస్టా రెడ్మండ్‌తో సీఎం భేటీ అవుతారు. ఇజ్రాయెల్ ఆర్థిక పారిశ్రామిక విభాగం మంత్రి నిర్ బర్కత్, ఆ దేశ ట్రేడ్ కమిషనర్ రోయ్ ఫిషర్, స్విట్జర్లాండ్‌లో ఇజ్రాయెల్ ఎకనామిక్ ట్రేడ్ మిషన్ హెడ్ షిర్ స్లర్టి తోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చలు జరపనున్నారు. రెండో రోజు సాయంత్రం జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ ఎండీ సజ్జన్ జిందాల్, జెఎస్‌డబ్ల్యూ సిమెంట్స్, పెయింట్స్ సంస్థల ఎండీ పార్థ్ జిందాల్‌తోనూ సీఎం భేటీ అవుతారు. అంతర్జాతీయ కంటైనర్ లాజిస్టిక్స్ సంస్థ మోలర్ మేర్స్క్ సీఈఓ విన్సెంట్ క్లెర్క్‌తో సీఎం ముఖాముఖి సమావేశం అవుతారు. ఈ రెండు సమావేశాలకూ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కూడా హాజరు కానున్నారు. అనంతరం జాన్ కాక్రిల్ సంస్థ గ్రూప్ సీఈఓ జీన్ లక్ మారాంగేతో ముఖ్యమంత్రి భేటీ అవుతారు. విజన్ టు వెలాసిటీ– డెప్లాయింగ్ ఇన్నోవేషన్ ఎట్ స్కేల్ పేరిట నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరవుతారు.

### ప్రపంచ ఆర్థిక సదస్సులో వివిధ చర్చలకు సీఎం హాజరు

దావోస్‌లో మూడో రోజు వరల్డ్ ఎకనామిక్ ఫోరం కాంగ్రెస్ సెంటర్‌లో జరిగే పారిశ్రామిక పురోగతి అంశంపై నిర్వహించే సెషన్‌లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. హెరైసిస్ ఛైర్మన్ ఫ్రాంక్ రిచర్‌తో భేటీ కానున్నారు. తమారా హాస్పిటాలిటీ సంస్థ ఫౌండర్ సృష్టి శిబులాల్, ఆ సంస్థ సీఓఓ కుష్బు అవస్థి, కాలిబో ఏఐ అకాడెమీ సీఈఓ రాజ్ వట్టికుట్టి, స్టార్ట్ శాండ్బ్రూఫర్‌లు ముఖ్యమంత్రితో చర్చలు జరుపుతారు. అనంతరం ఏపీ సీఎన్ఎఫ్ నిర్వహించే హీలింగ్ ప్లానెట్ త్రూ రీజెనరేటివ్ ఫుడ్ సిస్టమ్స్ పేరిట జరిగే చర్చా కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరుకానున్నారు. ఆ తర్వాత ట్రిలియన్ డాలర్ పైవోట్ రీరైటింగ్ మార్కెట్ సిగ్నల్స్ ఫర్ నేచర్ పాజిటివ్ గ్రోత్ అనే అంశంపై చర్చా కార్యక్రమంలోనూ సీఎం పాల్గొంటారు. బ్లూమ్ బెర్గ్ సంస్థ నిర్వహించనున్న ట్రిలియన్స్ ఆఫ్ డాలర్స్ ఏఐ మూమెంట్ ట్రాన్స్‌ఫార్మింగ్ గ్లోబల్ ఎకానమీ సెషన్ లో ముఖ్య వక్తగా ప్రసంగించనున్నారు. ఏపీ లాంజ్‌లో నిర్వహించే బిల్డింగ్ ఇండియా ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్యక్రమంలో కేంద్ర మంత్రులతో కలిసి సీఎం హాజరు అవుతారు. వాతావరణ మార్పులపై ఫైనాన్సింగ్ రీజెనరేషన్ మొబిలైజింగ్ కేపిటల్ పేరిట నిర్వహించే మరో కార్యక్రమంలోనూ ముఖ్యమంత్రి పాల్గొంటారు.మొత్తంగా దావోస్‌లో 36 కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారు. ప్రభుత్వాల మధ్య జరిగే 3 సమావేశాల్లో పాల్గొంటారు. పారిశ్రామికవేత్తలతో 16 వన్ టు వన్ సమావేశాలు జరగనున్నాయి. 9 రౌండ్ టేబుల్ సమావేశాలు, ప్లీనరీ సెషన్స్‌లో సీఎం పాల్గొంటారు. సీఎన్బీసీ ఇంటర్నేషనల్ సహా వివిధ అంతర్జాతీయ మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇస్తారు. పర్యటన తొలి రోజున జ్యూరిచ్‌లో తెలుగు డయాస్పోరా మీటింగ్‌లో పాల్గొంటారు. జనవరి 22 తేదీన దావోస్ నుంచి జ్యూరిచ్‌కు చేరుకుని స్విట్జర్లాండ్ కాలమానం ప్రకారం 2.35 గంటలకు స్వదేశానికి బయల్దేరి రానున్నారు. 23వ తేదీ ఉదయం 8.25 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు హైదరాబాద్ చేరుకోనున్నారు.

# తెలుగుజాతిని నెంబర్ వన్‌గా నిలుపుతాం

- సంక్రాంతి సంబరాలతో మన సాంప్రదాయాలను ఘనంగా చాటారు
- కాకినాడలో ఏఎం గ్రీన్ అమోనియా ప్రాజెక్టుకు శంకుస్థాపన ఒక మైలురాయి
- ఎక్స్‌లో సీఎం చంద్రబాబు



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో ప్రతి పల్లెలో సంక్రాంతి సంబరాలు ఎంతో ఘనంగా జరిగాయి.. ప్రజలు దేశ విదేశాల నుంచి తరలి వచ్చి భోగి, సంక్రాంతి, కనుమ పండుగల గొప్ప తెలుగు సంప్రదాయాన్ని మరోసారి ఘనంగా చాటారని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో సీఎం పోస్ట్ చేశారు. ఎవరు ఎక్కడున్నా సంక్రాంతికి జన్మభూమికి వచ్చి కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, సొంత గ్రామస్తులతో గడిపే సాంప్రదాయంలో భాగంగా నేను కూడా నా కుటుంబంతో కలిసి నారావారిపల్లిలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నాను. ఇది ఎంతో సంతృప్తిని ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో జగ్గన్నతోట ప్రభల తీర్థం కార్యక్రమాన్ని ఈసారి రాష్ట్ర పండుగగా జరుపుకున్నాం. ఏకాదశ రుద్రులు ఒక్క చోట చేరగా, లక్షల మంది భక్తులు పాల్గొనగా వైభవోపేతంగా జరిగిన ప్రభల పండుగ మన సంస్కృతిని చాటింది. ఇదే సమయంలో కాకినాడలో ఏఎం గ్రీన్ అమోనియా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తున్నాం. దేశంలోనే తొలిసారి ఏర్పాటు చేస్తున్న ఈ ప్లాంట్ తో ఏడాదికి 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ అమోనియా ఉత్పత్తి అవుతుంది. మన రాష్ట్రం నుంచి విదేశాలకు ఎగుమతి అవుతుంది. పండుగలకు ప్రాధాన్యం ఇస్తూ అటు సాంప్రదాయానికి ...ఇటు టెక్నాలజీతో పరిశ్రమలకు ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రాభివృద్ధికి పనిచేస్తున్నాం. మన విలువలు, ఆచారాలు పాటిస్తూనే తెలుగుజాతిని నెంబర్ వన్‌గా నిలిపేందుకు ప్రయత్నిస్తామని మరోసారి మాటిస్తున్నానని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు.

# గ్లోబల్ గ్రీన్ ఎనర్జీ హబ్‌గా ఏపీ

## - మంత్రి నారా లోకేష్



అమరావతి (చైతన్యరథం): గ్లోబల్ క్లీన్ ఎనర్జీ నాయకత్వానికి భారత దేశం వేసిన పునాదిని ఏపీ మరింత పైకి తీసుకెళుతోందని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటించారు. ఈ మేరకు ఎక్స్‌లో మంత్రి లోకేష్ పోస్ట్ చేశారు. ఇంధన దిగుమతిదారుగా ఉన్న భారత్.. ఇప్పుడు స్వచ్ఛ ఇంధన ఎగుమతిదారుగా మారుతోంది. ఏపీ సమగ్ర క్లీన్ ఎనర్జీ విధానం–2024 ఈ బృహత్తర మార్పునకు శ్రీకారం చుట్టింది. ఏఎం గ్రీన్ సంస్థ ఆధ్వర్యంలో కాకినాడలో ఏర్పాటు చేస్తున్న భారీ గ్రీన్ అమోనియా ఎక్స్‌పోర్ట్ ప్రాజెక్టు మొత్తం ఇంధన వాల్యూ చైన్‌లో 10 బిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులు ఉంటాయి. కాకినాడలో 1.5 ఎంటీపీఏ సామర్థ్యంతో ఎగుమతి టెర్మినల్ ఏర్పాటు అవుతోంది. చమురు ఎగుమతుల్లో సౌదీ అరేబియా మాదిరిగా క్లీన్ ఎనర్జీ ఎగుమతిదారుగా భారతదేశాన్ని నిలబెట్టడంలో ఇది ఒక ప్రధాన ముందడుగుగా మంత్రి లోకేష్ పేర్కొన్నారు. గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు ఎలా పనిచేస్తుందనే దానిపై ఓ వీడియో కూడా మంత్రి లోకేష్ విడుదల చేశారు.

# ప్రాధాన్యతల వారీగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం



- ఈ ఏడాదిలోనే వెలిగొండ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పూర్తి
- త్వరలో వెలిగొండ ప్రాజెక్టు సందర్శిస్తా
- పూర్వోదయ స్కీం అమలుపై మరింత శ్రద్ధ
- పీపీపీలో చేపట్టాల్సిన ప్రాజెక్టుల సమగ్ర జాబితా సిద్ధం చేయండి
- వివిధ పథకాల అమలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- దావోస్ పర్యటన నుంచి తిరిగి రాగానే నివేదికలను సమర్పించాలని సీఎం ఆదేశం

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని వివిధ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రాధాన్యతల వారీగా చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. గత ఏడాది హంద్రీ-నీవా కాల్వ వెడల్పు పనులకు గడువు నిర్దేశించుకుని పూర్తి చేశామని... అలాగే పోలవరం ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టించామని గుర్తు చేశారు. అదే తరహాలో 2026 ఏడాదిలో వెలిగొండ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల నిర్మాణ పనులను పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో వివిధ శాఖల మంత్రులు, ఉన్నతాధికారులతో సీఎం సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాల్సిన కీలక ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. రాయలసీమలో ఉద్యాన రంగంలోని అభివృద్ధి కార్యక్రమాలు, పూర్వోదయ పథకం, నల్లమల సాగర్ సహా ఇరిగేషన్ ప్రాజెక్టులు, వివిధ శాఖల్లో చేపట్టాల్సిన పీపీపీ ప్రాజెక్టులు, జల్ జీవన్ మిషన్ పథకం, సాస్కీ నిధుల వినియోగం వంటి అంశాలపై చర్చించారు. దావోస్ పర్యటనకు వెళ్లే ముందు ఆయా పథకాలు, ప్రాజెక్టులపై సమీక్షించిన సీఎం... దావోస్ పర్యటన నుంచి తిరిగి రాగానే తనకు సమగ్ర నివేదికలు సమర్పించాలని మంత్రులకు, ఉన్నతాధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... గత ఏడాది వివిధ రంగాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం... అలాగే సంక్షేమాన్ని అమలు చేశాం. 2026లో కీలక ప్రాజెక్టులను చేపట్టాల్సి ఉంది. ముఖ్యంగా పూర్వోదయ స్కీం ద్వారా ప్రకాశం సహా రాయలసీమలోని తొమ్మిది జిల్లాల్లో అభివృద్ధి చేయొచ్చు. ఉద్యాన రైతులకు పెద్ద ఎత్తున మేలు జరుగుతుంది. పూర్వోదయ స్కీంలో భాగంగా విడతల వారీగా ఉద్యాన రంగ అభివృద్ధిపై దృష్టి సారించాలి. ఈ ఏడాది 2లక్షల హెక్టార్లల్లో ఉద్యాన పంటలు పండించేలా రైతులను సమాయత్తం చేయాలి. ఇక పథకంలో భాగంగా చేపట్టాల్సిన ఇరిగేషన్, రోడ్ నెట్ వర్క్, లాజిస్టిక్స్ కనెక్టివిటీ, వేర్ హౌసింగ్ సదుపాయాలు, కోల్డ్ చెయిన్ వ్యవస్థలను అభివృద్ధి చేసుకోవాలి. ఆయా శాఖల్లో అభివృద్ధి చేయాల్సిన పనులపై జిల్లాల వారీగా జాబితాను సిద్ధం చేసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం పూర్వోదయ స్కీం కింద రూ.40వేల కోట్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది... దీనికి అదనంగా మరిన్ని ప్రాజెక్టులను సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు.

### ప్రాజెక్టులు పూర్తి చేయాలి... చెరువులను నింపాలి

ఇక ఈ ఏడాది ఇరిగేషన్ ప్రాజెక్టుల విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా పని చేయాలి. ముఖ్యంగా వెలిగొండ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను ఈ ఏడాదిలో పూర్తి చేయాల్సి ఉంది. వీటి నిర్మాణం విషయంలో టార్గెట్ పెట్టుకోవాలి. నల్లమల సాగర్ విషయంలో కేంద్రంతో, పొరుగు రాష్ట్రంతో సంప్రదింపులు జరపాలి. వివాదాలు లేకుండా రెండు రాష్ట్రాలు కలిసి అభివృద్ధి చెందేలా సహకరించుకోవాల్సిన అవసరం ఉంది. తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. సముద్రంలోకి వృథాగా వెళ్ళే వరద నీటిని రెండు తెలుగు రాష్ట్రాలు వినియోగించుకోవాలన్నదే ఉద్దేశం. అందుకే మేం అభ్యంతరం చెప్పలేదు. వృథాగా పోయే జలాలను వాడుకునేలా రూపొందించిన నల్లమల సాగర్ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతులు తీసుకోవడంతోపాటు.. పొరుగు రాష్ట్రం కూడా అభ్యంతరం చెప్పకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయ్యాక అవసరమైన పక్షంలో తెలంగాణకు కూడా నీటిని ఇచ్చే పరిస్థితి ఉంటుంది. ఇక ఈ ఏడాది పీపీపీ పద్ధతిలో వివిధ రంగాల్లో పెద్ద ఎత్తున ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. సుమారు 290 ప్రాజెక్టులను మొదటి విడతలో చేపట్టాలి. దీనికి కేంద్రం నుంచి సహకారం లభిస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పీపీపీ పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయండి. జల్ జీవన్ మిషన్ పనుల్లో వేగం పెంచాలి. 2027 నాటికి ఈ స్కీం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

### దావోస్ నుంచి వచ్చేలోగా నివేదికలు సిద్ధం చేయండి...

కీలక రంగాలకు సంబంధించిన వివిధ పథకాలను అమలు చేసే అంశంపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయండి. దావోస్ పర్యటన ముగించుకుని వచ్చిన తర్వాత రిపోర్టులు సమర్పించాలి. ప్రణాళికలతోపాటు..ఆయా పథకాల అమలుకు అధికారులు సిద్ధంగా ఉండడంతోపాటు.. క్షేత్ర స్థాయి యంత్రాంగాన్ని కూడా సిద్ధంగా ఉంచుకోవాలి. అలాగే సాంకేతిక పరమైన అంశాలు ఏమైనా ఉంటే.. వాటిని కూడా వెంటనే పరిష్కరించుకునే అంశంపై ఫోకస్ పెట్టండి. అవసరమైన మేరకు కేంద్రంతో సంప్రదింపులు జరపాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, సీఎస్ విజయానంద్ సహా ఆర్థిక, ఇరిగేషన్, వ్యవసాయం, ఆర్ అండ్ బి, మున్సిపల్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ చర్యలతో పారిశ్రామికవేత్తల్లో భరోసా

- యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి రాష్ట్రాభివృద్ధిలో భాగం కావాలి
- గత ప్రభుత్వం పెట్టుబడిదారుల్ని బెదిరించింది
- కూటమి ప్రభుత్వం వేధించదు, అండగా ఉంటుంది
- పర్యావరణ పరిరక్షణ యజ్ఞంలో గ్రీన్ అమోనియా ప్రాజెక్ట్ గేమ్ ఛేంజర్
- కాకినాడలో ఏఎం గ్రీన్ గ్రీన్ ఆమోనియా ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్




కాకినాడ (చైతన్యరథం): ప్రభుత్వాలు, పార్టీలు మారినా పరిపాలనా పరమైన విధానాలు మాత్రం స్థిరంగా ఉండాలి..గత పాలకులు- రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడిదారులను బెదిరించి, కోర్టుకు ఈడ్చి నానా ఇబ్బందులుపెట్టారు.. కూటమి ప్రభుత్వం మాత్రం ప్రతి అడుగులో పెట్టుబడిదారుల్లో విశ్వాసం నింపుతోంది.. వారికి అండగా నిలుస్తుంది.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని మా ప్రభుత్వం నుంచి పెట్టుబడిదారులకు ఎలాంటి వేధింపులు ఉండబోని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెట్టు బడిదారులకు సానుకూల వాతావరణం కల్పిస్తున్నామన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్‌ని అగ్రగామిగా నిలిపే దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. పునరుత్పాదక ఇంధన రంగంలో రాష్ట్రాన్ని దేశంలో మొదటి స్థానంలో నిలపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశ కాలుష్య రహిత ఇంధన ప్రయాణంలో గ్రీన్ అమోనియా ప్రాజెక్టు కీలక మైలు రాయి అని చెప్పారు. శనివారం కాకినాడలోని వాకలపూడిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్‌తో కలసి ఏఎం గ్రీన్‌సంస్థ గ్రీన్ అమ్మోనియా-గ్రీన్ హైడ్రోజన్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేశారు. గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ నిర్మాణాన్ని ప్రారంభించారు. ప్లాంట్ నమూనాని పరిశీలించి యంత్ర పరికరాల పైలాన్ ను ఆవిష్కరించారు.

అనంతరం జరిగిన సమావేశంలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ బలమైన సంకల్పం ఉంటే ఏదైనా సాధించగలమని గ్రీన్ కో వ్యవస్థాపకులు చలమలశెట్టి అనిల్ నిరూపించారన్నారు. అనేక కష్టనష్టాలను తట్టుకుని ఈ రోజున ఏఎం గ్రీన్ కంపెనీ స్థాపించారు. కాకినాడలో 495 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. ఏడాదికి 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నారు. రూ. 15, 600 కోట్లు పెట్టుబడితో ప్రారంభం అవుతున్న ఈ సంస్థలో 8 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పాదక ఇంధన పెట్టుబడులు రానున్నాయి. 2027 ఏడాది చివరికి తొలి దశ కమిషనింగ్ లక్ష్యంగా, పునరుత్పాదక ఇంధన ఆధారిత శుద్ధ ఇంధన కేంద్రంగా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోబోతోంది. నిర్మాణ దశలో సుమారు 8,000 మందికి, ఆపరేషన్ దశలో సుమారు 1,500 మందికి ప్రత్యక్ష ఉపాధి, పరోక్షంగా కొన్ని వేల మందికి దీర్ఘకాల ఉపాధి అవకాశాలు సృష్టించే ఈ ప్రాజెక్టు విజయవంతం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ వ్యవస్థాపకులు అయిన చలమలశెట్టి అనిల్‌కి, మహేష్‌కి అభినందనలు తెలియజేస్తున్నానన్నారు.

### క్లీన్ ఎనర్జీ పాలసీతో విధానపరమైన స్పష్టత

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారధ్యంలోని కేంద్ర ప్రభుత్వ సహకారంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు వెళుతోంది. ఆ ప్రయత్నాల్లో గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు కీలక ముందడుగు. పునరుత్పాదక ఇంధన రంగాన్ని ప్రోత్సహిస్తూ, ఆ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే మొదటి స్థానంలో నిలపాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యం. అందుకు ఏఎం గ్రీన్ ఎనర్జీ ముందుకు రావడం ఆనందదాయకం. ఆ దిశగా కూటమి ప్రభుత్వం వేసిన బలమైన అడుగు ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024. ఈ పాలసీ రాష్ట్రాన్ని భవిష్యత్ పునరుత్పాదక ఇంధన సామర్థ్య కేంద్రంగా, పునరుత్పాదక ఇంధన వనరుల ఉత్పత్తి హబ్‌గా తీర్చిదిద్దబోతోంది. గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా వంటి శుద్ధ ఇంధనాల ఉత్పత్తికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించగలిగితే పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరుగుతుంది. క్లీన్ ఎనర్జీ పాలసీ ద్వారా ఇప్పటికే కూటమి ప్రభుత్వం విధానపరమైన స్పష్టత ఇచ్చింది. గ్రీన్ ఎనర్జీ ఉత్పాదనకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానం కావాలి. అదే చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ విధానం. క్లీన్ ఎనర్జీ పాలసీని సద్వినియోగం చేసుకుంటూ ఈ రోజు ఏఎం గ్రీన్ సంస్థ మన కాకినాడలో దేశంలోనే మొట్టమొదటి మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గ్రీన్ అమ్మోనియా తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. దేశ కాలుష్య రహిత ఇంధన ప్రయాణంలో ఇదో చారిత్రక మైలురాయిగా అభివర్ణించవచ్చునని పవన్ పేర్కొన్నారు.

ఏఎం గ్రీన్ సంస్థ ఏడాదికి 0.5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ అమ్మోనియా సరఫరా చేసేందుకు జర్మనీకిచెందిన ప్రముఖ ఇంధనసంస్థ యూనిపర్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఇది భారత దేశం నుంచి యూరోపియన్ దేశాలకు జరుగుతున్న తొలి శుద్ధ ఇంధన ఎగుమతి ఒప్పందం. ఈ చారిత్రాత్మక ఒప్పందానికి ఆంధ్రప్రదేశ్ కేంద్ర బిందువుగా ఉండడం మనందరికీ గర్వకారణమని పవన్ అన్నారు.







# గ్రీన్ అమోనియా ప్రాజెక్టుకు సీఎం, డిప్యూటీ సీఎం శంకుస్థాపన

కాకినాడలో ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమంలో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పాల్గొన్నారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, పలువురు వ్యాపారవేత్తలు పాల్గొన్నారు. ఏడాదికి *1.5* మిలియన్ టన్నుల గ్రీన్ అమోనియా ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మించనున్న ప్లాంట్ నమూనాను ముఖ్యమంత్రి , డిప్యూటీ సీఎం పరిశీలించారు. ఏఎం గ్రీన్ సంస్థ యంత్రపరికరాల బిగింపు పైలాన్‌ను కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆవిష్కరించారు.









చైతన్యరథం

# కాకినాడలో సీఎం చంద్రబాబుకు ఘనస్వాగతం



ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమం కోసం కాకినాడ చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి శనివారం కూటమి నేతలు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.











## 23న ఏపీ హైకోర్టు వద్ద టీడీపీ లీగల్‌సెల్ రక్తదాన శిబిరం

విశాఖపట్నం (చైతన్యరథం): ఈ నెల 23న తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో అమరావతిలోని ఏపీ హైకోర్టు దగ్గర 4వ రక్తదాన శిబిరం నిర్వహించను న్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని గాజువాకలోని పార్టీ కార్యాలయములో విశాఖపట్నానికి చెందిన న్యాయవాదులతో కలసి గోడ పత్రికను శనివారం పల్లా ఆవిష్కరించారు



## మద్యం కుంభకోణం.. విజయసాయికి ఈడీ నోటీసులు

అమరావతి (చైతన్యరథం): జగన్ హయాంలో ఏపీ మద్యం కుంభ కోణానికి సంబంధించి వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డికి ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నోటీసులు జారీ చేసింది. ఏపీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించి ఈనెల 22వ తేదీన విచారణకు హాజరుకావాలని ఆదేశిం చింది. ఇప్పటికే ఈ కేసులో విస్తృత స్థాయిలో విచారణ చేపట్టిన ఈడీ అధికారులు.. ఇప్పుడు కీలక నేతలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఏపీ లిక్కర్ స్కామ్‌లో భారీగా నగదు అక్రమ లావాదేవీలు జరిగినట్లు ఈడీ అనుమానిస్తోంది. లిక్కర్ పాలసీ అమలు సమయంలో పెద్దఎత్తున హవాలా లావాదేవీలు, మనీ లాండరింగ్ జరిగాయని, ఈ వ్యవహారంలో పలువురు రాజకీయ నాయకులు, అధికారులు, ప్రైవేట్ వ్యక్తుల పాత్ర ఉందని ఈడీ అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే విజయసాయిరెడ్డికి నోటీసులు జారీ కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించడం ఆనందదాయకం

### - ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్

అమరావతి (చైతన్యరథం): ఈ నెల 20వ తేదీన అధికారిక కార్యక్రమంగా జరిగే కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, యంత్రాంగం విజయవంతం చేయాలని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ పిలుపునిచ్చారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డూండి రాకేష్ మాట్లాడుతూ... సంక్రాంతి సంబరాలు జరుపుకున్నట్లుగానే ఈ నెల 20న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని జరుపుకోవాలన్నారు. మాఘశుద్ధ విదియ రోజున జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారిక కార్యక్రమంగా నిర్వహించటం ఆనందదాయకం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందే ఆర్యవైశ్యుల కోరిక మేరకు మేనిఫెస్టోలో ఈ విషం పెట్టారు. మేనిఫెస్టో ప్రకారం కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ కార్యక్రమాన్ని అధికారిక



కార్యక్రమంగా ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ మొదటి ఏడాదిలోనే.. తిరుమల వెంకటేశ్వర స్వామికి, కనకదుర్గమ్మ అమ్మవారికి, శ్రీశైల మల్లన్న స్వామికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించి నట్లుగానే పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారికి కూడా పట్టువస్త్రాలు సమర్పించే కార్యక్రమం ప్రారంభించారు. ఈ ఆచారం సదా ఇలాగే కొనసాగుతుంది. కన్యకాపరమేశ్వరి అమ్మవారికి గౌరవం దక్కితే ఆ గౌరవం ఆర్యవైశు ్యలందరికీ దక్కినట్లే. గత వైసీపీ హయాంలో దేవాదాయశాఖ మంత్రిగా ఉండిన వ్యక్తి వైశ్యుల కోసంగానీ.. శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయాల అభివృద్ధికిగానీ ఏమీ చేయలేదు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్యవైశ్యుల కోరికను మన్నించారు. అమ్మవారి ఆత్మార్పణ దినాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం 24 కార్యక్రమాలను ఈ విధంగా ప్రకటిస్తే..వీటిలో 3 కార్యక్రమాలు ఆర్యవైశ్యులకు సంబంధించినవి ఉండడం ఆనందదాయకం. తమను ప్రభుత్వం గుర్తించడంపట్ల ఆర్యవైశ్యులందరూ గర్విస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయాలను 20వ తేదీన జరిగే అధికారిక కార్యక్రమానికి సిద్ధం చేయాలి. కూటమి ప్రభుత్వం ఆర్యవైశ్యులకు పెద్దపీట వేసిందనడానికి జీవో నెం.15 నిదర్శనం. అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది. తెలుగు ప్రజల గౌరవం, అభ్యున్నతి కోసం తన ప్రాణ త్యాగం చేసిన వ్యక్తి. పొట్టి శ్రీరాములు పేరున స్మృతివనం నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన సహృదయంతో స్పందించారు. అమరావతి నడిబొడ్డున 6.8 ఎకరాల భూమిని పొట్టిశ్రీరాములు స్మృతివనానికి కేటాయించారు. త్వరలోనే పొట్టిశ్రీరాములు 125 వ జయంతి ఉత్సవాలు జరగబోతున్నాయి. మార్చి 16న ఆయన 58 రోజుల దీక్షకు ప్రతీకగా 58 అడుగుల విగ్రహావిష్కరణ చేయనున్నాం. చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి వైశ్యులు ఎంతో రుణపడి వున్నారు. ఆర్యవైశ్యులపై కూటమి ప్రభుత్వానికి ఉన్న ప్రేమ అర్థమౌతుంది. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ గ్రామం కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మస్థలం. ఈ గ్రామానికి వాసవి పెనుగొండ అని పేరు పెట్టాలని కోరుతుంటే ఎన్ని ప్రభుత్వాలు మారినా దానిపై దృష్టి పెట్టలేదు. చివరకు చంద్రబాబు అంగీకరించారు. మేనిఫెస్టోలో పెట్టకపోయినా ఆర్యవైశ్యుల కోరిక మేరకు వాసవీ పెనుగొండ గ్రామంగా పేరు పెట్టారు.కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని రాష్ట్ర పండుగగా జరుపుదాం. అధికారులకు, నాయకులకు ఆహ్వాన పత్రికలు పంపుతున్నాం. సీఎం చంద్రబాబు ప్రజలు మెచ్చే పరిపాలన సాగిస్తున్నారు. ఆర్యవైశు ్యలకు మంత్రి నారా లోకేష్ సహకారం మెండుగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ల సహకారంతో ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేస్తామని చైర్మన్ డూండీ రాకేష్ తెలిపారు.

# సొంత ప్యాలెస్‌లకు వేల కోట్లు.. ప్రజా రాజధానికి సున్నాలా?

- నాడు అసెంబ్లీలో అమరావతికి 'జై'.. అధికారం రాగానే 'నై'.. ఇది కదా అసలైన వంచన
- కులాల మధ్య చిచ్చు.. ప్రాంతాల మధ్య విషం.. ఇదే జగన్ రెడ్డి నీచ రాజకీయం
- 11 సీట్లకు పడిపోయినా ఇంకా మీ నీచ బుద్ధి మారకపోవడం దౌర్భాగ్యం
- మంత్రి కొలుసు పార్థసారథి మండిపాటు

అమరావతి (చైతన్యరథం): ప్రజా రాజధాని అమరావతితోనే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని సమాచారశాఖ,గృహనిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. మంగళగిరిలోని పార్టీ కేంద్రకార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హెల్దీ, హ్యాపీ, వెల్దీ స్టేట్ అనే నినాదంతో ముందుకెళుతున్న కూటమి ప్రభుత్వ పాలనలో గత మూడు రోజులుగా రాష్ట్రమంతా సంక్రాంతి సంబరాలు ఆనందంగా జరుపుకోవడం నిజంగా హర్షణీయమన్నారు. గ్రామగ్రామాన ప్రజల్లో కనిపించిన సంతోషం, భవిష్యత్తుపై ఆశలు ఈ ప్రభుత్వంపై ఉన్న నమ్మకానికి నిదర్శనం. ఈ రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది, యువతకు ఉపాధి-ఉద్యోగ అవకాశాలు వస్తాయి, ఆంధ్రప్రదేశ్ దేశంలో నెంబర్ వన్ స్థాయికి చేరుతుందనే ప్రజల నమ్మకమే కూటమి ప్రభుత్వానికి బలంగా మంత్రి అభివర్ణించారు.

అయితే ఈ ఆశాజనక వాతావరణాన్ని భగ్నం చేయడమే అలవాటుగా మార్చుకున్న వైసీపీ రాష్ట్ర అభివృద్ధిపై, పెట్టుబడులపై విషం చిమ్ముతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని గౌరవించే ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా బెదిరింపులలకు పాల్పడుతూ, భయభ్రాంతులు సృష్టిస్తోంది. ఒక రాష్ట్రానికి మంచి రాజధాని ఎంత అవసరమో, ఆ రాజధానిపై ప్రజల్లో నమ్మకం కలిగించడం కూడా అంతే అవసరం. గ్రామాల నుంచి ఎన్ని వేల మంది వచ్చినా ఉపాధి దొరికేలా రాజధాని ఉండాలి అనే ఆలోచనతోనే అమరావతి నిర్మాణానికి రూపకల్పన జరిగింది. దురదృష్టవశాత్తూ 2019–24 మధ్య వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో రాష్ట్ర ప్రజల కలలన్నీ విధ్వంసమయ్యాయి. ఐదేళ్ల రాష్ట్రానికి రాజధాని లేకుండా ప్రజలు బాధపడాల్సిన పరిస్థితి వచ్చింది. 2014 ఎన్నికల సమయంలో జగన్మోహన్ రెడ్డి హైదరాబాద్‌ను మించిన నగరాన్ని నిర్మిస్తానని చెప్పారు. కానీ విభజన చట్టం ప్రకారం రాజధాని నిర్మించే హక్కు ఉన్న చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అమరావతిని ప్రతిపాదించగా, అసెంబ్లీలో జగన్మోహన్ రెడ్డి పూర్తి మద్దతు ప్రకటించారు. అలాంటి వ్యక్తి అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతిని ఏ విధంగా విధ్వంసానికి గురి చేశారో రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందేనన్నారు.

### మూడు రాజధానుల పేరిట విధ్వంసం

2014లో రాజధాని లేని రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని నమ్మి 29 వేల మంది రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సుమారు 33 వేల ఎకరాల భూమిని త్యాగం చేశారు. ప్రభుత్వ భూములు కలిపి దాదాపు 50 వేల ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి రాజధాని నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. పేదలు, రైతులు, కార్మికులు, మహిళలు అందరూ నివసించేలా సమగ్ర నగరంగా అమరావతి రూపుదిద్దుకుంటుంది. అయితే రాజధాని రాష్ట్రానికి నడిబొడ్డులో ఉండాలి, కనీసం 30 వేల ఎకరాలు కావాలి అని చెప్పిన జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికల సమయంలో అమరావతే రాజధాని, తాడేపల్లిలో ఇల్లు కట్టుకున్నా అనుమానం అవసరం లేదని నమ్మబలికారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత తుగ్లక్ పాలనను గుర్తు చేసేలా మూడు రాజధానుల వాదన తెరపైకి తెచ్చి విధ్వంసం సృష్టించారు. ఐదేళ్లలో ఒక్క రాజధానికైనా స్పష్టమైన ప్రణాళిక లేదా కార్యాచరణ చూపలేకపోయారు. అమరావతిని ఎడారితో పోల్చారు. శ్మశానంలా ఉందన్నారు. అంతేకాక భూములు ఇచ్చిన రైతులను అవమానించారు. ఐదేళ్ళ నిరసనలు చేసిన రైతులు, మహిళలపై పోలీసులతో దౌర్జన్యాలు చేయించారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ అంటూ అసెంబ్లీలో మాటల యుద్ధం చేసి చేతకానితనాన్ని కప్పిపుచ్చుకున్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల నుంచి చివాట్లు పడినా కూడా సిగ్గురాలేదు. రైతులు న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు పాదయాత్ర చేస్తే అడ్డంకులు సృష్టించారు. చివరకు 2024 ఎన్నికల్లో ప్రజల ఛీత్కారానికి గురై కేవలం 11 సీట్లకే పరిమితమయ్యారని మంత్రి పార్థసారథి అన్నారు.



### మాటలు మారుస్తూనే..

ఎన్నికల తర్వాత కూడా మాటలు మారుస్తూనే ఉన్నారు. ఒకప్పుడు 30 వేల ఎకరాలు కావాలన్నవాళ్ళు, ఇప్పుడు 500 ఎకరాలు చాలని అంటున్నారు. తమ వ్యక్తిగత అవసరాలకు వందల ఎకరాలు, వేల చదరపు అడుగుల భవనాలు కట్టుకున్నవాళ్లు ఐదు కోట్ల ప్రజలకు అంత పెద్ద రాజధాని అవసరమా అని ప్రశ్నించడం దుర్మార్గం కాక మరేమిటి? రాజధానిపై ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టడం, అమరావతిని ఒక ప్రాంతానికే చెందిన నగరంగా చిత్రీకరించడం రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనం.చంద్రబాబు నాయుడు సైబరాబాద్ ఆలోచన చేసినప్పుడు కూడా ఇలాంటి విమర్శలే వచ్చాయి. కానీ ఈరోజు అక్కడ భూముల విలువలు ఏ స్థాయిలో ఉన్నాయో అందరికీ తెలుసు. అమరావతిలో కూడా అభివృద్ధి పూర్తిస్థాయికి రాక ముందే భూముల ధరలు కోట్లలో పలుకుతున్నాయి. భవిష్యత్తులో క్వాంటం వ్యాలీ, అంతర్జాతీయ విద్యా సంస్థలు, బ్యాంకింగ్ స్ట్రీట్, ఐటీ హబ్‌లు వస్తే రాష్ట్రానికి లక్షల కోట్ల సంపద ఏర్పడుతుంది. అదే ఆదాయంతో రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి పార్థసారథి తెలిపారు.

### ప్రపంచ స్థాయి నగరంగా అమరావతి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతిలో పనులు మళ్లీ ఊపందుకున్నాయి. వేల కోట్లతో లేఅవుట్ల అభివృద్ధి, రహదారులు, సెక్రటేరియట్, అసెంబ్లీ, మంత్రుల క్వార్టర్స్, ఐఏఎస్ నివాసాలు, వరద నివారణ పనులు, ప్రపంచ బ్యాంక్--ఏడీబీ నిధులతో మౌలిక సదుపాయాలు ప్రారంభమయ్యాయి. 30 శాతం గ్రీన్ కవర్, 10 శాతం వాటర్ కవర్‌తో ప్రపంచ స్థాయి నగరంగా అమరావతి రూపుదిద్దుకుంటోంది. అంతేకాదు, విశాఖపట్నం, అనకాపల్లి ప్రాంతాల్లో టీసీఎస్, రిలయన్స్ వంటి సంస్థల పెట్టుబడులు వచ్చాయి. కూటమి ప్రభుత్వ లక్ష్యం ఒక్కటే -- అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి. రాజధాని ఎంత పెద్దగా ఉండాలి అనేది ఒక వ్యక్తి ఇష్టానుసారం కాదు; ప్రజల ఆకాంక్షలు, భవిష్యత్తు అవసరాల ఆధారంగా నిర్ణయిస్తారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పట్ల గౌరవం లేని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విధ్వంసకర రాజకీయాలను మానుకోవాలి. అసెంబ్లీకి వచ్చి ప్రశ్నించాలంటే ధైర్యం ఉండాలి. బయట కూర్చొని విషప్రచారం చేయడం ప్రజలకు హాని చేయడం మానుకోవాలి. చంద్రబాబు నాయుడు, లోకేష్, పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తోంది. ఈ నిజాన్ని ప్రజలు గుర్తించాలి, విధ్వంస రాజకీయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మంత్రి పార్థసారధి హితవు పలికారు.

# వైసీపీ కార్యకర్త భూ కబ్జా యత్నం

- దౌర్జన్యానికి పాల్పడుతూ బెదిరిస్తున్నారు
- గ్రీవెన్స్‌లో బాధితురాలి ఫిర్యాదు
- 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిని ఆక్రమించేందుకు యత్నం
- తప్పుల తడకగా వ్యక్తిగత వివరాల నమోదు.. రీమ్యాపింగ్ కోరుతూ వినతి
- టీడీపీ కేంద్రకార్యాలయానికి అర్జీలతో తరలి వచ్చిన బాధితులు
- అర్జీలు స్వీకరించిన మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎస్ఎండబ్ల్యూఏబీ ఛైర్మన్ శ్రీనివాసులు రెడ్డి



అమరావతి (చైతన్యరథం): తమ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తూ.. దౌర్జన్యానికి దిగుతున్న వైసీపీ కార్యకర్తపై చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం రేకులకుంటపల్లి గ్రామానికి చెందిన శంకరమ్మ.. టీడీపీ నేతలకు విజ్ఞప్తి చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా పలువురు అర్జీదారులు తరలివచ్చారు. గనులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎస్ఎండబ్ల్యూఏబీ ఛైర్మన్ పెల్లకూరు శ్రీనివాసులు రెడ్డి అర్జీలు స్వీకరించి బాధితుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా శంకరమ్మ నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. తమ గ్రామంలో తమకు ప్రభుత్వం రెండు సెంట్ల భూమిని మంజూరు చేసిందన్నారు. దీనికి సంబంధించి అన్ని చట్టబద్ధ ఆధారాలు, రికార్డులు తమ వద్ద ఉన్నాయి. అయితే ఈ భూమిపై అక్రమంగా హక్కు సాధించాలనే ఉద్దేశంతో వైసీపీ కార్యకర్త నల్లబట్లపల్లి శివన్న అనే వ్యక్తి తమపై, తమ కుటుంబ సభ్యులపై దాడి చేసి వేధింపులకు పాల్పడుతున్నాడు. తగు చర్యలు తీసుకొని తమ భూమి సమస్యను పరిష్కరించి తమకు రక్షణ కల్పించాలని కోరారు.

అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం పారవాడ గ్రామానికి చెందిన కాసుల నాయుడు విజ్ఞప్తి చేస్తూ... తమ గ్రామంలో సర్వే నెం. 224 ప్రభుత్వ భూమి ఎ. 1.50 సెంట్లు తమ తండ్రుల కాలం నుంచి సుమారు 40 సంవత్సరాలకు పైగా తమ అనుభవంలో ఉందని, దానిలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఈ భూమిలో కొబ్బరి, అరటి, తదితర పంటలు సాగుచేస్తున్నాం. ఈ భూమికి సంబంధించి 24-06-1991 తేదీన సంబంధిత అధికారుల ద్వారా తమకు డీ--పట్టా మంజూరయింది. అయితే ఇటీవల కొంతమంది వ్యక్తులు తమ భూమిపై అక్రమంగా హక్కు సాధించాలనే ఉద్దేశంతో తమని కులపరంగా దూషిస్తూ, బెదిరింపులకు పాల్పడుతూ భూమి నుండి వెళ్లిపోవాలని ఒత్తిడి తెస్తున్నారు. ఈ వ్యవహారంపై తాము సంబంధిత కార్యాలయాలను సంప్రదించినప్పటికీ ఇప్పటివరకు న్యాయం జరగలేదు. వారిపై చర్యలు తీసుకుని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

బాపట్ల జిల్లా కొల్లూరు మండలం రావికంపాడు గ్రామానికి చెందిన కనపర్తి వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేస్తూ..తమ కుటుంబానికి సంబంధించిన వివరాలు గ్రామ రికార్డుల్లో తప్పుగా నమోదయ్యాయన్నారు. ఈ తప్పుడు నమోదుల కారణంగా తమకు తమ కుటుంబ సభ్యులకు సంబంధించిన వ్యక్తిగత వివరాలు, కుటుంబ వివరాలు సరిగ్గా లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు తమకు వర్తించడం లేదు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. రీమ్యాపింగ్ చేయించి తప్పుగా నమోదు అయిన తమ కుటుంబ వివరాలను సరిచేయాలని కోరారు.

వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెజ్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం.. ఆర్థిక తోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

### హత్యా రాజకీయాలు, కక్ష సాధింపులకు...

# కూటమి ప్రభుత్వం వ్యతిరేకం

- పల్నాడులో వ్యక్తిగత గొడవకు కుల, రాజకీయ రంగు పులిమే యత్నం
- గత వైసీపీ పాలనలోనే హింస, దౌర్జన్యాలు
- బీసీలు, బలహీన వర్గాలపై జరిగిన అఘాయిత్యాలు ప్రజలు మర్చిపోలేదు
- కుట్ర రాజకీయాలే వైసీపీ పతనానికి కారణం
- శాంతి,భద్రతలకు సీఎం చంద్రబాబు భరోసా
- ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



అమరావతి (చైతన్యరథం): హత్యా రాజకీయాలు, కక్ష సాధింపులకు కూటమి ప్రభుత్వం పూర్తి వ్యతిరేకమని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న ఒక వ్యక్తిగత ఘటనకు రాజకీయ రంగు పులిమి రాష్ట్రంలో ఉద్రిక్తతలు సృష్టించాలనే దురుద్దేశంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి శాంతిభద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా పని చేసింది. ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు ప్రభుత్వాల్లో అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకున్న ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. అయితే వ్యక్తిగత కక్షల్ని రాజకీయంగా మలచి విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు దురదృష్టకరం. పల్నాడులో జరిగిన ఘటన పూర్తిగా వ్యక్తిగత గొడవ. దానిని ఆసరాగా చేసుకుని కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం జరుగుతోంది. వైసీపీ పాలనలో పల్నాడు ప్రాంతంలో గ్రామాలపై దాడులు, మహిళలపై అఘాయిత్యాలు, ప్రజలను గ్రామాల నుంచి తరిమివేసిన ఘటనలు ప్రజలకు ఇంకా గుర్తున్నాయి. ఆ రోజుల్లో జరిగిన దౌర్జన్యాలను ప్రజలు మర్చిపోయారని వైఎస్సార్ పార్టీ అనుకుంటే అది భ్రమే. జగన్‌మోహన్ రెడ్డి హయాంలో రాజకీయ హింసకు పాల్పడిన పలువురు నేతల ఉదాహరణలను ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య ఘటనలోనూ, డాక్టర్ సుధాకర్ వ్యవహారంలోనూ న్యాయం జరగలేదు. ఇవన్నీ నడిరోడ్డుపై జరిగిన దుర్మార్గాలు. అలాంటి సంస్కృతినే ఇప్పుడు మళ్లీ ప్రోత్సహించేందుకు ప్రయత్నిస్తున్నారని మంత్రి రవీంద్ర మండిపడ్డారు.

**కుట్రలు చేస్తే ఇరుక్కుంటారు**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం శాంతిభద్రతల విషయంలో రాజీపడబోదని స్పష్టం చేశారు. ఎవరు ఎంతటి వారైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు. కుట్రలు చేసేవాళ్లే చివరకు ఇరుక్కుంటారు. ఇది ఇటీవల వెలుగులోకి వచ్చిన మద్యం స్కామ్‌లో కూడా స్పష్టమైంది. మద్యం విధానంపై తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో ఏఆర్టీ పేరిట ప్రజలపై భారం మోపారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానంతో నాణ్యమైన మద్యం పక్క రాష్ట్రాల ధరలకు సమానంగా, కొన్ని సందర్భాల్లో తక్కువ ధరలకు అందుబాటులో ఉందని చెప్పారు. మైక్రో బ్రూవరీల అనుమతులు కూడా పూర్తిగా పారదర్శకంగా, టూరిజం అభివృద్ధి అవసరాల దృష్ట్యానే ఇస్తున్నామని వివరించారు. అంబేద్కర్ విగ్రహాలపై దాడులు, తిరుమల ఘటనలు, తప్పుడు వీడియోలు, సోషల్ మీడియా ప్రచారాలన్నీ ఉద్దేశపూర్వక కుట్రలేనని మంత్రి ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా అసాంఘిక శక్తులపై నిఘా పెట్టాం. రౌడీషీటర్లు, కుట్రదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసంతో ఏర్పడిన కూటమి ప్రభుత్వం శాంతి, భద్రతల పరిరక్షణకు కట్టుబడి ఉంది. ఎన్ని దుష్ప్రచారాలు చేసినా ప్రజలు వాటిని నమ్మే పరిస్థితి లేదు. హింసా రాజకీయాలకు ఆంధ్రప్రదేశ్‌లో స్థానం లేదని మంత్రి రవీంద్ర స్పష్టం చేశారు.

# విషం చిమ్మడం మానుకో!



- జగన్‌కు మంత్రి సవిత హితవు
- సీఎం చంద్రబాబు హయాంలో అభివృద్ధి పరుగులు
- ఓర్వలేకపోతున్న వైసీపీ ముఠా
- సొంత కార్యకర్తలనే వేధించిన చరిత్ర మాజీమంత్రి ఉషశ్రీ చరణ్‌ది
- కళ్యాణదుర్గం అభివృద్ధిపై చర్చకు సిద్ధమా
- బీచిగానిపల్లిలో రూ.80 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి మంత్రి సవిత శంకుస్థాపన

పరిగి (చైతన్యరథం): సొంత కార్యకర్తలనే కేసులు పెట్టి, వేధించిన చరిత్ర మీదని, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమంపై విషం కక్కడం మానుకుని కూటమి ప్రభుత్వానికి సహకరించాలని జగన్‌కు, ఆయన పార్టీ నాయకులకు రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత హితవు పలికారు. శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం పాత్రగానిపల్లి గ్రామం నుంచి బీచిగానిపల్లి గ్రామం వరకు రూ.80లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి ఆమె శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బీచిగానిపల్లిలో నిర్వహించిన సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోనూ, నియోజకవర్గంలోనూ అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీచిగానిపల్లిలో ఉపాధి హామీపథకం కింద రూ.4 కోట్లతో 56పనులు చేశామన్నారు. రూ.76లక్షలతో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించామన్నారు. తాగునీటి కల్పనకు మూడు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించామన్నారు. రూ.2 కోట్లు వెచ్చించి బీసీ హాస్టల్‌ను నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికే బీసీ, ఎస్సీ హాస్టళ్ల మరమ్మతులు చేపట్టామన్నారు. సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు అమలు చేశామని, సంక్షేమంతో పాటు సంపద సృష్టిస్తున్నామని, యువతకు ఉపాధి కల్పిస్తున్నామని వెల్లడించారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. రాష్ట్రానికి లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తీసుకొస్తున్నామన్నారు.

**పద్ధతి మార్చుకో..**

జగన్ అయిదేళ్ల పాలనలో జరగని అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వం వచ్చిన 18 నెలల కాలంలోనే చేసి చూపించామని మంత్రి సవిత తెలిపారు. సీఎం చంద్రబాబు సమర్థ నాయకత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి చూసి జగన్, ఆయన పార్టీ నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. రప్పా.. రప్పా... అంటూ అధికారులను, కాంట్రాక్టర్లను, పెట్టుబడిదారులను కూడా బెదిరిస్తున్నారన్నారు. వారి బెదిరింపులకు ఎవరూ బెదిరిపోరన్నారు. వారు ఎంతరెచ్చగొట్టినా, కూటమి ప్రభుత్వం సంయమనం పాటిస్తోందన్నారు. ఇప్పటికైనా జగన్ పద్ధతి మార్చుకోవాలని, కూటమి ప్రభుత్వంపై విషం కక్కడం మానుకోవాలని, అభివృద్ధికి సహకరించాలని మంత్రి సవిత హితవు పలికారు.

**సొంత కార్యకర్తలనే వేధించిన చరిత్ర నీది...**

అప్పులు, జింక, పశు మాంసాల పేరుతో సొంత కార్యకర్తలపైనే కేసులు పెట్టి వేధించిన చరిత్ర నీదని వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ పై మంత్రి సవిత మండిపడ్డారు. అయిదేళ్లలో కళ్యాణదుర్గంలో చేసిన అభివృద్ధిపై తాను చర్చకు సిద్ధంగా ఉన్నానని, సమయం చెబితే వస్తానని మంత్రి సవిత సవాల్ విసిరారు. 18 నెలల కాలంలో పెనుకొండ నియోజకవర్గంలోనూ, బీచిగానిపల్లిలో చేపట్టిన అభివృద్ధిపైనా చర్చకు రెడీ అని స్పష్టం చేశారు. వలస పక్షుల మాటలను పెనుకొండ నియోజక వర్గ ప్రజలు పట్టించుకోరన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో బీచిగానిపల్లి వాసులు పాల్గొన్నారు.

## క్లీన్ ఎనర్జీ రంగంలో సరికొత్త చరిత్రకు శ్రీకారం

- కాకినాడలో రూ.13 వేల కోట్లతో ఏఎమ్ గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటు మైలురాయి
- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హర్షం



అమరావతి (చైతన్యరథం): క్లీన్ ఎనర్జీ రంగంలో ఆంధ్రప్రదేశ్ సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టడంపై పెట్టుబడులు, మౌలిక సదుపాయాల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హర్షంవ్యక్తం చేశారు. కాకినాడలో రూ.13 వేల కోట్లతో ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్లాంట్ ఏర్పాటు కావడం శుభసూచకమన్నారు. కాకినాడలో 495 ఎకరాల్లో ఏర్పాటు చేసే ఈప్లాంట్ ద్వారా 2,600మందికి ఉద్యోగాల కల్పన జరుగుతుందన్నారు. దేశంలోనే అతిపెద్ద పర్యావరణహిత పరిశ్రమలలో ఒకటిగా ఈ ప్లాంట్ నిలవడం ఆంధ్రప్రదేశ్ కే గర్వ కారణం. ఏడాదిలోనే ఈ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చడం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం. పర్యావరణ అనుకూల విధానాలు – అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ఇస్తున్న ప్రాధాన్యతకు ఈ ప్రాజెక్టు నిదర్శనం. కాకినాడ పోర్ట్‌కు కేవలం 1 కి.మీ దూరంలో ప్లాంట్ ఉండటంతో వ్యూహాత్మకంగా ప్రపంచ స్థాయి ఎగుమతులకు గొప్ప అవకాశం ఉంటుంది. పెట్టుబడిదారులకు అనుకూల విధానాలతో, అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం సహకరిస్తోంది. సుస్థిర ప్రభుత్వం, సమర్థవంతమైన నాయకత్వంపై నమ్మకంతో ఏపీకి పెట్టుబడుల వెల్లువ కొనసాగుతోంది. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రపంచ స్థాయి పెట్టుబడులకు గమ్యస్థానంగా ఏపీ మారుతోందని మంత్రి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు.

## సచివాలయాల ద్వారా మెరుగైన ప్రజా పాలన

### - నూతన సచివాలయ భవనం ప్రారంభంలో మంత్రి సుభాష్



రామచంద్రపురం (చైతన్యరథం): రాష్ట్రంలో సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన పాలన అందించి, ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. శనివారం డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ఉండూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, గ్రామ సర్పంచ్ చిగురుపాటి రామలక్ష్మి, వెల్ల నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు చిగురుపాటి సాయిరాం, సొసైటీ చైర్మన్ మేడిశెట్టి రాధాకృష్ణ, కోట పీఏసీఎస్ చైర్మన్ గాలి మకర జ్యోతితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు సచివాలయాల వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. ఈ – గవర్నెన్స్ ద్వారా ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు అందేలా పాలన సులభతరం చేశామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు అందరూ కృషి చెయ్యాలని మంత్రి పిలుపు ఇచ్చారు. అధికారులు ప్రజలకు జవాబుదారీతనంగా అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వెలంపాలెం సర్పంచ్ టెకుముడి సత్యనారాయణ, ఉండూరు మాజీ సర్పంచ్ కుక్కల వీరవెంకటరావు, గ్రామ పెద్దలు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామ సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, డ్వాక్రా యానిమేటర్లు, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడును వెంటాడుతున్న జగన్‌రెడ్డి ఫ్యాక్షన్ పడగ

- హత్యా రాజకీయాలకు పేటెంట్ వైసీపీదే
- అధికారంలో ఉన్న ఐదేళ్లు పల్నాడును వల్లకాడు చేశారు
- రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళుతుంటే ఓర్వలేక కుట్రలు
- జగన్ మాదిరిగా హత్యా రాజకీయాలు మా విధానం కాదు
- దర్శి సభలో ఇంధనశాఖ మంత్రి మంత్రి గొట్టిపాటి రవికుమార్



దర్శి (చైతన్యరథం): వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఫ్యాక్షన్ రాజకీయం పల్నాడు ప్రాంతాన్ని ఇంకా వెంటాడుతోందని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ విమర్శించారు. రాష్ట్రంలో హత్యా రాజకీయా లకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పేటెంట్ రైట్స్ తీసుకున్నట్లుగా వ్యవహరిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో పల్నాడు ప్రాంతాన్ని పూర్తిగా వల్లకాడుగా మార్చిందని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలో ముందుకు తీసుకెళ్తుంటే, ఆ పురోగతిని వైసీపీ ఓర్వలేకపోతోందన్నారు. జగన్ మాదిరిగా హత్యా రాజకీయాలు కూటమి ప్రభుత్వ విధానం కాదని స్పష్టం మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. తప్పు చేసిన ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, చట్టం తన పని తాను చేస్తుందని తేల్చిచెప్పారు. ప్రకాశం జిల్లా దర్శిలో సహచర మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామితో కలిసి మంత్రి గొట్టిపాటి శనివారం పర్యటించారు. ముందుగా ఇరువురు మంత్రులు దర్శిలో రూ.4.19కోట్లతో నిర్మించనున్న విద్యుత్ శాఖ డీఈ కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ముండ్లమూరు మండలం ఉల్లగల్లులో రూ.3.90 కోట్లతో నిర్మాణం చేపట్టనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌కు భూమి పూజ చేశారు. ఉల్లగల్లులోనే స్వర్గీయ ఎన్టీ రామారావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆ తరువాత పసుపుగల్లు గ్రామంలో నిర్మాణం పూర్తయిన బస్ షెల్టర్‌ను మంత్రులు ప్రారంభించారు. ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ అనంతరం ఉల్లగల్లులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు మాట్లాడారు.

ప్రస్తుతం ఆస్తులు కాపాడుకోవడానికి మాత్రమే నాయకులు రాజకీయ పార్టీలు పెడుతున్నారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. 40 ఏళ్ల క్రితమే అప్పటి ఢిల్లీ పెద్దల చేతుల్లో తెలుగువారికి జరుగుతున్న అవమానాలను సహించలేక తెలుగువాడి ఆత్మ గౌరవం కోసం ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని వెల్లడించారు. నాలుగు దశాబ్దాల క్రితం ప్రవేశ పెట్టిన రెండు రూపాయిలకే కిలో బియ్యం పథకాన్ని తరువాత ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కొనసాగిస్తోందన్నారు. వీటితోపాటు పేదలకు ఇళ్లు, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, గురుకుల పాఠశాలల ఏర్పాటు వంటి పథకాలు దేశంలోని అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచి చరిత్ర సృష్టించాయని, అవి ఎంత గొప్ప పథకాలో అందరికీ అర్థం అయ్యాయని మంత్రి గొట్టిపాటి కొనియాడారు. సినిమా రంగమైనా, రాజకీయమైనా ఎన్టీఆర్‌కు పోటీ ఎన్టీఆరే అన్నారు.

### గ్రీన్ ఎనర్జీలో 13 వేల కోట్ల రూపాయిల పెట్టుబడి...

సీఎం చంద్రబాబుపై నమ్మకంతో శనివారం కాకినాడలో రూ.13,000 కోట్లతో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఎన్టీఆర్ బాటలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా నడుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో పరుగులు పెట్టిస్తున్నారన్నారు. గోదావరి, కృష్ణా నదులను అనుసంధానించడమే కాకుండా, పోలవరాన్ని 84 శాతం పూర్తి చేశారని తెలిపారు. రాజధాని అమరావతి నిర్మాణం పూర్తవ్వాలన్నా, భావితరాలకు మంచి భవిష్యత్తు కావాలన్నా చంద్రబాబు అధికారంలో ఉండాలన్నారు. ఒక వైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే, ప్రతి రైతు కుటుంబంలోనూ ఒక ఉద్యోగి ఉండాలన్న లక్ష్యంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు.

### కలసికట్టుగా టీడీపీ బలోపేతానికి కృషి

భేదాభిప్రాయాలు పక్కన పెట్టి తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కార్యకర్తలకు, స్థానిక నేతలకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పిలుపునిచ్చారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, మంత్రులు అందరూ కలిసి కట్టుగా కార్యక్రమాల్లో పాల్గొంటూ జిల్లా అభివృద్ధికి పాటుపడుతున్నామ న్నారు. స్థానిక నేతలు, కార్యకర్తలు దీనిని స్ఫూర్తిగా తీసుకోవాలని మంత్రి కోరారు. అదే విధంగా వ్యక్తిగత సమస్యలను పార్టీతో ముడిపెట్టవద్దని ఆయన సూచించారు. ఎవరూ ముందుకు రాని సమయంలో ప్రకాశం జిల్లాలో ఐదారు లక్షల మందితో మహానాడు పెట్టి విజయవంతం చేసిన విషయాన్ని మంత్రి గొట్టిపాటి ఈ సందర్భంగా గుర్తు చేశారు. అద్దంకి రెవిన్యూ డివిజన్ ఏర్పాటు సీఎం చంద్రబాబు నాయుడు చొరవతోనే జరిగిందన్నారు. రాబోయే ఎన్నికల్లో దర్శి నియోజకవర్గంలో గొట్టిపాటి లక్ష్మిని గెలిపించడంతో పాటు ప్రకాశం జిల్లాలో టీడీపీ పూర్తిస్థాయి విజయానికి ఇప్పటి నుంచే కృషి చేయాలని మంత్రి గొట్టిపాటి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ అవార్డు.. ఆర్టీసీ సేవలకు గుర్తింపు

- సీఎం చంద్రబాబు విజన్‌కు అనుగుణంగా ముందడుగు
- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



అమరావతి (చైతన్యరథం): ఏపీఎస్‌ఆర్టీసీకి ప్రతిష్టాత్మక గవర్నెన్స్ నౌ--ఆరో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సమ్మిట్ అవార్డు రావడం గర్వకారణమని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది ప్రజలకు అంకితభావంతో సేవలు అందిస్తున్నారన్నారు. ప్రయాణికులకు ముందస్తు సమాచారం అందించడం ద్వారా సేవల నాణ్యత మరింత మెరుగుపడిందన్నారు. డిజిటల్ సాంకేతికతను ప్రజాసేవకు వినియోగించిన ఆర్టీసీ కృషికి జాతీయ స్థాయి గుర్తింపు లభించిందన్నారు. ప్రధాన బస్‌స్టేషన్లలో ఆటోమేటిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్ (ఏఏఎస్) అమలు ప్రశంసనీయమన్నారు. అవార్డు సాధనలో కీలక పాత్ర పోషించిన ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు మంత్రి అభినందనలు తెలిపారు. సాంకేతికతను అందిపుచ్చుకుని సీఎం చంద్రబాబు నాయుడు విజన్‌కు అనుగుణంగా ఆర్టీసీ ముందడుగు వేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో ప్రయాణికులకు మరింత ఆధునిక, సౌకర్యవంతమైన సేవలు అందిస్తాం. ప్రజా రవాణా రంగంలో మహిళలకు ఉచిత బస్సు, పండుగ వేళల్లో సాధారణ ఛార్జీలు ఉంచుతూ ఏపీఎస్‌ఆర్టీసీని దేశానికి ఆదర్శంగా నిలబెడతామని మంత్రి మండిపల్లి స్పష్టం చేశారు.

### ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీపై రవాణా మంత్రి మండిపల్లి ఆగ్రహం

**- టోల్ ఫ్రీ నెంబర్ 9281607001ను సంప్రదించాలని ప్రయాణికులకు సూచన**

అమరావతి(చైతన్యరథం):సంక్రాంతి పండుగ అనంతరం తిరుగు ప్రయాణం పేరుతో ప్రయాణికుల దోపిడీ చేస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్‌పై రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ నుండి ఇతర రూట్లలో భారీ ఛార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్‌పై చర్యలుతప్పవని హెచ్చరించారు. ప్రయాణికుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని ఛార్జీలు పెంచడం చట్టవిరుద్ధం, అన్యాయం అన్నారు. ప్రయాణికులకు ప్రభుత్వం అండగా ఉంటుంది.అధిక ఛార్జీలపై ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నెంబర్ 9281607001ను సంప్రదించాలని సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత ట్రావెల్స్‌పై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## రైతుల భూ హక్కులకు చట్టబద్ధ భద్రత

- ఇదే కూటమి ప్రభుత్వ ధ్యేయం
- రాజముద్ర, క్యూ ఆర్ కోడ్‌తో పట్టాదారు పాస్ పుస్తకాలు
- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టీకరణ
- రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీలో పాల్గొన్న మంత్రి



అత్మకూరు (చైతన్యరథం): రైతుల భూములకు పూర్తి చట్టబద్ధత కల్పిస్తూ నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. రైతాంగానికి, ప్రజలకు మంచి చేయాలనే గొప్ప ఆలోచనలతో పని చేస్తున్నామన్నారు. మీ భూమి -- మీ హక్కు కార్యక్రమంలో భాగంగా నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం ఉప్పలపాడు గ్రామంలో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో శనివారం మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఉప్పలపాడు గ్రామంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి స్థానిక నేతలు, గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రభుత్వ రాజముద్ర, క్యూ ఆర్ కోడ్ తో జారీ చేసిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందజేసిన మంత్రి ఆనం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే రైతుల హక్కులు హరించే ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశామన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన పాస్ పుస్తకాలు... తమ ప్రభుత్వం ఇస్తున్న పాస్ పుస్తకాలకు ఉన్న తేడాను రైతులకు అర్థమయ్యేలా వివరించారు. గత ప్రభుత్వం ఇచ్చిన పాస్ పుస్తకాలు చెల్లని నోటుతో సమానం... విలువ లేనివన్నారు. తమ ప్రభుత్వం ఇస్తున్న పాస్ పుస్తకాలు రిజర్వ్ బ్యాంకు జారీ చేస్తున్న కరెన్సీ నోట్ల వలె విలువ గలవి... భద్రతాపరంగా చట్టబద్ధత కలిగినవని తెలిపారు. పట్టాదారు పాస్ పుస్తకాల్లో వున్న క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే భూ యజమానికి సంబంధించిన అన్ని వివరాలు అప్పటికప్పుడే కనిపిస్తాయన్నారు. రైతుల భూ హక్కులకు చట్టబద్ధ భద్రత కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి రెవెన్యూ వ్యవస్థలోని లోపాలను పూర్తిగా ప్రక్షాళన చేసి ప్రజలకు, రైతన్నలకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.

### సూపర్ సిక్స్.. సూపర్ హిట్

ఎన్ని ఇబ్బందులున్నా సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేశామని తెలిపారు. ప్రజలపై భారం పడకుండా ఆర్టీసీ సంస్థకు ప్రభుత్వమే రూ.1144 కోట్ల రూపాయలు చెల్లిస్తూ ఉచిత బస్సు..స్త్రీ నిధి పథకాన్ని అమలు చేస్తున్నాం. రూ. 10వేల కోట్లతో తల్లికి వందనం ద్వారా తల్లుల ఖాతాల్లో నగదు జమచేశాం. పేదలకు రూ.5 కే ఆహారం అందించేలా అన్న క్యాంటన్లను పునరుద్ధరించాం. వీటిల్లో ఇప్పటివరకు నాలుగు కోట్ల మంది భోజనం చేశారు. కోట్లాది రూపాయలతో పింఛన్లు క్రమం తప్పకుండా అందిస్తున్నాం. గ్యాస్ సంస్థలకు ప్రభుత్వమే డబ్బులు చెల్లిస్తూ ప్రజలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లను అందిస్తున్నాం. రెండు విడతల్లో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ. 6310 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం...త్వరలోనే మూడో విడత అన్నదాత సుఖీభవ నిధులు జమ చేస్తాం. విద్యుత్ రంగంలో సంస్కరణలు తీసుకొస్తూ విద్యుత్ ట్రూఅప్ చార్జీలను పూర్తిగా రద్దు చేశాం... విద్యుత్ ఛార్జీలను 29 పైసల మేర తగ్గిస్తున్నాం... రాబోయే మూడేళ్లలో ఒక యూనిట్‌కు 1.27 పైసలు తగ్గిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించిన విషయాన్ని మంత్రి ఆనం గుర్తు చేశారు. సూపర్ సిక్స్ లో ఆరు పథకాలు చెప్పి 60కి పైగా సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు.

# అనకాపల్లి రింగ్ రోడ్డు విస్తరణకు శ్రీకారం

మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఏపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా రహదారుల విస్తరణ, అభివృద్ధి మీద ప్రత్యేక దృష్టి పెట్టింది. తాజాగా అనకాపల్లిలో రింగ్ రోడ్డు విస్తరణకు చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రాజెక్టుకు ఇటీవలే శంకుస్థాపన కూడా నిర్వహించారు. వీటితో పాటుగా అనకాపల్లిలో నూకాలమ్మ ఆలయానికి చేరుకునేలా నాలుగు రహదారుల అభివృద్ధి, వీధుల విస్తరణ కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు. ఇవన్నీ పూర్తి అయితే అనకాపల్లిలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పడినట్లేనని అధికారులు చెప్తున్నారు. వాహనదారుల కష్టాలను తొలగించేలా ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా పలుచోట్ల జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ పనులు చేపడుతోంది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోనూ రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలోనే అనకాపల్లిలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇరుకు వీధులను విస్తరించటంతో పాటుగా పలుచోట్ల రహదారులను కూడా విస్తరిస్తున్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల పనులు పూర్తి అయ్యాయి. పెరుగుబజారులో రహదారి విస్తరణ పూర్తి అయ్యి.. వాహనదారులకు కూడా అందుబాటులోకి వచ్చింది. తాజాగా అనకాపల్లిలో రింగ్ రోడ్డును విస్తరించేందుకు అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. అనకాపల్లిలో రూ. 1.35 కోట్లతో రింగ్ రోడ్డును విస్తరించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇటీవలే రింగ్ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం కూడా జరిగింది. రైల్వేస్టేషన్ మీదుగా మార్కెట్ యార్డు వరకూ కాలిబాట, కాలువలు కూడా నిర్మించనున్నారు. వీటితో పాటుగా అనకాపల్లిలోని నూకాలమ్మ ఆలయానికి వెళ్లేందుకు వీలుగా నాలుగు రోడ్లను కూడా ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. అనుకున్న పనులు అన్నీ సకాలంలో పూర్తి అయితే అనకాపల్లిలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పడినట్లేనని అధికారులు చెప్తున్నారు. దీంతో ఎన్నో రోజుల నిరీక్షణకు తెరపడుతుందని చెప్తున్నారు.

# నేడు కూడా కొనసాగనున్న పొగ మంచు!

● తిరుగు ప్రయాణీకులకు వాతావరణ శాఖ హెచ్చరిక... వాహన ప్రయాణాల వేళ జాగ్రత్తలు పాటించాలి



ఏపీ ప్రజలకు వాతావరణ శాఖ బిగ్ అలర్ట్ ఇచ్చింది. పొగ మంచు హెచ్చరికలు జారీ చేసింది. గత నాలుగు రోజులుగా పొగమంచు విపరీతంగా ఉంటుంది. భోగి పండుగ ముందు రోజు నుంచి పొగమంచు దట్టంగా వ్యాపిస్తోంది. అప్పటి నుంచి శనివారం వరకు పొగమంచు కొనసాగుతూనే ఉంది. ఉదయం 8 గంటల వరకు పొగ మంచు తీవ్రత కొనసాగుతూనే ఉంది. అయితే నేడు కూడా పొగమంచు విపరీతంగా ఉంటుంది అని వాతావరణ శాఖ తెలిపింది. ఉదయం 8 గంటల వరకు పొగ మంచు ఉంటుంది కాబట్టి పండగ తిరుగు ప్రయాణాలు చేసేవారు జాగ్రత్తగా ఉండాలి అని వాతావరణ శాఖ సూచించింది.

**ఏపీకి వాతావరణ శాఖ హెచ్చరిక**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వాతావరణశాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రానికి పొగమంచు ఎఫెక్ట్ ఉన్నట్టు తెలిపింది.ఆదివార ఉదయం 8 గంటల వరకు పొగమంచు తీవ్రత ఎక్కువగా ఉంటుందని పేర్కొంది. ఆదివారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఎక్కువ పొగమంచు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. కాబట్టి పండగకు వెళ్లి తిరుగు ప్రయాణాలు చేసేవాళ్లు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. ఇదిలా ఉంటే పొగమంచు కారణంగా వాహనాలకు ప్రమాదం పొంచి ఉంటున్న సంగతి తెలిసిందే. పొగమంచు కారణంగా ముందు వెళుతున్న వాహనాలు సరిగా కనిపించ ఒకదానికొకటి ఢీ కొట్టి పలువురు ప్రాణాలు కోల్పోతున్న సంగతి తెలిసిందే. భోగి ముందు రోజు నుంచి చాలా చోట్ల పొగమంచు వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో అయితే శనివారం ఉదయం 9గంటల వరకు పొగమంచు దట్టంగా కమ్ముకుని ఉంది. దీంతో ఉదయం 9గంటల వరకు వాహనదారులు ఇబ్బందిపడ్డారు. విజయవాడ హైదరాబాద్ హైవేపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు నెలకొంది.

# టీడీపీ కార్యకర్తలపై వైసీపీ శ్రేణుల దాడిని ఖండించిన ఎమ్మెల్యే దివ్య



అన్నవరం (చైతన్యరథం): కాకినాడ జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడిలో వైకాపా శ్రేణుల దాడిలో టీడీపీ కార్యకర్త లాలం బంగారయ్య మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇప్పటికే పలువురిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అల్లిపూడి గ్రామంలో పోలీసులు పహారా కాస్తున్నారు. మరోవైపు బంగారయ్య మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వైసీపీ నేతల దాడిలో గాయపడిన మరో ఇద్దరు టీడీపీ కార్యకర్తలు కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని ఎమ్మెల్యే యనమల దివ్య పరామర్శించారు. వైసీపీ నేతల తీరుపై టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే వైసీపీ శ్రేణులు ఉద్దేశపూర్వకంగా కత్తులు, కర్రలు, బ్లేడ్లతో ఈ దాడులకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

# యూరియా, ఎరువుల విక్రయాలను నిరంతరం పర్యవేక్షించాలి



పోలవరం (చైతన్యరథం): మండలంలోని సహకార సంఘాల కార్యదర్శులు యూరియా, ఎరువు విక్రయాలను నిరంతరం పర్యవేక్షించాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎస్కే హబీబ్ బాషా అన్నారు. పోలవరం మండలంలోని ఐదు సహకార సంఘాల్లోని ఎరువుల గోదాములను ఆయన తనిఖీ చేశారు. అనంతరం కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి రబీ సీజన్ కు సంబంధించి ఎరువుల విక్రయాలపై పలు సూచనలు చేశారు. ఎట్టి పరిస్థితుల్లో ఇండస్ట్రీలకు ఎరువులు విక్రయించవద్దన్నారు. రైతులు అవసరాలకు అనుగుణంగా యూరియా కొనుగోలు చేయాలని సూచించారు. ప్రస్తుతం ఐదు సహకార సంఘాల్లో 350 మెట్రిక్ టన్నుల యూరియా సిద్ధంగా ఉందని, మరో 150 టన్నులు త్వరలో సరఫరా చేస్తామన్నారు. ఆయన వెంట ఏవో రాంబాబు తదితరులు ఉన్నారు.

# సరస్ మేళా మహిళల ఆర్థిక స్వావలంబనకు పునాది

●పారిశ్రామికవేత్తలు మారేందుకు దోహదం

●సరస్ మేళాను సందర్శించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): దేశంలో మహిళా ఆర్థిక సాధికారత కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీజీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో గుంటూరులో చేపట్టిన సరస్ మేళా సూపర్ సక్సెస్ అయ్యిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గుంటూరులోని నరసరావుపేట రోడ్డులో ఏర్పాటు చేసిన సరస్ మేళాను ఎమ్మెల్యే నసీర్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతి స్టాల్ వద్దకు వెళ్లి ఆయా ఉత్పత్తుల తయారీ, విక్రయాల గురించి డ్వాక్రా సంఘాల సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన గ్రూపు సభ్యులతో మాట్లాడారు. అక్కడ సంఘాల నిర్వహణ వంటి వాటి వివరాల గురించి ఆరా తీశారు. గుంటూరు నగరంలో ప్రజల నుంచి స్పందన ఎలా ఉందని అడిగారు. దీనిపై ఆయా డ్వాక్రా సంఘాల సభ్యులు సానుకూలంగా స్పందించారు. ఫుడ్ కోర్టును పరిశీలించిన ఎమ్మెల్యే నసీర్ అక్కడ వంటకాల రుచి చూసి .. చాలా బాగున్నాయంటూ కితాబిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఢిల్లీ వంటి మహానగరంలో ఏర్పాటు చేసే ఇలాంటి మేళాలను గుంటూరు నగరానికి తీసుకురావడం శుభపరిణామమన్నారు. దేశ వ్యాప్తంగా 21 రాష్ట్రాల నుంచి 600 ాఎ+ గ్రూపుల ద్వారా సుమారు 320 స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు డ్వాక్రా సంఘాల మహిళలు తరలి రావడం సంతోషకరమన్నారు. సరస్ మేళా గ్రామీణ మహిళలు, స్వయం సహాయ సంఘాల జీవితాల్లో ఎన్నో సానుకూల మార్పులు తీసుకొచ్చిందని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేసేందుకు దోహదపడుతుందన్నారు. కూటమి ప్రభుత్వ సహకారంతో మహిళలు వ్యాపార రంగాల్లో విజయవంతం కాగలమనే ఆత్మవిశ్వాసం పొందారని చెప్పారు. ఉద్యోగాలపై ఆధారపడకుండా స్వయం ఉపాధితో జీవించగల స్థితికి మహిళలు చేరుకున్నారని వెల్లడించారు. జాతీయ స్థాయి సరస్ మేళా గ్రామీణ మహిళల శక్తి, స్వయం ఉపాధి సామర్థ్యం, నాయకత్వ ప్రతిభకు ప్రత్యక్ష నిదర్శనమని చెప్పారు. ఇలాంటి కార్యక్రమానికి రూపకల్పన చేసిన సీఎం నారా చంద్రబాబు నాయుడుకు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన మహిళల విజయాలే ఇక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్ అని చెప్పారు. ఇంటికో పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దేందుకు ఇలాంటి మేళాలు దోహదం చేస్తాయన్నారు.

# సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం పలికిన జ్యోతుల నవీన్



కాకినాడ (చైతన్యరథం): ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కాకినాడ పర్యటనలో భాగంగా, కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. కాకినాడలో ప్రతిష్ఠాత్మక ఏఎమ్ గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన సీఎంని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని హెలిప్యాడ్ వద్ద జ్యోతుల నవీన్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాల్గొన్న జ్యోతుల నవీన్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, ముఖ్యంగా కాకినాడ ప్రాంతంలో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ వంటి భారీ పరిశ్రమలు రావడం యువతకు ఎంతో మేలు చేస్తుందని హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పెట్టుబడిదారులను బెదిరించి తరిమికొడితే, చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారులకు రెడ్ కార్పెట్ వేసి స్వాగతిస్తోందని, తద్వారా స్థానిక యువతకు వేల సంఖ్యలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.

# రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన

కొత్తవలస (చైతన్యరథం): సంక్రాంతి పండుగకు పలు ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన వారు.. సురక్షితంగా తమ గమ్యస్థానాలను చేరుకోవాలని ఆకాంక్షిస్తూ కొత్తవలస కూడలిలో పోలీసులు ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. విజయనగరం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు కొత్తవలస సర్కిల్ ఇన్స్పెక్టర్ సీహెచ్.షణ్ముఖరావు, ఎస్సై జోగారావు సిబ్బంది ప్రధాన కూడళ్లలో ప్రజలు, వాహనదారులు సురక్షితంగా ప్రయాణించాలని సూచించారు.

# ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం రైల్వే హాల్టులు

**●ప్రజా రవాణాకు మెరుగైన మార్గం : మంత్రి అచ్చెన్నాయుడు**

**●నూతన హాల్టు ప్రారంభించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు**



కోటబొమ్మాళి (చైతన్యరథం): నియోజకవర్గ ప్రజల ఆకాంక్షల మేరకే రైల్వే హాల్టుల కోసం కృషి చేయడం జరిగిందని, ఇందులో భాగంగానే సుదీర్ఘ కాలంగా నిరీక్షణలో ఉన్న సమస్యను కొలిక్కి తీసుకు వచ్చే విధంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సంప్రదింపులు చేసిన ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడం అభినందనీయమని, ఇందులో భాగంగా బ్రహ్మపురం నుంచి విశాఖ ఎక్స్ ప్రెస్ సర్వీస్ కు తిలారు వద్ద నూతన హాల్టు సాధించామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. తిలారు రైల్వే స్టేషన్ వద్ద బ్రహ్మపురం నుంచి విశాఖ ఎక్స్ ప్రెస్ సర్వీస్‌కు తిలారు వద్ద నూతన హాల్టును కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..1996లో దివంగత నేత, అప్పటి కేంద్ర మంత్రివర్యులు కింజరాపు ఎర్రన్నాయుడు ఈ ప్రాంత రైల్వే సమస్యలపై వాటి పరిష్కారం దిశగా చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. పార్లమెంట్ వేదికగా గళం వినిపించారు. గతంలో పార్లమెంట్ సభ్యులుగా పనిచేసిన వారు ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించ లేదు అని ఆవేదన చెందారు. రైల్వే సమస్యలపై కనీస శ్రద్ధ చూపలేదని అన్నారు. కానీ ఇప్పుడు సుదీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారంలో భాగంగా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కృషి చేస్తున్నారన్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న హరిశ్చంద్రపురం రైల్వే స్టేషను అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రికి విన్నవించారు. ప్రధాన సమస్య అయిన అండర్ పాస్ నిర్మాణం చేపట్టి వర్షాకాలంలో తరుచూ తలెత్తుతున్న సమస్యను పరిష్కరించి నీరు నిల్వ లేకుండా చేయాలని రైల్వే అధికారులకు కోరారు. రైల్వే కనెక్టివిటీతో అందరికీ ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని అన్నారు. అత్యధిక శాతం మంది ప్రజలు రైల్వే ప్రజా రవాణా పైనే ఆధారపడుతున్నందున ఈ ప్రాంత ప్రజల సౌకర్యార్థం స్థానిక రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో రైల్వే డీఆర్ఎం లలిత్ బోహ్రా, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# పార్టీ సీనియర్ కార్యకర్త పాడె మోసిన ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

**●మాణిక్యాలరావు కుటుంబానికి రూ.50వేల ఆర్థిక సాయం**




రాజమహేంద్రవరం (చైతన్యరథం): ధవలేశ్వరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పౌరోజు మాణిక్యాలరావు ఆకస్మిత మృతి పట్ల శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మాణిక్యాలరావు కుటుంబ సభ్యులను పరామర్శించి, భౌతికకాయానికి పూలమాలతో నివాళులు అర్పించి, అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు. తెలుగుదేశం పార్టీకి అనేక సేవలు అందించిన మాణిక్యాలరావు ఆకస్మితంగా మృతి చెందడం చాలా బాధాకరమని, తక్షణ ఆర్థిక సహాయంగా ఆ కుటుంబానికి 50వేల రూపాయలు సహాయాన్ని అందిస్తానని గోరంట్ల తెలిపారు. ఆ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని ప్రభుత్వం మంజూరు చేసే ఇల్లుతో పాటు పార్టీ నుండి ఆర్థిక సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వారితోపాటు రూరల్ మండల టీడీపీ అధ్యక్షులు మత్స్యేటి ప్రసాద్, రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పందురి అప్పారావు, పుక్కళ్ల రాజు, ఆళ్ల ఆనందరావు ఇతర నాయకులు తదితరులు ఉన్నారు.

# ఆ ఊరిలో గోమాతకు అలంకరణ పోటీలు

సంక్రాంతికి కోళ్ల పందేలౌ ఎడ్ల పోటీలు.. గుర్రం పోటీలు.. కామన్. కానీ పశువుల సహకారంతో రైతులు పండించిన పంట చేతికి వచ్చే సమయంలో చేసుకునే పండగ సంక్రాంతికి ఆ పాడి పశువులను ఎంతవరకు గుర్తుంచుకుంటున్నాం. మహాలక్ష్మి అమ్మవారి స్వరూపమైన గోమాతను పండుగ సందర్భంగా ప్రత్యేకంగా గుర్తించే కార్యక్రమం అనకాపల్లి జిల్లాలో జరిగింది. కనుమ పండుగ సందర్భంగా మునగపాకలో ఉత్సాహంగా గోమాతల అలంకరణ, ఆరోగ్య పోటీలు నిర్వహించారు. ఎవరైతే తమ గోమాతకు దాని బాగోగులను చూసుకుంటూ ఆరోగ్యకరంగా పెంచుతూ.. పండుగ పూట ప్రత్యేకంగా అలంకరణ చేస్తారో.. వారికి నగదు బహుమతులు అందించారు. రాష్ట్రంలోనే తొలిసారిగా జరిగిన.. పోటీల్లో పాల్గొనేందుకు పాడి రైతులు తరలివచ్చారు.

# "ఆ లింక్ క్లిక్ చేస్తే.. రూ.5,000 మీ ఖాతాలో పడతాయా?"

**● సంక్రాంతి పండుగను టార్గెట్ చేసుకున్న సైబర్ మోసగాళ్లు... మోసపోవద్దని పోలీసుల హెచ్చరిక!**




సంక్రాంతి పండుగను టార్గెట్ చేసుకుని సైబర్ మోసగాళ్లు కొత్త ఎత్తుగడకు పాల్పడుతున్నారు. "ఫోన్‌పే లింక్ క్లిక్ చేస్తే రూ.5,000 మీ ఖాతాలో పడతాయి" అంటూ సామాజిక మాధ్యమాల్లో మెసేజ్‌లు వైరల్ అవుతున్నాయి. మొదట నమ్మలేదని, కానీ నిజంగానే డబ్బులు వచ్చాయని చెప్పేలా మెసేజ్‌లు ఉండటంతో చాలామంది మోసపోయే ప్రమాదం ఉందని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఈ తరహా లింకులు పూర్తిగా నకిలీవని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. సంక్రాంతి పండుగ ఆఫర్లు వచ్చాయని ఆసక్తితో లింక్‌ను ఓపెన్ చేస్తే మొబైల్‌లోకి మాల్వేర్ చొరబడుతుంది. ఫోన్‌లో ఉన్న ఓటీపీలు, బ్యాంక్ వివరాలు, వ్యక్తిగత డేటా సైబర్ నేరగాళ్ల చేతికి వెళ్లి, క్షణాల్లో ఖాతాలు ఖాళీ అవుతాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. పండగ వేళ ఎవరూ ఉచితంగా డబ్బులు పంచరని పోలీసులు గుర్తు చేస్తున్నారు. ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటి యాప్‌లు ఎప్పటికీ లింక్‌ల ద్వారా డబ్బులు ఆఫర్ చేయవని, అలాంటి సందేశాలు వస్తే వెంటనే డిలీట్ చేయాలని సూచిస్తున్నారు. ఇక సన్నిహితులు ఫార్వార్డ్ చేసిన మెసేజ్ అయినా సరే, నిజమని భావించవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఈ లింక్‌లను క్లిక్ చేసి డబ్బులు కోల్పోయినవారు చాలా మంది ఉన్నారని గుర్తు చేస్తున్నారు. సైబర్ నేరగాళ్ల మాయ ఉచ్చులో పొరపాటున చిక్కుకుంటే, ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ క్రైం హెల్ప్ లైన్‌కు ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు. సమయానికి సమాచారం అందిస్తే నష్టాన్ని కొంతవరకు నివారించే అవకాశం ఉంటుందని తెలిపారు.

# ఇక రిటర్న్ జర్నీలు... ఎన్నో జ్ఞాపకాలతో పల్లెల నుంచి సిటీలకు తిరుగు ప్రయాణం

**● కిటకిటలాడుతున్న బస్‌స్టాండ్లు... ప్రత్యేక సర్వీసులు నడుపుతున్న ఆర్టీసీ**





అప్పుడు పండుగ రోజులు అయిపోయాయి. మళ్లీ దసరా వరకూ ఎదురుచూపులు తప్పవు. అదిగో, ఇదిగో అనుకుంటుండగానే.. సంక్రాంతి రావడం, అయిపోవడం కూడా జరిగిపోయింది. తిరిగి భారమైన హృదయాలతో సిటీలకు పయనం తప్పదు.. అదే జీవితం అంటే..! ప్రతీ సంవత్సరం సంక్రాంతి అంటే జస్ట్ 3 రోజుల సెలవులే ఉండేవి. ఈసారి లక్కీగా.. ముందు 2 వీకాఫ్‌లు, చివర 2 వీకాఫ్‌లలా వచ్చి.. మొత్తం 8 రోజుల దాకా సెలవులలా వచ్చాయి. దాంతో తెలుగు రాష్ట్రాల ప్రజలు ఫుల్ ఆనందంగా ఫీల్ అయ్యారు. తమ వారితో కాస్త ఎక్కువ రోజులు గడిపేందుకు వీలైందని అనుకున్నారు. ఇక ఇప్పుడు ముక్కనుమ వచ్చేసింది. ఇవాళ సాయంత్రం నుంచి తిరుగు ప్రయాణాలు మొదలవుతాయి. అన్ని ఊర్ల నుంచి మనం.. సిటీల బాట పడతాం. అఫ్‌కోర్స్ కొంతమంది ఆదివారం కూడా సొంత ఊర్లోనే ఉండి.. ఆదివారం నైట్ సిటీకి బయల్దేరేలా ప్లాన్ వేసుకున్నారు. అదీ మంచిదే. మరో రోజు మన వాళ్లతో ఉన్నట్లవుతుంది. ఇక రిటర్న్ జర్నీలు మొదలవుతాయి కాబట్టి.. మళ్లీ పంతంగి టోల్ ప్లాజా గుర్తురావడం సహజం. మొన్న కొన్ని జాగ్రత్తలు తీసుకోవడంతో.. ఎలాగొలా.. ట్రాఫిక్ గండం తప్పింది. ఇప్పుడు రిటర్న్‌లో కూడా ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. పల్లెల నుంచి సిటీలకు వచ్చే వారికి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తామని చెబుతున్నాయి. ఈ సంవత్సరం భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు బాగా జరిగాయి. నిషేధం ఉన్నా.. కోళ్ల పందేలు బాగా జరిగాయి. కోట్లు చేతులు మారాయి. చిత్రమేంటంటే.. అందరూ వీటి గురించి గొప్పగా చెబుతున్నారు. కోళ్లకు కత్తి కట్టడం హింసాత్మకం అని ఎవరూ అనట్లేదు. పైగా.. భారీగా పందేలు జరిగాయని పాజిటివ్‌గా చెబుతున్నారు.

**ప్రయాణీకులతో కిటకిటలాడుతున్న బస్‌స్టాండ్లు**

సొంత గ్రామాల్లో సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్న ప్రజలు తిరిగి నగరబాట పట్టారు. ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు తిరుగు పయనం అయ్యారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని ప్రధాన నగరాల బస్ స్టేషన్లు ప్రయాణికులతో నిండిపోయాయి. వివిధ ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. ఇక.. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్న రూట్లలో ఏపీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. స్పెషల్ బస్సుల్లో కూడా సాధారణ ఛార్జీలే వసూళ్లు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. దీంతో ఆర్టీసీ బస్సులలో ప్రయాణించేందుకే ప్రజలు మొగ్గుచూపుతున్నారు. మరోవైపు విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగుతోంది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ వై-జంక్షన్ వద్ద వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పాయి. సర్వీస్ రోడ్డుకు అధికారులు మరమ్మతులు చేశారు. ఆ ప్రాంతంలో తాత్కాలిక రోడ్లను వేశారు. దీంతో ఆ మార్గంలో ప్రయాణం సాఫీగా సాగుతోంది. వాహనాల సంఖ్య పెరిగినా ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రయాణాలు ముందుకు సాగుతున్నాయి. అధికారులు డ్రోన్ కెమెరాలు, సీసీటీవీలతో ట్రాఫిక్ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

# ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి : కేంద్రాన్ని కోరిన టీడీపీ నేత పాతర్ల రమేష్



"తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయులు యుగపురుషుడు అన్న ఎన్టీఆర్. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ ఎప్పటికీ నిలిచిపోతారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల కోసం అన్న శ్రీ నందమూరి తారక రామారావు విశిష్టంగా చేసిన కృషిని ఎవరూ మర్చిపోలేదని. బూజు పట్టిన సిద్ధాంతాలను ప్రక్కన పెట్టి "సమాజమే దేవాలయం... ప్రజలే దేళ్లు" అని నమ్మిన ఆయన పేదవాడికి పట్టెడన్నం పెట్టి వారి కష్టాలు తీర్చడమే సిద్ధాంతంగా ఎంచుకొని, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త రక్తాన్ని ఎక్కించారు. తెలుగుదేశంపార్టీ స్థాపించిన అనంతరం రాష్ట్ర ప్రజల్లో రాజకీయ చైతన్యం విశేషంగా పెరిగింది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావానికి ముందు పూర్వం ఈ రాష్ట్రాన్ని 35 సంవత్సరాలు కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ పాలించిన కాంగ్రెస్‌పార్టీ ప్రజాస్వామ్య విలువలను పక్కనపెట్టి లంచగొండితనాన్ని దౌర్జన్యాలు చేస్తూ. చట్టాలను చుట్టాలుగా చేసుకునే రౌడీలతో రాజ్యమేలుతూ తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని మంట గొలిపింది. సామాన్యుడికి జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కోవాలని ప్రజా శ్రేయసే పరమవద్దిగా తెలుగుదేశం పార్టీని 1982లో స్థాపించారు. కేవలం తొమ్మిది నెలల కాలంలో అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టించారు ఎన్టీఆర్. ఆయన 30వ వర్ధంతి సందర్భంగా ఆ యుగపురుషుడికి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇవ్వాలి." అని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్

**◆ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు**



వినుకొండ (చైతన్యరథం): వినుకొండ పట్టణంలోని ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయంలో ప్రజా దర్బార్‌లో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని పలు మండలాల నుండి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల విజ్ఞప్తులను సావధానంగా ఆలకించిన జీవీ, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, ప్రతి ఒక్కరి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజాదర్బార్ ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం లభిస్తుందని, వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం వల్ల సత్వర పరిష్కారం సాధ్యమవుతుందని ఆయన అన్నారు.

**ఎన్టీఆర్ వర్ధంతిని జయప్రదం చేయండి..**

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ సీఎం నందమూరి తారక రామారావు 30వ వర్ధంతిని ఈనెల 18వ తేది ఆదివారం వినుకొండ పట్టణంలోని గంగినేని ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నందున కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని జీవీ ఆంజనేయులు కోరారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగు రక్తదాన శిబిరానికి యువత అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జీవీ ఆంజనేయులు కోరారు.

# నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక భరోసా



వేమూరు (చైతన్యరథం): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని నియోజకవర్గ టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు వ్యాఖ్యానించారు. చుండూరు మండలం, వలివేరు గ్రామానికి చెందిన మోపర్తి అమృత కుమారి, అమృతలూరు మండలం మూల్పూరు గ్రామానికి చెందిన ఇమ్మల లావణ్య, ఇంటూరు గ్రామానికి చెందిన మద్దల ఆనంద కుమారి అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు. వైద్యానికి అవసరమైన ఖర్చుల నిమిత్తం లెటర్ అఫ్ క్రెడిట్ చికిత్స కోసం బిల్‌ని నక్కా ఆనందబాబు తన రిఫరెన్స్ లెటర్ ద్వారా సీఎం కార్యాలయానికి పంపించగా అక్కడ నుంచి వచ్చిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు శనివారం ఆనందబాబు వారికి అందజేశారు. పేదలకు సీఎం సహాయనిధి ఆపత్కాలంలో అండగా నిలిచి ఆదుకుంటుందన్నారు. అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం పేదల వైద్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తుంది

**◆గుడివాడ క్లబ్‌లో చెస్, బ్యాట్మెంటన్.. పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**



గుడివాడ (చైతన్యరథం): రాష్ట్రంలో క్రీడల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గుడివాడ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో నిర్వహిస్తున్న చెస్, బ్యాట్మెంటన్ క్రీడా పోటీలను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్డబ్ల్యూసి చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి చెస్ పాడిన ఎమ్మెల్యే రాము, బ్యాట్మెంటన్ ఆడుతూ క్రీడాకారులను ప్రోత్సహించారు. అనంతరం ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ.... నేడు సందడి వాతావరణం లో జరుగుతున్న క్రీడా పోటీల్లో పాల్గొనడం సంతోష్ కరమైన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని విభాగాల్లో క్రీడల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో, క్రీడల్లో పాల్గొనడం కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చిన్న పెద్ద అనే వ్యత్యాసం లేకుండా క్రీడల్లో పాల్గొనడం ద్వారా వ్యక్తిత్వ వికాసం, మానసిక ప్రశాంతత కలగడంతో పాటు అనేక రుగ్మతలు దూరమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ క్లబ్ ఉపాధ్యక్షుడు పొట్లూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శి నిమ్మగడ్డ శివశంకర్, టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు, గుడివాడ క్లబ్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తుంది



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు నగరం నల్లపాడు రహదారిలోని రెడ్డి కళాశాల ఎదుట ప్రాంగణంలో నిర్వహిస్తున్న సరస్ మేళాను చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర శనివారం సందర్శించారు. స్టాళ్లను పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు బాగున్నాయని వారిని అభినందించారు. ఆదివారంతో ఈ మేళా ముగియనుండటంతో వేలాది మంది ప్రజలు తరలివస్తున్నారు.

అరకు కాఫీ ఘుమఘుమలు, ఆత్రేయపురం పూతరేకులు, కాకినాడ కాజాలు, మాడుగుల హల్వాతో రుచుల పసందు ఓవైపు. కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మల కళారూపాల కనువిందు మరోవైపు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు విభిన్న ప్రాంతాలతో కొలువుదీరిన సమ్మేళనం 'సరస్ మేళా'. అని నాయకులు పేర్కొన్నారు.

# నేటి నుంచి 23 వరకు జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శ పోటీలు

**◆ ఏర్పాట్లను పరిశీలించిన చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి**



చిలకలూరిపేట (చైతన్యరథం) : తెలుగు రాష్ట్రాలు గర్వించేలా.. తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలైన జాతీయస్థాయి ఒంగోలు ఎడ్ల బలప్రదర్శన పోటీలను 6 రోజుల భారీఎత్తున పాటు చిలకలూరిపేట పట్టణ కేంద్రంలో నిర్వహించనున్నట్టు మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోని గోల్కొండ గార్డెన్స్‌లో ఆదివారం నుంచి ప్రారంభం కానున్న ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీల ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. కూటమినాయకులు, ఎడ్ల బలప్రదర్శన నిర్వాహకులతో కలిసి శనివారం నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ప్రత్తిపాటి మీడియాతో మాట్లాడారు.

**ఎడ్ల బలప్రదర్శన పోటీల్లో చిలకలూరిపేటకు ప్రత్యేక బ్రాండ్**

తెలుగువారి ఆరాధ్య దైవం నందమూరి తారక రామారావు వర్ధంతి, యువనేత, మంత్రి నారాలోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకొని, చిలకలూరిపేట కేంద్రంగా జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు, ఒంగోలు జాతి ఆవుల అందాల పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని మాజీమంత్రి ప్రత్తిపాటి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ సహాయ సహకారాలతో పెద్దఎత్తున పోటీలను నిర్వహిస్తున్నట్టు ఆయన స్పష్టం చేశారు. ఎడ్ల బలప్రదర్శన పోటీల నిర్వహణలో ప్రత్యేక బ్రాండ్ ఉన్న చిలకలూరిపేటలో 18వ తేదీ నుంచి 23 వరకు పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. తొలిరోజు (ఆదివారం) పోటీలను పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, విద్యుత్ శాఖా మంత్రి గొట్టి పాటి రవికుమార్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు చేతులు మీదుగా ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతాయని ప్రత్తిపాటి చెప్పారు. 6 రోజులు జరిగే పోటీలకు ప్రతి రోజూ ఒకరూ లేదా ఇద్దరు మంత్రులు ప్రత్యేక అతిథులుగా హాజరు కానున్నారు. 22 లేదా 23 తేదీల్లో కేంద్రమంత్రి పెమ్మసాని హాజరవుతారు. తర్వాత ప్రతి రోజు ఒకరు లేదా ఇద్దరు మంత్రులు ఎడ్ల బలప్రదర్శర పోటీలకు ప్రత్యేక అతిథులుగా హాజరై, పోటీలను ప్రారంభించడం, గెలుపొందిన ఎడ్ల యజమానులకు బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ఇప్పటికే పోటీల నిర్వహణ, ఏర్పాట్ల గురించి మంత్రులు ఎన్.ఎండీ.ఫరూక్, పీ.నారాయణ, కింజరాపు అచ్చెన్నాయుడు, ఆనం రామనారాయణ రెడ్డి, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, వంగలపూడి అనితలకు తెలియచేశామని ప్రత్తిపాటి వెల్లడించారు.

**6 రోజులు.. 8 విభాగాలు.. 160 వరకు ఎడ్ల జతలు**

గతంలో 4 సార్లు శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించడం జరిగిందని, ఇప్పుడు 5వ సారి నిర్వహించే పోటీలను మరింత ప్రతిష్టాత్మకంగా చేపట్టామని ఎడ్ల బలప్రదర్శన పోటీల ప్రధాన నిర్వాహకులు యలం సాంబశివరావు తెలియచేశారు. 18న ఉదయం 9 గంటలకు పాలపళ్ల విభాగం దూడలతో పోటీలను ప్రారంభించనున్నట్టు ఆయన చెప్పారు. పాలపళ్ల సైజులో 30 జతలు పోటీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. పాలపళ్ల విభాగానంతరం రెండుపళ్లు, నాలుగుపళు ్ల, తర్వాత 6 పళ్ల విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. చివరికి సీనియర్స్ విభాగంతో పోటీలను ముగిస్తామని, పోటీల్లో పాల్గొనే ప్రతి ఎడ్ల జతకు గెలుపు ఓటములతో సంబంధ లేకుండా కన్సోలేషన్ బహుమతులు అందించనున్నట్టు సాంబశివరావు తెలియచేశారు. మొత్తం 8 విభాగాల్లో 150 నుంచి 160 వరకు ఎడ్ల జతలు పాల్గొంటాయన్నారు. ఎడ్ల బలప్రదర్శన పోటీలకు ఎడ్ల అభిమానులు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# రూ.1.37 కోట్లతో 6 రహదారులకు నిధులు

**◆ వెల్లడించిన పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్**



పొన్నూరు (చైతన్యరథం): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.1.37 కోట్ల వ్యయంతో నియోజకవర్గంలో 6 రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నాం." అని నియోజకవర్గ టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ తెలిపారు. ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో పర్యటించిన సమయంలో ప్రజలు కోరిన అభివృద్ధి చేసేందుకు ప్రాధాన్యతిస్తున్నాం అందులో భాగంగా గ్రామాల్లో ప్రజలకు అత్యంత అవసరమైన ఆరు రహదారుల నిర్మాణానికి రూ.1.37 కోట్లతో రహదారుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ద్వారా జిల్లా కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. త్వరితగతిన రహదారుల నిర్మాణం చేసి ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# సంక్షేమాభివృద్ధికి చిరునామా చంద్రబాబు పాలన

## అభివృద్ధి పనల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రులు డోలా, గొట్టిపాటి, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే ఉగ్ర, దామచర్ల తదితరులు





దర్శి, (చైతన్యరథం): దర్శి నియోజకవర్గంలో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలన విద్యుత్ శాఖ మాత్యులు గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మాత్యులు డోలా బాల వీరాంజనేయ స్వామి గారు, గౌరవ ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి గారు, సీనియర్ శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, విజయ్ కుమార్, అశోక్ రెడ్డి, యర్రగొండపాలెం టిడిపి ఇంచార్జ్ ఏరిక్షిన్ బాబు, వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరావు, మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలో ప్రారంభోత్సవాలు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ జరిగింది. అనంతరం జరిగిన బహిరంగ సభలో ముఖ్య అతిథులు దర్శిలో తెలుగుదేశం జెండా ఎగరాలని తెలుగుదేశంతోనే అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. గత ఐదేళ్లు వైసిపి లో దర్శి వెనకబడిందని అభివృద్ధికి దూరమైందని వారు విమర్శించారు. మన 18 నెలలకూటమిపాలనలో టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ సారథ్యంలో ప్రజా పాలన అభివృద్ధి పాలన నడుస్తుందని వారి అభివర్ణించారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షులు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ స్వల్ప తేడాతో సాంకేతికంగా మన డాక్టర్ లక్ష్మీ ఓటమి చెందినప్పటికీ ప్రజానేతగా గెలిచారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఊరూరా తెలుగుదేశం గెలవాలని టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ గెలిచిన వైసీపీ శాసనసభ్యుడు అసెంబ్లీకి రారు, ప్రజా సమస్యల పట్టించుకోరు నియోజకవర్గాల అభివృద్ధి గురించి పట్టించుకోరు అని స్థానిక ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి గురించి ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్ గురించి పరోక్షంగా విమర్శ చేశారు. ఓడిపోయినప్పటికీ ప్రజల హృదయాలు గెలిచిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్సన్ బాబు ప్రజల మధ్య ఉంటూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ఈ 18 నెలల కాలంలో అభివృద్ధి ఎజెండాగా ముందుకు వెళు తున్నారని ఆయన వివరించారు. విద్యుత్ శాఖ మాత్యులు గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ... విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా మన ప్రభుత్వం పాలన సాగిస్తుందని అందులో భాగంగానే దర్శి నియోజకవర్గంలో విద్యుత్తు డివిజన్ కార్యాలయం, విద్యుత్ సబ్ స్టేషన్ ఆరు నెలల్లో ప్రజలకు అంకితం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఎంపీ మాగుంట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దర్శిని అభివృద్ధి చేసే బాధ్యత కూటమి ప్రభుత్వం చేపట్టిందని అందుకు ఎంపీగా తగిన నిధులు మంజూరు చేసి డాక్టర్ లక్ష్మికి అండదండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే దామరచర్ల జనార్దన్ మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లే విధంగా మన కూటమి పాలనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రజా జన రంజక పాలన సాగిస్తున్నారని ప్రజలందరూ ఆదరించాలని కోరారు.

# క్రీడలతోనే మానసిక వికాసం



ఉదయగిరి, (చైతన్యరథం): వింజమూరు మండలం చంద్రపడియ గ్రామంలో నిర్వహించిన చంద్రపడియ క్రికెట్ టోర్నమెంట్ బహుమతుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గౌరవ ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ యువతతో కలిసి ఉత్సాహభరితంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువతను మరింత ప్రోత్సహించే ఉద్దేశంతో సరదాగా క్రికెట్ ఆడి అందరినీ ఆకట్టుకున్నారు. క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంలో, స్నేహభావాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అనంతరం విన్నర్ టీంకు మొదటి బహుమతిగా 60 వేల రూపాయలను, రన్నర్ టీంకు 30 వేల రూపాయలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. అలాగే, ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన యువత వ్యాపార, ఉద్యోగ నిమిత్తం బయట ప్రాంతాల్లో నివసిస్తున్నప్పటికీ, సంక్రాంతి పండుగ సందర్భంగా సొంత గ్రామాలకు తిరిగి వచ్చి గ్రామ సమస్యలను తెలుసుకుంటూ, వివిధ సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ గ్రామ అభివృద్ధికి తోడ్పడుతున్న తీరును ఎమ్మెల్యే ప్రత్యేకంగా ప్రశంసించారు. గ్రామ అభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమని, వారి ఐక్యత సేవాభావం భవిష్యత్తులో గ్రామాలకు మరింత వెలుగును తీసుకువస్తుందని అభినందనలు తెలియజేశారు.

# అశ్రునయనాల మధ్య టీడీపీ నేత జాకీర్ అంతిమ యాత్ర

## పాడె మోసిన మంత్రి నారాయణ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర తదితరులు

నెల్లూరు, (చైతన్యరథం): అజాత శత్రువుగా, నిబద్ధత గల నాయకుడిగా పేరుపొందిన టీడీపీ నేత జాకీర్ అకాల మరణం నగరాన్ని తీవ్ర విషాదంలో ముంచింది. విజయవాడ నుంచి నెల్లూరుకు వస్తుండగా మేదరమెట్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందడం పార్టీకి, ముస్లిం మైనారిటీ వర్గానికి తీరని లోటును మిగిల్చింది. శనివారం మధ్యాహ్నం ఖుద్దూస్ నగర్ నుండి ఫత్తేఖాన్ పేట కలాన్ మస్జిద్ వరకు జరిగిన ఆయన అంతిమ యాత్ర అత్యంత భావోద్వేగాల మధ్య సాగింది. తొలుత హాల్తాలిమ్ మస్జిద్‌లో జాకీర్ పార్థివ దేహానికి ముస్లిం సంప్రదాయం ప్రకారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి నారాయణ, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, ఇంచార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు అధ్యక్షులు అజీజ్, టీడీపీ నేతలు డాక్టర్ జెడ్ శివప్రసాద్, వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తదితరులు జాకీర్ పాడె మోసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అంత్యక్రియలు ముగిసే వరకు మంత్రి నారాయణ అక్కడే ఉండి, తన ఆత్మీయ నేతకు కడసారి వీడ్కోలు పలికారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ జాకీర్ అకాల మృతి తనను కలచివేసిందని. జెండావీధిలో ఒక గొప్ప ఆత్మీయ నాయకుడిని కోల్పోయానని. ముస్లిం సమాజ అభివృద్ధి కోసం ఆయన నిరంతరం పరితపించేవారని అన్నారు. పార్టీ కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం అని నివాళులు అర్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా జాకీర్ కుటుంబానికి భరోసా ఇచ్చారన్నారు. వక్ఫ్ బోర్డు చైర్మన్ అజీజ్ మాట్లాడుతూ జాకీర్ మృతి ముస్లిం సమాజానికి తీరని లోటన్నారు. పెద్ద పదవుల్లో లేకపోయినా, ఆయన అంతిమ యాత్రకు తరలివచ్చిన వేలాది మంది జనమే ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనం అన్నారు. గతంలో ఆయన పర్యవేక్షించిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను మళ్ళీ ఏర్పాటు చేసి, దానికి 'జాకీర్ణ పేరు పెట్టాలని మంత్రి నారాయణను కోరానని..అందుకు వారు సానుకూలంగా స్పందించారన్నారు. ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర మాట్లాడుతూ 'జాకీర్ ఎప్పుడూ సమాజం మేలు కోసమే ఆలోచించేవారు తప్ప, తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఏమీ కోరలేదని... ఈ నెల 17న తనను కలవాలని చెప్పారు, కానీ ఇలా అంతిమ యాత్రలో పాల్గొనాల్సి రావడం దురదృష్టకరమని అన్నారు. పార్టీ ఆయన కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. నగర ఇంచార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ జాకీర్ చిరకాల స్నేహితుడని, ఆయనలోని సేవా భావం మెండుగా ఉండేదన్నారు.. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రాజకీయ, సామాజిక ప్రముఖులు మరియు వేలాది మంది ప్రజలు పాల్గొని తమ ప్రియతమ నాయకుడికి కన్నీటి వీడ్కోలు పలికారు.







# అద్భుత రీతిలో సోమేశ్వర ఆలయ నిర్మాణం

## ఆరు నెలల్లోనే నిర్మాణాన్ని పూర్తిచేసి ఆలయ మహా కుంభాభిషేకం ఘనంగా నిర్వహిస్తాం మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడి



సోమశిల, (చైతన్యరథం): సోమశిల జలాశయం సమీపంలోని ప్రసిద్ధి చెందిన శ్రీ కామాక్షి సమేత సోమేశ్వరాలయాన్ని అత్యంత సుందరంగా నిర్మిస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చెప్పారు. బుధవారం సోమశిలలో మంత్రి ఆనం పర్యటించారు. సోమశిల గ్రామంలో రూ. 30 లక్షలతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్లను మంత్రి ప్రారంభించారు. సోమేశ్వరాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శ్రీ కామాక్షి సమేత సోమేశ్వరాలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సోమశిల జలాశయాన్ని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ 13.50 కోట్లతో శ్రీ కామాక్షి సమేత సోమేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మిస్తున్నామని, పనులు వేగంగా జరుగుతున్నట్లు చెప్పారు. మరో ఆరు నెలల్లోనే ఆలయాన్ని పూర్తి చేసి కుంభాభిషేక వేడుకలను ఘనంగా నిర్వహించి ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షల మేరకు ఆలయానికి పూర్వ వైభవం తీసుకొస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇదే తరహాలో అనేక ప్రసిద్ధ ఆలయాల పునర్నిర్మాణలకు తమ ప్రభుత్వం కోట్లాది రూపాయలు నిధులను మంజూరు చేసినట్లు చెప్పారు. హైందవ సంస్కృతిని, హిందూ ధర్మాన్ని, సనాతన ఆచారాలను కాపాడుతూ ఆలయాలన్నీ ఆధ్యాత్మిక శోభతో వర్ధిల్లేలా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

## 23న పట్టాల పంపిణీ, నియోజకవర్గ అధికారులకు ఎమ్మెల్యే రాజు ఆదేశాలు




మడకశిర, (చైతన్యరథం): మడకశిర నియోజకవర్గంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాలు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని నియోజకవర్గంలోని 5 మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఆర్.ఐలు, సర్వేయర్లు, ఏపీఓలకు స్థానిక శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యుడు శ్రీసత్యసాయిజిల్లా టీడీపీ అధ్యక్షులు ఎమ్మెస్ రాజు ఆదేశించారు. మడకశిరలోని క్యాంపు కార్యాలయంలో 5 మండలాల అధికారులతో ఎమ్మెల్యే రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గవ్యాప్తంగా పేదవారు, అర్హత ఉన్నవారు ఎంత మందికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలి, ఎంత మందికి కొత్త స్థలాలు ఇవ్వాలి, ఎంత మందికి ఇవ్వడానికి అవకాశం ఉంది? కొత్తవారికి స్థలాలు ఇవ్వడానికి స్థల సేకరణ ఎలా చేయాలి అనే అంశాలన్నింటిపై అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు.

ఈనెల 23న యువమంత్రి నారా లోకేష్ పుట్టినరోజును పురస్కరించుకుని మడకశిర నియోజకవర్గవ్యాప్తంగా 10వేల మంది అర్హులకు ఇళ్ల పట్టాలు పంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అర్హుల పేర్లు ఎలాంటి తప్పులు లేకుండా అదేవిధంగా ఇళ్ల పట్టాల్లో సరిహద్దులు, కొలతలు కూడా ఎలాంటి తప్పులు లేకుండా పట్టాలు సిద్ధం చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గవ్యాప్తంగా ఇళ్ల పట్టాల పంపిణీ ఒక పండుగ వాతావరణంలో జరగాలని, దీనికి అనువైన ఏర్పాట్లు చేయాలని కోరారు.

కూటమి ప్రభుత్వంలో పేదల ముఖాల్లో చిరునవ్వులు నింపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ చేస్తున్న కృషికి ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం అద్దం పట్టేలా ఉండాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో అన్ని వర్గాలకు అవసరమైన విధంగా శ్మశానవాటికలు ఏర్పాటు చేసేందుకు కూడా అధికారులు దృష్టిపెట్టాలని ఆదేశించారు. స్థల సేకరణ చేసి, ప్రతి గ్రామంలో అన్ని వర్గాలకు శ్మశానవాటికలు కేటాయించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, అధికారులు దీనిపై కసరత్తు చేయాలని సూచించారు.

# క్రీడలకు ప్రాధాన్యం : శాప్ చైర్మన్ రవినాయుడు

బాలాయపల్లి(చైతన్యరథం): వెంకటగిరిలో జీఎన్నార్ సర్వీస్ ట్రస్టు ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న వాలీబాల్ పోటీలను శాప్ చైర్మన్ రవినాయుడు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ సీఎం చంద్రబాబు క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఇందులో మెడల్స్ సాధించిన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ప్రకటనల్లో పోటీ పరీక్షలతో సంబంధం లేకుండా ఉద్యోగాలు ఇచ్చేలా నిర్ణయించినట్లు రవి నాయుడు తెలిపారు. ఇటీవల క్రీడాకారుల స్థాయిని ప్రామాణికంగా తీసుకొని 421 ఉపాధ్యాయ ఉద్యోగాలు, మరో 42 మందికి అటవీ ఉద్యోగాలు పోటీ పరీక్షలు లేకుండా ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిది అని రవినాయుడు వెల్లడించారు. జగన్ ప్రభుత్వంలో స్పోర్ట్స్ విభాగానికి రెండేళ్ల వ్యవధిలో చెల్లించని రూ. 16 కోట్లతోపాటు మరో రూ. 8 కోట్ల నిధులను సీఎం చంద్రబాబు విడుదల చేసినట్లు తెలిపారు. వెంకటగిరిలో రూ. 3 కోట్లతో క్రీడా మల్టీ పర్పస్ స్టేడియం నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు రవినాయుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీఎన్నార్ సంస్థ నిర్వాహకుడు గంగోటి నాగేశ్వర్రావు. తదితరులు పాల్గొన్నారు.

## ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో

# త్వరలో టీటీడీ నిత్యాన్నదాన పథకం అమలు

ఒంటిమిట్ట, (చైతన్యరథం): వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయం ప్రాంగణంలో తితిదే ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న నిత్యాన్నదాన పథకాన్ని త్వరలో ప్రారంబిస్తామని తితిదే సంయుక్త కార్యనిర్వహణాధికారి వల్లూరు వీరబ్రహ్మం అన్నారు. శనివారం ఒంటిమిట్ట రామాలయాన్ని జేఈవో వీరబ్రహ్మం సందర్శించారు. గర్భాలయంలో సీతారామలక్ష్మణమూర్తులను దర్శించారు. అనంతరం నిత్యాన్నదానం ఏర్పాట్లను పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. ఈ ఏడాది మార్చి 26 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు శ్రీరామ నవమి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా సకల సదుపాయాలు కల్పించేందుకు ఇప్పటి నుంచే ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని వివరించారు.

ఆయన వెంట ఎస్ఈలు మనోహరం, వెంకటేశ్వర్లు, ఈఈలు సుమతి, రవిశంకర్ రెడ్డి, డిప్యూటీ ఈవో ప్రశాంతి, డీఈ నాగరాజు, ఏఈ అమర్ నాథ్ రెడ్డి ఉన్నారు.



# అయ్యప్పగుడి ఫ్లైఓవర్ పున:ప్రారంభం



నెల్లూరు రూరల్, (చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలోని అయ్యప్పగుడి ఫ్లైఓవర్ బ్రిడ్జిని కార్పొరేటర్ దుద్దుగుంట శ్రీనివాసులు రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలోటీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ప్రారంభించారు. 3 బాక్స్ కల్వర్టులు, 1 కిలోమీటర్ డ్రైన్ పనులు పూర్తి చేసి మే నెలలో ప్రజలకు అందుబాటులోకి తెస్తామని టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి వెల్లడించారు. ?? బాక్స్ కల్వర్టులు, డ్రైన్ పూర్తయితే వర్షపు నీళ్లు నిలవకుండా, ముంపుకు గురవ్వకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మూలే విజయభాస్కర్ రెడ్డి, 23వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు మేకల మధు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ టిడిపి ఎస్.సి. సెల్ అధ్యక్షుడు ఆరవ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు పామూరు సుధాకర్ రెడ్డి, పాతపాటి పుల్లారెడ్డి, చల్లా సుబ్బన్న, నెల్లిపూడి సుధాకర్, పామూరు మస్తాన్ రెడ్డి, మురళి రెడ్డి, మనోహర్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, బాబ్జి, చిన్న మల్లికార్జున, సికారి భాస్కర్, రాజా, బాబు నాయుడు, శివ, హరి, మమతా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్‌లో మరో హిందువు బలి

**మైనార్టీలే లక్ష్యంగా దాడులు**



బంగ్లాదేశ్ మైనారిటీలే లక్ష్యంగా దాడులు కొనసాగుతున్నాయి. శుక్రవారం మరో హిందువును అక్కడి వ్యక్తి కారుతో ఢీకొట్టి హత్య చేసినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. మీడియా కథనాల ప్రకారం., రాజ్బరిలోని కరీం ఫిల్లింగ్ స్టేషన్లో రిపోన్ సాహా (30) పనిచేస్తున్నాడు. శుక్రవారం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎస్పీ) రాజ్బారి జిల్లా యూనిట్ మాజీ కోశాధికారి అబుల్ హషేమ్ పెట్రోల్ కోసం వచ్చాడు. పెట్రోల్ కొట్టించుకున్నాక డబ్బు. ఇవ్వకుండా వెళ్లడానికి ప్రయత్నించడంతో రిపోన్ అతడిని ఆపడానికి ప్రయత్నించాడు. ఇంధనానికి అయిన డబ్బు చెల్లించాలని అడగడంతో ఆగ్రహానికి గురైన హషేమ్ కారుతో రిపోన్ పైకి దూసుకువెళ్లాడు. కారు తన పైనుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలపాలైన రిపోన్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకొన్నారు. అబుల్ హషేము అతడి కారు డ్రైవర్‌ను అరెస్టు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు. కాగా దాదాపు మూడు వారాల వ్యవధిలోనే పది మంది హిందువులు హత్యకు గురవడంతో బంగ్లాలో హిందువుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది.

## ఎర్రకోటపై దాడికి ఉగ్రసంస్థల కుట్ర

**హెచ్చరించిన భారత నిఘా వర్గాలు**

ఈ ఏడాది గణతంత్ర వేడుకలను లక్ష్యంగా చేసుకొని ఢిల్లీలో దాడులకు ఉగ్రసంస్థలు ప్రణాళికలు రచిస్తున్నట్లు నిఘావర్గాలు వెల్లడించాయి. ఖలిస్థానీ, బంగ్లాదేశ్ కేంద్రంగా ఉన్న ఉగ్ర సంస్థలు రిపబ్లిక్ డే రోజున దిల్లీ సహా దేశంలోని ప్రముఖ నగరాల్లో దాడులకు ప్రయత్నించవచ్చని తెలిపాయి. దేశ అంతర్గత భద్రతను దెబ్బతీసేందుకు ఖలిస్థానీ, ఇతర రాడికల్ హ్యాండ్లర్లు స్థానిక గ్యాంగ్‌స్టర్లను ఉపయోగిం చుకుంటున్నారని పేర్కొన్నాయి. హరియాణా, పంజాబ్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్లలో ఉగ్రనెట్వర్కును విస్తరిస్తున్నట్లు సమాచారం అందినట్లు తెలిపాయి. గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడు జరిగిన నేపథ్యంలో నిఘా వర్గాల హెచ్చరికలపై అధికారులు అప్రమత్తమయ్యారు. ఢిల్లీ సహా ఇతర ప్రముఖ నగరాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేశారు.



# నా బంగ్లాను కూల్చిన వారు కుప్పకూలిపోయారు

**భాజపా ఎంపీ కంగనా రనౌత్**



మహారాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భాజపా నేతృత్వంలోని మహాయుతి కూటమి ఘన విజయం సాధించింది. ముఖ్యంగా బృహన్ముంబయి మున్సిపల్ కార్పొరేషన్లో అతి పెద్ద పార్టీగా అవతరించింది. దీనిపై భాజపా ఎంపీ, నటి కంగనా రనౌత్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గతంలో ముంబయిలోని ఆఫీసు కూల్చివేత ఘటనను గుర్తుచేసుకుంటూ ఉద్ధవ్ ఠాక్రే పార్టీపై విమర్శలు గుప్పించారు. "బీఎంసీ ఎన్నికల్లో భాజపా ఘన విజయం సాధించడం చాలా గొప్ప విషయం. గతంలో నన్ను (ఆఫీసు కూల్చివేతను ఉద్దేశిస్తూ) వేధించిన వారిని, నా బంగ్లాను కూల్చేసిన వారిని, మహారాష్ట్ర నుంచి వెళ్లిపోవాలని నన్ను బెదిరించిన వారిని, ఇప్పుడు రాష్ట్రమే వదిలేసింది. మహిళలపై ద్వేషభావం ఉన్న బంధుప్రీతి మాఫియాకు. ప్రజలు సరైన చోటు చూపించారు" అని కంగనా రనౌత్ దుయ్యబట్టారు. 2020లో ముంబయిలోని బాంద్రాలోని కంగనా రనౌత్ కార్యాలయంలో కొంత భాగాన్ని అప్పటి బీఎంసీ అధికారులు అక్రమ కట్టడం పేరుతో కూల్చేశారు. దీనిపై అప్పట్లో ఆమె ముంబయి కోర్టును ఆశ్రయించగా.. అధికారుల తీరుపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. "బీఎంసీది కక్ష సాధింపు చర్యలాగే కన్పిస్తోంది. కంగనాను బెదిరించేందుకే ఆమె కార్యాలయాన్ని కూల్చినట్లుగా స్పష్టంగా తెలుస్తోంది. ఈ చర్యలను తక్షణమే ఆపాలి, నటికి జరిగిన నష్టాన్ని బీఎంసీనే పూడ్చాలని కోర్టు ఆనాడు తీర్పు వెలువరించింది. బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్ పుత్ ఆత్మహత్య కేసు దర్యాప్తు గురించి నాడు కంగనా రనౌత్ మాట్లాడుతూ మూవీ మాఫియా కంటే ముంబయి పోలీసులంటేనే భయంగా ఉందని పేర్కొన్నారు. అవి కాస్తా రాజకీయ దుమారం రేపాయి. దీంతో శివసేన నేతలు, నటికి మధ్య కొన్ని రోజుల పాటు మాటల యుద్ధం సాగింది. ఆ సమయంలో ఈ కూల్చివేత చోటుచేసుకోవడం తీవ్ర చర్చనీయాంశమైంది.

# దేశ చరిత్ర నేటితరం పిల్లలకు తెలియాలి

**రాజ్యసభ ఎంపీ సుధామూర్తి**



దేశ చరిత్ర, ముఖ్యంగా దేశ విభజనకు దారితీసిన పరిస్థితు లను నేటితరం పిల్లలు తప్పని సరిగా అర్థం చేసుకోవాలని రాజ్యసభ ఎంపీ, ప్రముఖ రచయిత్రి సుధామూర్తి అన్నారు. దేశ విభజన జరగడం తప్పని, భవిష్యత్తులో అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా చూసు కోవాలని అన్నారు. రాజస్థాన్లో జరుగుతున్న జైపూర్ సాహిత్య వేడుకలో సుధామూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ విభజనపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. "నీకు చరిత్ర తెలియకపోతే.. భవిష్యత్తును అర్థం చేసుకోలేవు. దేశ విభజన నాటి పరిస్థితులు గుర్తొస్తే ఆ పరిణామాల గురించి నేటితరానికి తెలియజేయాలని నేను చాలాసార్లు అనుకున్నా. భారత సంప్రదాయాలు, భాషల గురించి ఏమీ తెలియని వ్యక్తి పెన్సిల్ (నాటి వైస్రాయ్‌ని ఉద్దేశించి) తీసుకుని గీత గీసి ఇవి మీ సరిహద్దులని చెప్పారు. ఆ విభజన కారణంగా పాకిస్తాన్, బంగ్లాదేశకు వలస వెళ్లినవారి గురించి ఆలోచిస్తే చాలా బాధగా ఉంటుంది. ఓసారి నేను పాకిస్థాన్‌కు వెళ్లినప్పుడు అక్కడ మ్యూజియంకు వెళ్తే విదేశీయురాలినని ఎక్కువ ఛార్జ్ చేశారు. ఒకప్పుడు అది మన అఖండ భారతంలోని భాగమే కదా ఇప్పుడు సరిహద్దుల కారణంగా విదేశమైందన్న ఆలోచన నన్ను చాలా బాధ పెట్టింది" అని సుధామూర్తి గుర్తుచేసుకున్నారు. "ఈ భూమి, మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ ఊరికే రాలేదన్న విషయాన్ని ఇప్పటి పిల్లలకు చెప్పాలనుకుంటున్నా. మన పూర్వీకులు ఎంతో కష్టపడి వాటిని సాధించారు. ఎంతోమంది ఇళ్లను కోల్పోయినా, సంకల్ప బలంతో వారి జీవితాలను పునర్ నిర్మించుకున్నారు. దేశ విభజన కోసం అనాడు తీసుకున్న ఓ తప్పుడు నిర్ణయం ఎన్నోతరాలపై ప్రభావం చూపిస్తోంది" అని సుధామూర్తి వివరించారు. ఈ విషయాలన్నీ యువతరానికి తెలియజేసేందుకు 'ది మ్యాజిక్ ఆఫ్ ది లాస్ట్. 'ఇయరింగ్స్ పుస్తకాన్ని రాసినట్లు తెలిపారు. తన మనవరాలు ఆనౌష్క శర్మను ఆధారంగా చేసుకునే ఈ పుస్తకంలోని ప్రధాన పాత్రను తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు.



## చొరబాట్లే బెంగాల్‌కు సవాల్

**ప్రధాని మోదీ**

ప్రజల ఆకాంక్షలను తీర్చడంలో మమతా బెనర్జీ నేతృత్వంలోని ప్రభుత్వం విఫలమైందని, బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ప్రధాని మోదీ అన్నారు. పశ్చిమ బెంగాల్ పర్యటనలో భాగంగా ప్రధాని మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చే భాజపా ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందన్నారు. దేశప్రజలు ముఖ్యంగా జెన్-జీ కూడా భాజపా అభివృద్ధి నమూనాను విశ్వసిస్తున్నారని అన్నారు. మాల్దా సభలో ప్రసంగించిన ఆయన, బీహార్లో ఎన్డీయే విజయం సాధించిందని, ఇక బెంగాలు సమయం ఆసన్నమైందన్నారు. ఈ సందర్భంగా బెంగాలు అసలైన సవాల్ చొరబాట్లేనని, వీటిని ఆరికట్టడంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు, బెంగాలు అతిపెద్ద సవాల్ చొరబాట్లేనని.. వీటి కారణంగానే మాల్దా, ముర్షిదాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగుతున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. చొరబాట్ల ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల జనాభా వర్గీకరణలోనూ మార్పు వచ్చిందని, వీటిని అరికట్టడానికి తృణమూల్ కాంగ్రెస్ ఎటువంటి చర్యలు చేపట్టలేదని దుయ్యబట్టారు. రాష్ట్రానికి వరద సహాయ నిధులను 40 సార్లు అందించామని, అయినా అవి అసలైన లబ్దిదారులకు చేరలేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కేంద్రం నిధులను తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం. కొల్లగొడుతోందని, ఆ పార్టీ అవినీతి, హింస, బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడే పార్టీ అని అన్నారు. టీఎంసీ అధికారం కోల్పోయి, భాజపా అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. తూర్పు భారత్ దశాబ్దాలుగా వెనకబడి ఉందన్నారు.

# స్వదేశానికి వస్తామనుకోలేదు

# ఇరాన్ పరిస్థితులపై భారతీయుల భావోద్వేగం



ఇరాన్‌లో పరిస్థితులు క్షీణించడంతో అక్కడ చిక్కుకున్న భారతీయులను విదేశాంగ శాఖ సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చింది. తొలివిడతలో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి తర్వాత పలువురు భారతీయులు ఢిల్లీకి చేరుకున్నారు. అనంతరం వారు ఇరాన్లో పరిస్థితుల గురించి మీడియాతో మాట్లాడారు. ఇరాన్లో ఎక్కడ చూసినా ఆందోళనకారులే ఉన్నారని, ఇంటి నుంచి బయటకు వచ్చే పరిస్థితులే లేవని అన్నారు. వీధుల్లో నిరసనకారుల మృతదేహాలు, ప్రజల హాహాకారాలతో పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నారు. ఇంటర్నెట్ సదుపాయం నిలిపివేయడంతో తమ పరిస్థితిని కుటుంబసభ్యులకు వివరించే అవకాశం లేక తీవ్ర భయాందోళనకు గురయ్యామన్నారు. విదేశాంగశాఖ అధికారులను సంప్రదించడానికి కూడా వీలు కాలేదన్నారు. ఈ రెండు వారాలపాటు క్షణమొక యుగంలా గడిచిందన్నారు. తిరిగి భారతకు వస్తామనుకోలేదని, ఇటువంటి క్లిష్ట సమయంలో తమను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. తమ వారి కోసం విమానాశ్రయానికి చేరుకున్న కుటుంబసభ్యులు మాట్లాడుతూ చాలా రోజులుగా తమ వారితో ఎటువంటి సంప్రదింపులు లేవన్నారు. ఇరాన్లో ఉద్రిక్తతల నేపథ్యంలో వారి పరిస్థితిపై తాము ఆందోళన చెందామని.. కానీ మోదీ ప్రభుత్వం చొరవతో తమ కుటుంబసభ్యులు తిరిగి వచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు. ఇరాన్ ప్రస్తుతం 10 వేలమందికి పైగా భారతీయులు (విద్యార్థులు సహా) నివసిస్తున్నట్లు అంచనా, వివిధ ప్రాంతాల్లో ఉన్న వీరిని సంప్రదించేందుకు టెహ్రాన్లోని భారత రాయబార కార్యాలయ సిబ్బంది ప్రయత్నాలు చేస్తోంది. అనేక ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడం, మరికొన్ని ప్రాంతాల్లో అప్పుడప్పుడు పనిచేస్తుండడం ఇందుకు ఇబ్బందికరంగా మారినట్లు తెలుస్తోంది. దీంతో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వారిని వేరుకునేందుకు ఎంబసీ సిబ్బంది ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. అందుబాటులో ఉన్న మార్గాల్లో దేశాన్ని వీడాలని విదేశాంగ శాఖ వారికి సూచించింది. స్వదేశానికి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నవారిని సురక్షితంగా తీసుకురావడానికి చర్యలు తీసుకుంటోంది.

# ప్రహసనంగా మారిన నోబెల్ పురస్కారం




## చర్చనీయాంశమైన ట్రంప్‌కు వెనజువెలా నేత నోబెల్ బహుమతి ధారాదత్తం

నోబెల్ ప్రైజ్.. ఈ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకోవాలని ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది శాస్త్రవేత్తలు, రచయితలు కలలు కంటారు. ఈ ఆవార్డు అందుకోవడం అత్యంత గౌరవంగా భావిస్తారు. అలాంటి పురస్కారాన్ని వెనెజువెలా విపక్ష నేత మారియా కొరీనా మచాడో.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ఇచ్చేశారు. దీంతో ఇదికాస్తా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే, వచ్చిన 'నోబెల్‌ను వదులుకోవడం కొత్తేం కాదు. గతంలో పలువురు గ్రహీతలు అనేక కారణాలతో వాటిని వేలం వేయడం, విక్రయించడం వంటివి చేశారు. 2021లో రష్యా జర్నలిస్టు దిమిత్రి మురాటోవ్ నోబెల్ శాంతి బహుమతి అందుకున్నారు. అయితే, ఆ మరుసటి ఏడాదే దాన్ని ఆయన వేలం వేయగా.. రికార్డు స్థాయిలో 100,5 మిలియన్ డాలర్లు పలికింది. ఆ మొత్తాన్ని ఉక్రెయిన్ శరణార్థుల్లో ఉన్న చిన్నారుల సంక్షేమం. కోసం యునిసెఫ్ కు విరాళంగా ఇచ్చారు. అమెరికా శాస్త్రవేత్త జాన్ నాష్ ఆర్థికశాస్త్రంలో నోబెల్ తీసుకున్నారు. ఆ అవార్డును 2019లో క్రిస్టీస్ ఆక్షన్ సంస్థ వేలం వేయగా.. 7,55,000 డాలర్లు పలికింది. ఈ మొత్తాన్ని జాన్ నాష్ పేరిట ఏర్పాటుచేసిన ట్రస్టు ఇచ్చేశారు. 1962లో అమెరికా శాస్త్రవేత్త జేమ్స్ వాట్సన్ వైద్యశాస్త్రంలో నోబెల్ అందుకున్నారు. అయితే. శాస్త్రీయ పరిశోధనల కోసం విరాళాలు సేకరించే క్రమంలో పురస్కారాన్ని ఆయన విక్రయించగా.. రష్యాకు చెందిన బిలియనీర్ అలిషెర్ ఉస్మనోవ్ కొనుగోలు చేశారు. ఆ 'పురస్కారాన్ని అలిషెర్ తన వద్ద ఉంచుకోకుండా తిరిగి వాట్సన్క ఇచ్చేశారు ఈ అవార్డు శాస్త్రవేత్త వద్ద ఉండటమే సరైందని నాడు బిలియనీర్ అన్నారు. 1938లో సోవియెట్ యూనియన్ ఫిన్లాండ్ను ఆక్రమించింది. ఆ సమయంలో ఫిన్లాండ్ ప్రజల కోసం విరాళాలు సేకరించేందుకు డెన్మార్క్ శాస్త్రవేత్తలు నీల్స్ బోర్, ఆగస్ట్ క్రోగ్ తమ నోబెల్ పురస్కారాలను వేలం వేశారు.

ఈ వేలంలో ఆవార్డు కొనుక్కున్నవారు కొంతకాలం తర్వాత డెన్మార్క్ మ్యూజియంలకు వాటిని ఇచ్చేశారు. నీల్స్ బోర్ కుమారుడు అగే బోర్ కూడా 1975లో ఫిజిక్స్ లో నోబెల్ అందుకున్నారు. దాన్ని 2011లో వేలం వేశారు. అయితే, 2013లో ఆయనకు మరోసారి నోబెల్ దక్కడం విశేషం. నాజీ సానుభూతిపరుడైన నార్వే రచయిత నట్ హామ్సును 1920లో నోబెల్ సాహిత్య పురస్కారం దక్కింది. దాన్ని ఆయన రెండో ప్రపంచ యుద్ధం సమయంలో నాజీ జర్మనీ మంత్రి జోసెఫ్‌కు బహుమతిగా ఇచ్చేశారు. అమెరికా పర్యటనలో ఉన్న మచాడో తన నోబెలను ట్రంప్ నకు ఇచ్చిన సంగతి తెలిసిందే. వెనెజువెలా ప్రజల స్వేచ్ఛ కోసం కృషి చేస్తున్న ట్రంప్ నకు ఇది గుర్తింపు అని ఆమె పేర్కొన్నారు.. ఈ పరిణామాలపై నోబెల్ కమిటీ కూడా స్పందించింది. ఇలా తన పురస్కారాన్ని మరొకరికి ఇవ్వడం చట్టబద్ధం కాదని స్పష్టంచేసింది. నార్వే నోబెల్ ఇనిస్టిట్యూట్, నోబెల్ కమిటీ నిబంధనల ప్రకారం.. ఒకసారి నోబెల్ ప్రకటించిన తర్వాత.. దాని రద్దు, బదిలీ చేయడం లేదా ఇతరులతో పంచుకోవడం కుదరదు. అయితే గ్రహీతలు తమ మెడల్ లేదా నగదు బహుమతిని ఏదైనా చేసుకునే స్వేచ్ఛ ఉంటుంది. కానీ, అధికారికంగా మాత్రం పురస్కారం వారి పేరు మీదే ఉంటుంది.

# భారత్‌ను దూరం చేసుకుంటే అధోగతే



### అమెరికా రిపబ్లికన్ పార్టీ నేత కీలకవ్యాఖ్యలు

ప్రపంచ దేశాలతో అమెరికా సంబంధాలపై ఆ దేశ కాంగ్రెస్ సభ్యుడు రిపబ్లికన్ పార్టీ నేత రిచ్ మెక్ కార్మిక్ కీలక వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ కంటే భారత్ సంబంధాలను బలోపేతం చేసుకోవడం అవసరమని ట్రంప్ యంత్రాంగానికి సూచించారు. ఎందుకంటే అమెరికాకు పెట్టుబడులు తీసుకువచ్చేది భారత్ మాత్రమేనని, పాకిస్థాన్ కాదని అన్నారు. అంతేకాకుండా ప్రతిభావంతులైన వేలాది మంది నిపుణులను, ఉద్యోగులను భారత్ సరఫరా చేస్తోందన్నారు. దేశాభివృద్ధిలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. యూఎస్ కంపెనీలు కూడా భారత్‌లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్నాయన్నారు. భారత్‌ను దూరం చేసుకుంటే అమెరికాకే నష్టమని వ్యాఖ్యానించారు. అయితే రష్యా నుంచి చమురు కొనుగోళ్లను తగ్గించుకోమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎన్నిసార్లు హెచ్చరించినప్పటికీ భారత్ మాస్కో నుంచి చమురు కొనుగోళ్లు కొనసాగిస్తుండడం ఆయనకు నచ్చట్లేదని మెక్కార్మిక్ పేర్కొన్నారు. అందువల్లే ట్రంప్ భారతీ కఠినంగా వ్యవహరిస్తున్నారన్నారు. కానీ భారత ప్రధాని నరేంద్ర మోదీ వారి జాతీయ ప్రయోజనాల గురించి అలోచించి, చౌకగా లభించే రష్యా చమురును కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు.

## పాక్‌ను నిలువరించాల్సిందే

### ఐరాసాలో భారత్ డిమాండ్

విభజన అజెండా కోసం ఐక్యరాజ్యసమితి (ఐరాస) వేదికలను పాకిస్థాన్ దుర్వినియోగం చేస్తోందని భారత్ మండిపడింది. స్వీయ నిర్ణయ హక్కును వాడుకొని, మతపరమైన వైవిధ్యం కలిగిన ప్రజాస్వామ్య దేశాల్లో వేర్పాటువాదాన్ని ప్రోత్సహించేలా మాట్లాడకుండా పాక్ను నిరోధించాలని ఐరాసను భారత్ కోరింది. ఐరాసలోని భారత శాశ్వత మిషన్ కౌన్సిలర్ ఎల్డోస్ మ్యాథ్యూ పున్నూస్ ఈ మేరకు గురువారం వ్యాఖ్యానించారు. "ప్రపంచ దేశాలన్నీ సంకుచిత ఆలోచనా దృక్పథం నుంచి బయటికొచ్చి మాట్లాడుతుంటే, పాక్ మాత్రమే విభజన అజెండాతో విషం కక్కుతోంది. జమ్మూకశ్మీర్ విషయంలో అనవసరమైన సూచనలు చేయాల్సిన అవసరం పాక్‌కు లేదు. నిరాధారమైన ఆరోపణలు, ఆబద్ధాలను ప్రచారం చేయకుండా పాక్ వాస్తవాలను గ్రహిస్తే మంచిది" అని ఎల్డోస్ స్పష్టంచేశారు.



## పట్టాలెక్కిన తొలి స్లీపర్ వందేభారత్ రైలు


### పచ్చ జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని మోదీ

భార తొలి వందేభారత్ స్లీపర్ రైలు పట్టాలెక్కింది. పశ్చిమ బెంగాల్‌లోని మాల్టాలో జరిగిన కార్యక్రమంలో ఈ అధునాతన రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు స్లీపర్ రైల్లో ప్రయాణించే విద్యార్థులతో మోదీ ముచ్చటించారు. రైలు లోపలికి వెళ్లి అందులోని సౌకర్యాలను ప్రధాని పరిశీలించారు. పశ్చిమ బెంగాల్లోని హౌవ్లో- అస్సాంలోని గువాహటి (కామాఖ్య) మధ్య ఈ రైలు రాకపోకలు సాగించనుంది. వందేభారత్ స్లీపర్ రైలు గంటకు 180 కిలోమీటర్లు గరిష్ట వేగాన్ని సాధించగలిగింది. రైల్వే భద్రత కమిషనర్ (సీఆర్ఎస్) సమక్షంలో కోటా (రాజస్థాన్) నుంచి వార్ధా (మధ్యప్రదేశ్) మధ్య తుది పరీక్షలు నిర్వహించగా రైలు ఈ వేగాన్ని చేరుకుంది. గాజు గ్లాసుల్లో నీళ్లు నింపి ఒకదానిపై ఒకటిగా ఈ రైలింజిన్లో ఉంచినా రైలు గరిష్ట వేగాన్ని చేరుకున్నప్పుడు కూడా ఏమాత్రం నీళ్లు తొణకకపోవడాన్ని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ గతంలో సామాజిక మాధ్యమాల్లో పంచుతున్నారు. ఈ రైల్లో 16 కోట్లు ఉన్నాయి. వీటిలో ఆకర్షణీయమైన (ఏసీ) స్లీపర్ బెర్తులు, అధునాతన సస్పెన్షన్ వ్యవస్థ, నిప్పును గుర్తించే వ్యవస్థలు, సీసీటీవీ నిఘా వంటివి ఉంటాయి. విమానంలో ప్రయాణించిన అనుభూతిని కలిగించేలా ఇందులో సౌకర్యాలను ఏర్పాటుచేశారు.

# అమెరికాలోకి మాదకద్రవ్యాల అక్రమ సరఫరా

అమెరికా విమానయాన సంస్థలకు అగ్రరాజ్య ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ హెచ్చరికలు జారీ చేసింది. మెక్సికో సెంట్రల్ అమెరికా, పనామా సహా తూర్పు పసిఫిక్ మహా సముద్రంలోని కొన్ని ప్రాంతాల గగనతలం మీదుగా ప్రయాణిస్తున్నప్పుడు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించింది. సైనిక కార్యకలాపాల నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ముప్పు ఎదురయ్యే అవకాశం ఉందని ఎయిర్లయిన్లను హెచ్చరించింది. ఈ మేరకు అమెరికాకు చెందిన అన్ని విమానయాన సంస్థలకు అడ్వైజరీ నోటీసు జారీ చేసింది. ఈ నోటీసు 60 రోజుల వరకు అమల్లో ఉంటుందని పేర్కొంది. "విమానం ఎంత ఎత్తులో ఉన్నా.. ల్యాండింగ్, టేకా దశల్లో ఉన్నా సరే.. వాటికి ముప్పు ఎదురయ్యే ప్రమాదం ఉంది" అని ఎస్ఏఏ నోటీసుల్లో స్పష్టం చేసింది. సాధారణంగా సమీప ప్రాంతాల్లో యుద్ధం లేదా ఉద్రిక్త పరిస్థితులు ఉన్న సమయంలో ఇలాంటి నోటీసులు జారీ చేస్తుంటారు. ఇటీవల మెక్సికోపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ప్రత్యక్షంగానే తీవ్ర హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. ఆ దేశంలో ఉన్న మాదకద్రవ్యాల ముఠాలు, స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భూతల దాడులు చేస్తామంటూ హెచ్చరించారు. లాటిన్ అమెరికాలోని మెక్సికో సహా క్యూబా, కొలంబియా వంటి దేశాలు మాదకద్రవ్యాలను తయారు చేస్తూ అమెరికాలోకి అక్రమంగా సరఫరా చేస్తున్నాయని అగ్రరాజ్య అధ్యక్షుడు ఆరోపించారు. ఈ పద్ధతి మార్చుకోకపోతే వెనెజువెలా పరిస్థితే ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కట్టడి పేరుతో ఇటీవల వెనెజువెలాపై మెరుపుదాడులు చేసిన అమెరికా సైన్యం.. ఆ దేశాధినేతగా ఉన్న నికోలస్ మదురో, ఆయన భార్యను బంధించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే మిగతా లాటిన్ అమెరికా దేశాలకూ ఆయన వార్నింగ్ ఇచ్చారు. ఈ పరిణామాల వేళ తాజాగా ఎయిర్లైన్లకు ఎఫ్ఏఏ అడ్వైజరీ నోటీసులు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. మెక్సికోపై దాడి చేసేందుకే విమానాలకు ఈ హెచ్చరికలు చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## మెక్సికోపై దాడి వ్యూహంతోనే ట్రంప్ దూకుడు



## అండర్-19 వరల్డ్‌కప్...

# బంగ్లాపై యువభారత్ ఘన విజయం

అండర్-19 ప్రపంచ కప్‌లో భాగంగా శనివారం బులవాయోలో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత యువజట్టు ఘనవిజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన యువ భారత్.. 48.4 ఓవర్లలో 238 పరుగులకు ఆలౌటైంది. 239 లక్ష్య ఛేదనలో బంగ్లాదేశ్ 28.3 ఓవర్లలో 146 పరుగులకు ఆలవుట్ అయింది. భారత బౌలర్లలో విహాన్ మల్హోత్రా నాలుగు ఓవర్లలో 14 పరుగులు ఇచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. అతడికే ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

వర్షం కారణంగా మ్యాచ్‌ను 49 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో భారత జట్టులో అభిజ్ఞాన్ కుందు (80, 112 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులు), వైభవ్ సూర్యవంశీ (72; 67 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్ లు) రాణించారు. కనిష్క్ చౌహాన్ (28) ఫర్వాలేదనిపించాడు. ఆయుష్ మాత్రే (6), వేదాంత్ త్రివేది (0) నిరాశపర్చడంతో ఆరంభంలోనే భారత్ 12 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. వైభవ్ సూర్యవంశీ దూకుడుగా ఆడటంతో భారత్ ఇన్నింగ్స్ సాఫీగా సాగింది. ఈ క్రమంలో విహాన్ మల్హోత్రా (7) ఔటవడంతో యువ భారత్.. 53 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి మళ్లీ ఇబ్బందుల్లో పడింది. 30 బంతుల్లో అర్ధ శతకం అందుకున్న వైభవ్.. తర్వాత



నెమ్మదిగా ఆడగా ఐదో స్థానంలో వచ్చిన అభిజ్ఞాన్ నిలకడగా బౌండరీలు రాబట్టాడు. ఈ జోడీ నాలుగో వికెట్ కు 99 బంతుల్లో 62 పరుగులు జోడించింది. బంగ్లాదేశ్ బౌలర్లలో ఫహద్ 5, ఇక్బాల్ 2, హకీమ్ తమీమ్ 2, పావెజ్ జిబోన్ ఒక వికెట్ పడగొట్టారు.

### వైభవ్ అరుదైన ఘనత

14 ఏళ్లకే అండర్ 19 ప్రపంచ కప్ ఆడుతున్న వైభవ్.. ఓ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. బంగ్లాదేశ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో 67 బంతుల్లో ఆరు ఫోర్లు, 3 సిక్సుల సాయంతో 72 పరుగులు చేసిన వైభవ్.. ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాడు. తన దూకుడుతో జట్టుకు శుభారంభాన్ని అందించిన వైభవ్.. కేవలం 30 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు. 14 సంవత్సరాల 296 రోజుల వయసులో పురుషుల అండర్ 19 ప్రపంచకప్‌లో 50కు పైగా స్కోరు చేసిన అతి చిన్న వయస్కుడిగా వైభవ్ చరిత్ర సృష్టించాడు. ఇప్పటివరకు ఈ రికార్డు అఫ్గానిస్తాన్ ఆటగాడు షాహిదుల్లా కమాల్(15 ఏళ్లు 19 రోజులు) పేరిట ఉంది. తాజాగా ఈ రికార్డును వైభవ్ అధిగమించాడు.

### విరాట్ కోహ్లీ రికార్డు బద్దలు..

ఇదే మ్యాచ్‌లో వైభవ్ మరో ఘనతను కూడా సాధించాడు. యూత్ వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్ల జాబితాలో విరాట్ కోహ్లీని అధిగమించాడు. 20 యూత్ వన్డేలు ఆడిన వైభవ్.. 1,047 పరుగులు చేయగా, కోహ్లీ 28 మ్యాచ్‌ల్లో 978 పరుగులే సాధించాడు. ఈ జాబితాలో భారత్ తరపున విజయ్ జోల్(1,404 పరుగులు) ముందుండగా.. మొత్తం యూత్ వన్డేల్లో బంగ్లాదేశ్ ఆటగాడు నజ్ముల్ హుస్సెన్ శాంటో(1,820 పరుగులు) అగ్రస్థానంలో ఉన్నాడు.

### నో హ్యాండ్ షేక్

భారత్-బంగ్లాదేశ్ మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. పాకిస్థాన్ తరహాలోనే బంగ్లాదేశ్ కూడా భారత్ పట్ల మొండి వైఖరిని ప్రదర్శిస్తోంది. తాజాగా.. అండర్ 19 ప్రపంచ కప్ 2026లో టాస్ సమయంలో భారత కెప్టెన్ ఆయుష్ మాత్రే, బంగ్లా వైస్ కెప్టెన్ జవాద్ అబ్రార్ పరస్పరం షేక్ హ్యాండ్ ఇచ్చుకోలేదు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గతంలో 2025 ఆసియా కప్, మహిళల వన్డే ప్రపంచ కప్‌లో పాకిస్థాన్ జట్లతో టీమిండియా షేక్ హ్యాండ్ ఇవ్వకపోవడం తీవ్ర చర్చకు దారితీసిన విషయం తెలిసిందే.

---

## సిరీస్ పట్టేస్తారా..

# నేడు కివీస్‌తో చివరి వన్డే



భారత్, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న వన్డే సిరీస్‌లో కీలకమైన చివరి మ్యాచ్ ఆదివారం జరగనుంది. మూడు వన్డే మ్యాచుల సిరీస్‌లో 1-1తో ఇరు జట్లు సమంగా ఉన్నాయి. ఇండోర్ వేదికగా ఆదివారం చివరి వన్డే జరగనుంది.సిరీస్ ఎవరి సొంతం అనేది తెలియడానికి ఈమ్యాచ్ నిర్ణయాత్మకంగా మారింది. ఇదే సమయంలో భారత్‌కు సంబంధించిన ఓరికార్డు ప్రమాదంలో పడింది. న్యూజిలాండ్ ఆ రికార్డును బ్రేక్ చేస్తుందా అనే సందేహాలు వ్యక్తమవుతు న్నాయి. సొంత గడ్డపై టీమిండియాకు తిరుగులేని రికార్డు ఉంది.మార్చి 2019 తర్వాత ఇప్పటి వరకు భారత జట్టు స్వదేశంలో ఒక్క వన్డే సిరీస్ కూడా ఓడిపోలేదు. ఇలాఉంటే 1989నుంచి న్యూజిలాండ్ జట్టు భారత్‌లో పర్యటిస్తున్నప్పటికీ.. ఒక్క వన్డే సిరీస్‌నూ గెలవలేదు. ఒకవేళ చివరి మ్యాచ్‌లో గెలిస్తే కివీస్ కెప్టెన్, జట్టు చరిత్ర సృష్టించినట్లు అవుతుంది. ఇరు జట్లూ సమ ఉజ్జీలుగా కనిపిస్తుండటంతో క్రికెట్ అభిమానులకు ఈ మ్యాచ్ ద్వారా పసందైన వినోదం గ్యారంటీ. భారత ఆటగాళ్లు ఒత్తిడిని అధిగమించి ఆడితే ఈ సిరీస్ మన సొంతమవుతుంది.

మరోవైపు.. మూడో వన్డే మ్యాచ్ టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు అగ్నిపరీక్ష కానుంది. అతడు హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టినతర్వాత టీమిండియా పలు ఓటములు చవి చూసింది. శ్రీలంకలో వన్డే సిరీస్ కోల్పోవడం, స్వదేశంలో టెస్టు మ్యాచ్‌ల్లో ఓడిపోవడంతో అతనిపై విమర్శలు వచ్చాయి. జనవరి 18న ఇండోర్‌లో జరిగే చివరి వన్డేలో ఓడితే మాత్రం గంభీర్ ఖాతాలో మరో చెత్త రికార్డు చేరుతుంది.

### గిల్ ముందుజాగ్రత్త

చివరి మ్యాచ్ నేపథ్యంలో ఓ ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది.ఇండోర్‌లో ఇటీవల కలుషితతాగునీటి వల్ల పలువురు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత టీమ్ మేనేజ్‌మెంట్ ఆటగాళ్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఆటగాళ్లున్న ఫైవ్ స్టార్ హోటల్, మైదానంలో పరిశుభ్రమైన నీరందించే ఏర్పాట్లు చేస్తున్నారు. అయినప్పటికీ టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మరింత ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నాడు.తాను బసచేస్తున్న హోటల్‌లోని తన గదిలో రూ.3లక్షలు ఖరీదు చేసే వాటర్ ప్యూరిఫయర్‌ను బిగించుకున్నట్లు సమాచారం. ఈ పరికరానికి ఆర్వో వాటర్,ప్యాకేజ్డ్ వాటర్‌నుకూడా మళ్లీ ప్యూరిఫై చేసే సామర్థ్యం ఉన్నట్టు తెలుస్తోంది.

### విరాట్ ఎప్పటి నుంచో..

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఎప్పటి నుంచో తాను తాగే నీటి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాడు. అతడు ఫ్రాన్స్‌లోని ఆల్ప్స్ పర్వతాల నుంచి సేకరించే ప్రత్యేక వాటర్‌ను మాత్రమే వినియోగిస్తాడన్న విషయం అందరికీ తెలిసిందే.

---

## వరుసగా రెండో మ్యాచ్‌లోనూ

# ముంబయిపై యూపీ గెలుపు



- రాణించిన మెగ్ లానింగ్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్
- మహిళల ప్రీమియర్ లీగ్

మహిళల ప్రీమియర్ లీగ్-2026లో భాగంగా శనివారం నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియం వేదికగా ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో యూపీ వారియర్స్ 22పరుగుల తేడాతో విజయం సాధించింది.తొలుత బ్యాటింగ్ చేసిన యూపీ వారియర్స్..20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో ముంబయి 165/6కే పరిమితమైంది. ఆరు, ఏడు స్థానాల్లో వచ్చిన అమేలియా కెర్ (49 నాటౌట్; 28 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), అమన్‌జ్యోత్ కౌర్ (41; 24 బంతుల్లో 4ఫోర్లు, 3 సిక్స్‌లు) మాత్రమే రాణించారు. టాప్-4 బ్యాటర్లు హేలీ మాథ్యూస్ (13), సజీవన్ సజన (10), నాట్ సీవర్ బ్రంట్ (15), హర్మన్ ప్రీత్ కౌర్(18) తక్కువ స్కోరుకే వెనుదిరి గారు. యూపీ బౌలర్లలో శిఖా పాండే 2, క్రాంతి గౌడ్, సోఫీ ఎకిలిస్టన్, దీప్తి శర్మ, క్లో ట్రయాన్ ఒక్కో వికెట్ పడ గొట్టారు.ఈ సీజన్‌లో గత మ్యాచ్‌లోనూ ముంబయిపై గెలిచి గెలుపు ఖాతా తెరిచిన వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఆ జట్టును ఓడించటం విశేషం.

టాస్ గెలిచిన ముంబై జట్టు ఫీల్డింగ్ ఎంచుకుని తొలుతయూపీని బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఆది నుంచే చెలరేగుతూ ఆడిన యూపీ బ్యాటర్లు భారీ స్కోరు సాధించారు. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లుకోల్పోయి 187పరుగులు చేశారు. కెప్టెన్ మెగ్ లానింగ్(70; 45 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సులు), ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (61; 37బంతుల్లో 7ఫోర్లు, 3 సిక్సులు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగి ఆడారు. హర్లీన్ డియోల్(25), క్లో ట్రయాన్ (21) కూడా రాణించారు. లానింగ్, లిచ్‌ఫీల్డ్ రెండో వికెట్‌కు 74 బంతుల్లో ఏకంగా 119 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. లానింగ్ 34 బంతుల్లో అర్ధ శతకం చేయగా.. అమన్‌జ్యోత్ వేసిన 13ఓవర్‌లో లిచ్‌ఫీల్డ్ రెండు ఫోర్లు, రెండు సిక్స్‌లు బాది 33బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుంది. అదే ఓవర్‌లో చివరికి బంతికి ఔటైంది. యూపీ చివరి రెండు ఓవర్లలో 10 పరుగులు చేసి ఐదు వికెట్లు కోల్పోయింది. ముంబై బౌలర్లలో అమేలియా కెర్ 3, నాట్‌సీవర్ 2, నికోలి కేరీ, అమన్‌జ్యోత్, హేలీ మాథ్యూస్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

---

## బంగ్లా కవ్వింపు చర్యలు..

### భారత అధికారికి వీసా నిరాకరణ

భారత్-బంగ్లాదేశ్‌ల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. బంగ్లా ఆటగాడు ముస్తాఫిజుర్ రెహమాన్‌ను ఐపీఎల్ నుంచి రిలీజ్ చేయడంతో వివాదం రాజుకుంది. ఈ పరిణామం తర్వాత టీ20 ప్రపంచ కప్‌లో పాల్గొనడానికి భారత్‌కు రాబోమని, శ్రీలంకకు మ్యాచ్ వేదికలు మార్చాలంటూ బంగ్లా క్రికెట్ బోర్డు ఐసీసీని కోరింది. దీంతో ఈ వివాదానికి ఐసీసీ తెరదించే ప్రయత్నం చేస్తోంది. అయితే.. ఇందులో భాగంగా ఇద్దరు ఐసీసీ అధికారులు బంగ్లాదేశ్ రాజధాని ఢాకా వెళ్లాల్సి ఉంది. ఈ నేపథ్యంలో భారత్‌కు చెందిన ఓ అధికారికి బంగ్లాదేశ్ వీసా నిరాకరించింది. దీంతో ఐసీసీ హెడ్ ఆఫ్ యాంటీ కరప్షన్ అండ్ సెక్యూరిటీ అధికారి ఆండ్రూ ఎఫ్గ్రేవ్ ఒక్కరే శని వారం ఢాకాకు వెళ్లినట్టు తెలుస్తోంది. వీసా నిరాకరణ విషయంపై ఐసీసీ అధికారికంగా స్పందించలేదు. సమస్యా పరిష్కారానికి ఐసీసీ చొరవ చూపుతుంటే.. బంగ్లాదేశ్ ఇలా ప్రవర్తించడంతో ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ సైతం అసంతృప్తికి గురైనట్లు తెలుస్తోంది. టీ20వరల్డ్ కప్ మరో మూడు వారాల్లో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఐసీసీ ప్రతినిధుల బంగ్లాదేశ్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటికిప్పుడు వేదికల మార్పు దాదాపు అసాధ్యం కాబట్టి.. షెడ్యూల్ ప్రకారమే మ్యాచ్‌లు ఆడేందుకు బంగ్లాదేశ్‌ను ఒప్పించేందుకు ఐసీసీ ప్రయత్నం చేయనున్నట్లు సమాచారం. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) అధికారులతో నేరుగా సమావేశమైన తర్వాత.. ఐసీసీ తుది నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశముంది.

ఐసీసీ టీ20 ప్రపంచ కప్ 2026 ఫిబ్రవరి 7న ప్రారంభం కానుంది. షెడ్యూల్ ప్రకారం.. బంగ్లాదేశ్ గ్రూప్ స్టేజ్‌లో తన మ్యాచ్‌లను కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఫిబ్రవరి 7న వెస్టిండీస్‌తో, 9న ఇటలీతో, 14న ఇంగ్లాండ్‌తో, 17న ముంబైలోని వాంఖడే స్టేడియంలో నేపాల్‌తో ఆడాల్సి ఉంది.

చైతన్య రథం
సినిమా
ఆదివారం 18 జనవరి 2026 IX

# సారా ఒప్పుకోకపోతే.. 'యుఫోరియా' లేదు: గుణశేఖర్



'యుఫోరియా'తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు దర్శకుడు గుణశేఖర్. ఆయన దర్శకత్వంలో భూమిక, సారా అర్జున్, గౌతమ్ వాసుదేవ్ మేనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న చిత్రమిది. ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. గుణశేఖర్ మాట్లాడుతూ ఈ సినిమా అందరినీ ఆలోచింపచేస్తుందన్నారు. "యుఫోరియా'కు ప్రతి కుటుంబంలో ఒకరు కనెక్ట్ అవుతారు. కొత్త వాళ్లతో ఈ సినిమా చేయాలని 6 నెలలు ఆడిషన్స్ చేశాం. 20 మంది కొత్తవారిని తీసుకున్నాం. టీనేజ్ అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ముఖ్యమైన వయసు. ఈ సినిమాలోని ప్రధాన పాత్రల్లో నటించినవారు అందరూ టీనేజ్ వాళ్లే. కథ వింటున్నప్పుడే సారా అర్జున్ అయితే బాగుంటుందని నిర్మాత నీలిమ చెప్పింది. సారా అర్జున్ నటిస్తేనే ఈ సినిమా తీద్దాం లేదంటే ఆపేద్దాం అని ఆమెతో చెప్పా. రేపు సినిమా చూశాక కూడా అందరూ ఇదే అంటారు. అంత గొప్పగా నటించింది. ఈ అమ్మాయి వయసు 17 ఏళ్లు అయినా..చాలా ఉన్నతంగా ఆలోచిస్తుంది. ఈ రోజుల్లో ఇలాంటి కథ కచ్చితంగా ప్రేక్షకులకు చెప్పాలంటూ వెంటనే ఓకే చేసేసింది. ఇందులో ఎంతో కీలకమైన మరో పాత్ర వింధ్య.. ఈ పాత్ర కోసం భూమికని తీసుకుందాం అని నీలిమ చెప్పగానే వద్దు అన్నాను. ఎందుకంటే భూమికను తల్లి పాత్రలో చూడడం నాకు ఇష్టం లేదు. తను ఎప్పటికీ నాకు స్వప్నగానే ('ఒక్కడు'లో భూమిక పాత్ర పేరు) కనిపిస్తుంది. కానీ, ఆమె అయితేనే ఈ పాత్రకు న్యాయం చేస్తుందనిపించింది. వెళ్లి అడగ్గానే కొడుతుందేమో అనుకున్నా.. స్క్రిప్ట్ చదివి ఓకే చేసింది. కొందరు నటీమణులు కేవలం గ్లామర్ పాత్రలే చేస్తామంటున్నారు. 50ఏళ్లు వచ్చినా 5,6 ఏళ్ల వాళ్లకు మాత్రమే తల్లిగా చేస్తామని రూల్స్ పెడుతున్నారు. భూమిక ఈ సినిమాలో 17 ఏళ్ల అబ్బాయికి అమ్మగా నటించి వాటిని బ్రేక్ చేసింది. 'యుఫోరియా' రిలీజ్ అయిన తర్వాత ఆమె కచ్చితంగా ప్రశంసలు అందుకుంటుంది. హ్యాట్సాఫ్ భూమిక.. అంటూ గుణశేఖర్ ప్రశంసలు కురిపించారు.

### ఆసక్తికరంగా టీజర్

తల్లిదండ్రులు మనతో పాటు.. మన కలల్ని కూడా కంటారనే ఆసక్తికర లైన్‌తో 'యుఫోరియా' ట్రైలర్ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఉన్నత భవిష్యత్తు ఉన్న యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడితే.. వారి జీవితం ఏమవుతుంది అనే కథాంశంతో ఇది రూపొందినట్లు అర్థమవుతోంది.

# వెటకారంతో కూడిన మంచి ఫ్రెండ్ సునీల్



సునీల్ తనకు వెటకారంతో కూడిన మంచి ఫ్రెండ్ అని హీరో రవితేజ చెప్పాడు. తన కొత్త సినిమా 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సక్సెస్ మీట్ లో రవితేజ మాట్లాడాడు. సందడి చేశారు. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన సునీల్ తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. 'భద్ర' సినిమా నుంచి కలిసి ప్రయాణం చేస్తున్నామన్నారు. మొదట్లో కమెడియన్‌గా నవ్వించిన సునీల్ తరువాత పాత్రల ఎంపిక మార్చుకున్నాడన్నారు. సీరియస్ పాత్రలే కాకుండా అప్పుడప్పుడు కామెడీ రోల్స్ కూడా చేయాలంటూ సునీల్‌కు సూచించారు. తన తల్లి, కమెడియన్ సునీల్ తల్లి బెస్ట్ ఫ్రెండ్స్ అని, వాళ్ల వెటకారమే తమకు వచ్చిందని పేర్కొన్నారు.

ఈ సినిమా డైరెక్టర్ కిశోర్ తిరుమల గురించి మాట్లాడుతూ.. "ఇంతకుముందే కిశోర్‌తో ఓ సినిమా చేయాలనుకున్నా సాధ్యం కాలేదు. బాలు మహేంద్ర, జంధ్యాల, క్రేజీ మోహన్ లాంటి వారు ఎలా రాస్తారో కిశోర్ అలా రాస్తాడు. అందుకే ఆయన రైటింగ్ అంటే నాకు ఎప్పటినుంచో ఇష్టం. ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్ ను బాగా డీల్ చేస్తాడు. సహజమైన కామెడితో కూడిన ఇలాంటి సినిమాని రాఘవేంద్రరావు దర్శకత్వంలో చేయాల్సింది కానీ.. అది వర్కౌట్ కాలేదు. ఇద్దరు అమ్మాయిల మధ్య నలిగిపోయే వ్యక్తిగా నటించాలన్న డ్రీమ్ కిశోర్‌తో నెరవేరింది. 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' విజయం క్రెడిట్‌ను కిశోర్, సంగీత దర్శకుడు భీమ్స్‌కే ఇస్తానని రవితేజ చెప్పాడు.


# ఓటీటీలోకి సుదీప్ మార్క్



కన్నడ నటుడు సుదీప్ హీరోగా నటించిన యాక్షన్ డ్రామా మూవీ 'మార్క్'. విజయ్ కార్తికేయ దర్శకత్వం వహించిన ఈ సినిమా గతేడాది డిసెంబర్ 25న బాక్సాఫీసు ముందుకువచ్చి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడీ చిత్రం ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జనవరి 23 నుంచి జియో హాట్ స్టార్ వేదికగా తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, మలయాళ భాషల్లో అందుబాటులోకి రానున్నట్లు తెలిపింది.

కథేంటంటే: పోలీస్ ఆఫీసర్ అజయ్ మార్కండేయ, మార్క్‌గా రౌడీలను అంతం చేస్తుంటాడు. మార్క్ ఉన్న పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రగ్స్ ఉన్నట్లు సమాచారం వస్తుంది. అదే సమయంలో సీఎం కావాలని కోరుకుంటున్న ఆదికేశవ (షైన్ టామ్ చాకో)తో పాటుగా 18 మంది పిల్లలు ఆ ప్రాంతంలో కిడ్నాప్ అవుతారు. ఈ రెండూ పెద్ద సవాళ్లుగా మారతాయి. అసలు ఈ రెండింటికీ లింక్ ఉందా? మార్క్.. ఆ 18 మంది పిల్లలని కాపాడగలిగాడా లేదా? మార్క్ సస్పెండ్ అవడానికి కారణం ఎవరు? అనే విషయాలు తెరపై చూసి తెలుసుకోవాలి.

# గోవిందాను క్షమించే ప్రసక్తే లేదు..



బాలీవుడ్ సీనియర్ నటుడు గోవిందా వ్యక్తిగత జీవితం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఆ మధ్య గోవిందాపై ఆయన సతీమణి సునీత ఆహుజా సంచలన ఆరోపణలు చేసింది. గోవిందాకు మరో అమ్మాయితో వివాహేతర సంబంధం ఉందని ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. ఆ తర్వాత గోవిందా పర్సనల్ లైఫ్‌పై రకరకాల పుకార్లు వచ్చాయి. ప్రస్తుతం సునీత, గోవిందా వేరు వేరుగా ఉంటున్నారు. విడాకులు కూడా తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి.కానీ అందులోవాస్తవం లేదని స్వయంగా సునీతనేచెప్పింది. అయితే తన భర్తకు వేరే అమ్మాయితో సంబంధం ఉందనేది వందశాతం నిజమని చెబుతోంది.తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలోనూ అదే విషయంపై మట్లాడారు. చాలా మంది అమ్మాయిలు మీ దగ్గరు వస్తారు. కానీ మీ బుద్ధి ఎక్కడికి పోయింది. 63ఏళ్ల వయసు వచ్చింది. టీనా(కూతురు)కి పెళ్లిచేయాల్సిన బాధ్యత మీపైఉంది.యశ్(కొడుకు)కి కెరీర్ ఉంది. నిన్ను క్షమించే ప్రసక్తే లేదు గోవిందా.. అని భర్తకు సునీత వార్నింగ్ ఇచ్చింది. ఇంకా మాట్లాడుతూ..'నేను నేపాల్ అమ్మాయిని. ఖుక్రీ (ఆయుధం) బయటకు తీస్తే..అందరూ ఇబ్బంది పడతారు. అందుకే జాగ్రత్తగా ఉండమని అతని చెప్పా' అని సునీత అన్నారు. కాగా.. సునీతా అహుజా, గోవిందల పెళ్లి 1987లో జరిగింది వీరికి ఇద్దరు పిల్లలు. గత ఏడాదిగా వీరిద్దరు వేరు వేరుగా జీవితాన్ని కొనసాగిస్తున్నారు.

# కామెడీ కథలతో ఎవరూ రావటం లేదు..



ఇటీవల 'పరాశక్తి'తో పలకరించిన హీరో శివకార్తికేయన్ నిరాశ పరిచారు. సుధా కొంగర దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. ఇందులో వినోదాత్మక సన్నివేశాలు లేవని అందుకే హిట్ కాలేదని విశ్లేషణలు వచ్చాయి. తాజాగా ఈ విషయంపై శివకార్తికేయన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. తన వద్దకు ఎవరూ ఫుల్ లెంగ్త్ కామెడీ స్క్రిప్ట్ తీసుకురావడం లేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ మధ్య నా వద్దకు హాస్యానికి ప్రాధాన్యం ఉన్న కథలు రావడం లేదు. కామెడీ సినిమాలు ఎందుకు చేయడం లేదని అందరూ అడుగుతున్నారు. కానీ, ఎవరూ అలాంటి స్క్రిప్ట్ తీసుకురావడం లేదు. బడ్జెట్‌తో సహా ఎన్నో అంశాలు దీంతో ముడిపడి ఉంటాయని నేను అర్థం చేసుకోగలను. 'పరాశక్తి', 'అమరన్ లాంటి సినిమాలు నాలోని వేరే కోణాన్ని ప్రేక్షకులకు పరిచయం చేశాయి. వరుసగా ఇలాంటి చిత్రాల్లో నటించడం వల్ల నేను ఎంటర్‌టైనర్లు చేయడం మిస్ అవుతున్నాను. ప్రస్తుతం పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రానికి కథను ఎంచుకునే పనిలో ఉన్నా. త్వరలోనే దీనిపై ప్రకటన చేస్తా" అని శివకార్తికేయన్ తెలిపారు.

పీరియాడిక్ పొలిటికల్ యాక్షన్ డ్రామా 'పరాశక్తి' ప్రకటించిన నాటినుంచి వివాదాల్లో చిక్కుకుంది. ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొని జనవరి 10న ప్రేక్షకుల ముందుకువచ్చి ఆశించిన ఫలితం అందుకోలేకపోయింది. అయితే, ఉద్దేశపూర్వకంగా కొందరు దానిపై నెగెటివ్ రివ్యూలు రాశారని అందుకే ఇది ఆదరణను సొంతం చేసుకోలేకపోయిందని చిత్రబృందం పలు సందర్భాల్లో అసహనం వ్యక్తం చేసింది.

# మతం కారణంగానే అవకాశాలు తగ్గాయి: రెహమాన్



సంగీత ప్రపంచంలో మేటి ఏఆర్ రెహమాన్... కోలీవుడ్, టాలీవుడ్, బాలీవుడ్.. ఇలా అన్ని భాషల్లోనూ తన సత్తా చూపించాడు. పుట్టుకతోనే హిందూ అయిన ఇతడు తర్వాత ముస్లిం మతానికి మారి పోయాడు. అయితే తాను ముస్లిం అవడం వల్ల బాలీవుడ్‌లో సరైన అవకాశాలు రాలేదంటూ అతడు చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఏఆర్ రెహమాన్ మాట్లాడుతూ..రోజా, బాంబే,దిల్ సే వంటిహిట్ సినిమాలకు సంగీతం అందించినప్పటికీ నేను బాలీవుడ్‌లో ఔట్‌సైడర్ లానే ఫీల్ అయ్యేవాడిని. కానీ తాళ్ సినిమా పాటలు ఉత్తరాదిన ప్రతి ఇంట్లోకి చేరాయి. ఇప్పటికీ ఎంతోమంది ఉత్తరాది వాళ్లు ఆ మూవీ పాటలు వింటూనే ఉంటారు. ఎందుకంటే అందులో కొంత పంజాబీ, కొంత హిందీ మ్యూజిక్ మిక్స్ అయి ఉంటుంది. అప్పుడు నాకు పంజాబీ సంగీతంపై మరింత ఆసక్తి కలిగింది. అలా సుక్వీందర్ సింగ్‌ను కలిశాను. తనతో కలిసి చేసిన 'చయ్య చయ్య', 'జై హూ..' పాటలు ఎంత ఆదరణ పొందాయో మీ అందరికీ తెలిసిందే. అయితే ఎనిమిదేళ్లుగా నాకు బాలీవుడ్‌లో అవకాశాలు తగ్గాయి. బహుశా దీనికి ఇండస్ట్రీలో మారినవాతావరణం ఒక కారణమైతే.. నా మతం కూడా మరో కారణం కావొచ్చు. ఏదేమైనా నాకు నా కుటుంబానితో గడిపేందుకు సమయం దొరికిందనుకుంటాను. అయినా పనికోసం నేను పాకులాడటం లేదు. పనే నా దగ్గరకు రావాలని అనుకుంటాను. నా వృత్తిపట్ల నాకున్న నిబద్ధతే నాకు అవకాశాలు తెచ్చి పెడుతుందని భావిస్తున్నాను అని చెప్పుకొచ్చాడు.

అయితే రెహమాన్ చేసిన ఈవ్యాఖ్యలపై తీవ్ర దుమారం చెలరేగుతోంది. మతమే అడ్డంకైతే ఇండస్ట్రీలో ఇన్ని అవకాశాలు వచ్చేవే కాదని పలువురు సోషల్ మీడియా వేదికగా తప్పుపడుతున్నారు. రామాయణం మూవీలో ఛాన్స్ నీ మతం చూసే ఇచ్చారా అని కొందరు మండిపడుతున్నారు.